అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 20-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



నైరుతి వచ్చేసింది
నికోబార్ దీవులను తాకిన రుతు పవనాలు
22 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం
5లో..

నేటి నుంచి ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు
80 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 2,86,386 మంది దరఖాస్తు 11లో..
- 15 నిమిషాల ముందే గేట్ మూసివేత

సంపుటి : 10 సంచిక : 140
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
12 పేజీలు వెల : 6.50

క్యాబినెట్‌కు ఈసీ ఓకే
నేడు భేటీ..అయితే షరతులు వర్తిస్తాయి



- విభజన సమస్యలు, రుణమాఫీపై చర్చించకూడదు
- ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులెవ్వరూ రాకూడదు

నిబంధనలు విధించిన ఎన్నికల సంఘం

- సర్కార్‌పై బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు
- విపక్షాలపై కాంగ్రెస్ ఎదురుదాడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు రోజులుగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైన మంత్రివర్గ సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు అనుమతించింది. అయితే షరతులు వర్తిస్తాయని పేర్కొంది. ఈసీ ఆమోదం తెలపడంతో మంత్రివర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం సర్క్యులర్ జారీ చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మంత్రివర్గ సమావేశంలో అత్యవసర అంశాలు మాత్రమే చర్చించాలని ఈసీ కండీషన్ పెట్టింది. తక్షణం అమలు చేయాల్సిన వాటి మీద మాత్రమే సమావేశం నిర్వహించాలని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతు రుణమాఫీ, ఉమ్మడి రాజధాని హైదరాబాద్ తదితర విభజన సమస్యలపై ఈ భేటీలో చర్చించకూడదని ఈసీ తేల్చి చెప్పింది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులెవ్వరూ మంత్రివర్గ సమావేశంలో పాల్గొనకూడదని షరతు విధించింది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత క్యాబినెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్‌ను అనుమతి కోరింది. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు ఆయన విన్నవించారు. ఈసీ నుంచి అనుమతి వస్తుందనే నమ్మకంతో శనివారం సమావేశానికి ఏర్పాట్లు చేశారు. చివరి వరకు అనుమతి రాకపోవడంతో అది రద్దయింది. ఈ క్రమంలో సీఎం మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని నిర్ణయించిన నేపథ్యంలో ఎట్టకేలకు ఈసీ పలు కండీషన్లతో అనుమతించింది. ప్రకృతి వైపరీత్యాలు మొదలగు అత్యవసర అంశాలపై మాత్రమే చర్చించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో కీలక అంశాలేవి అజెండాలో లేకుండానే మంత్రివర్గ సమావేశం సోమవారం సాదాసీదాగా జరగనుంది.

రాజకీయ రంగు పులుముకున్న క్యాబినెట్

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఏర్పాటు రాజకీయ రంగు ...5లో

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఎన్నికల ప్రచారంలో మతపరమైన వ్యాఖ్యలు
- పాలకుల కనుసన్నల్లో భావప్రకటనా స్వేచ్ఛ
- కార్పొరేట్ల చేతిలో మీడియా
- వాణిజ్య ప్రకటనలపై బీహెచ్‌పీ దాడులు




సుందరయ్య స్మారకోపన్యాసంలో ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎస్ మురళీధర్ ఆందోళన



"ప్రశ్నను సహించలేరు. విమర్శను భరించలేరు. పరమత సహనం, లౌకికత్వం లేనేలేవు. చివరకు టీవీల్లో వచ్చే మత సామరస్య ప్రకటనలపైనా దాడులు చేస్తున్నారు. యువతరానికి విషయం పరిజ్ఞానం లేకుండా, కేవలం మతం అనే మత్తులో ఊగేలా చేస్తున్నారు. భావప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు. వారు వెల్లడించిన భావాలే స్వేచ్ఛగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నారు. టీవీలు, ఫోన్లలో మనం ఏ చూడాలో కూడా ఇంటర్నెట్ నియంత్రణ ద్వారా వారే నిర్ణయిస్తున్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయనడానికి ఇంతకంటే ఆధారాలు ఇంకేం కావాలి!!"

- జస్టిస్ ఎస్ మురళీధర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారతదేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నదని ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని, పోరాడి సాధించుకున్న రాజ్యాంగ హక్కులు కూడా నిష్ఫలం అవుతున్నాయనీ, భావప్రకటనా స్వేచ్ఛ స్వీయ నిర్బంధంలో ఉండేలా కట్టడి చేయబడుతున్నదని విశ్లేషించారు. ఆదివారంనా డిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం- భావప్రకటనా స్వేచ్ఛ-నేటి వాస్తవాలు' అంశంపై ఆయన పుచ్చలపల్లి సుందరయ్య 39వ స్మారకోపన్యాసం చేశారు. భవిష్యత్ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అనీ, ఆయన నాయకత్వం ఎప్పుడూ పేదల పక్షానే ఉండేదని కొనియాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటనా స్వేచ్ఛను సూచిస్తుందనీ, ఈ హక్కును సాధించుకోవడానికి బీఎస్ రావు, కేఎ మున్షీ, కమ్యూనిస్టు నాయకుడు ఏకే గోపాలన్ వంటి వారిమధ్య అనేక తర్జనభర్జనలు, వాద ప్రతివాదనలు జరిపాకే ఈ ఆర్టికల్ దేశప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ స్వేచ్ఛకు పాలకులు సంకెళ్లు వేసారనీ, అనేక షరతులు, నిర్బంధాలు విధిస్తూ, రాజ్యాంగస్ఫూర్తిని ప్రశ్నార్థకం చేస్తున్నారని అన్నారు. హిందూ మితవాదులు భావ ప్రకటన పేరుతో ఎన్నికల సభల్లో మతాల గురించి ఇష్టానుసారం ...5లో

నేడు ఐదో దశ పోలింగ్
8 రాష్ట్రాల్లో 49 లోక్‌సభ స్థానాలు



- ఒడిశాలో 35 అసెంబ్లీ స్థానాలు
- 8.95 కోట్ల ఓటర్లు..
- 94,732 పోలింగ్ కేంద్రాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నేడు ఐదో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 49 లోక్‌సభ ..11లో

ఇండియా బ్లాక్‌కు ఆదరణ
రాహుల్, అఖిలేశ్ సభకు పోటెత్తిన జనసందోహం



తొక్కిసలాట భయంతో ప్రసంగించకుండానే వెనుతిరిగిన నేతలు

- బీజేపీ వర్గాల్లో ఆందోళన

లక్నో : కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, ఎస్పీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్ సంయుక్తంగా పాల్గొంటున్న బహిరంగ సభకు జనం పోటెత్తారు. భద్రతా సిబ్బంది ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు విరుచుకుంటూ నాయకులను చూసేందుకు అభిమానంతో ఎగబడ్డారు. భారీగా హాజరైన జనాన్ని చూసిన నాయకులిద్దరూ ముందుగా సంతోషించినా.. తొక్కిసలాట జరుగుతుందనే భయంతో సభలో ఎక్కువ సేపు ఉండకుండా, ప్రసంగించకుండానే ..11లో

ఆపరేషన్ ఝాడు(చీపురు)
ఆప్‌ను ఖతం చేయటానికి ప్రధాని మోడీ వ్యూహం



- ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్
- బీజేపీ కార్యాలయానికి ఆప్ భారీ ప్రదర్శన
- అడ్డుకున్న పోలీసులు..144 సెక్షన్ విధింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆప్‌ను అంతమొందించేందుకు బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఆప్ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఆప్ నేతలను ..11లో



గంగమ్మ ప్రక్షాళన జరిగేనా?

నది నిండా మురుగు... పారిశ్రామిక వ్యర్థాలే

పదేండ్లలో రూ.40 వేల కోట్లు ఖర్చు

- అయినా ఆగని దుర్గంధం...తగ్గని కాలుష్యం
- పట్టించుకోని కేంద్రం

'2014లో నేను మొదటిసారి పోటీ చేసినప్పుడు గంగమ్మ తల్లి నన్ను వారణాసికి పిలిచిందని అనుకున్నాను. ఇప్పుడు పదేండ్ల తర్వాత గంగమ్మ తల్లి నన్ను దత్తత తీసుకున్నదని భావిస్తున్నా. కాశీ (వారణాసి)కి, నాకు మధ్య ఉన్న అనుబంధం తల్లీ కొడుకుల సంబంధం' అని ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 7వ తేదీన ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. వారం రోజుల తర్వాత అంటే 14వ తేదీన మరో ఇంటర్వ్యూలో అవే మాటలను పునరుద్ఘాటించారు. తన తల్లి మరణానంతరం ఇప్పుడు గంగమ్మే తన తల్లి అయిందని ఆయన చెప్పారు. 14వ తేదీన వారణాసిలో నామినేషన్ దాఖలు చేయడానికి ముందు మోడీ గంగా హారతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయితే ఎన్ని మాటలు చెప్పినా, ఎన్ని పూజలు చేసినా గంగా నది పది సంవత్సరాల క్రితం ఎలా ఉన్నదో ఇప్పుడూ అలాగే కన్పిస్తోంది. అదే దుర్గంధం...అదే కాలుష్యం.

వారణాసి : ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత 2014లో మోడీ గంగా నది ప్రక్షాళన కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా నమామి గంగ ప్రాజెక్టును చేపట్టారు. ఈ పది సంవత్సరాల కాలంలో ఆ ప్రాజెక్టుపై రూ.40,000 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఇప్పటికీ ఆ నదీ జలాలు నలుపు రంగులోనే కలుషితమై ఉన్నాయి. తాగేందుకు అవి ఏ మాత్రం పనికిరావు. నదిని స్వచ్ఛ పరచిన దాఖలాలు కూడా పెద్దగా కన్పించడం లేదు. అక్కడ ఏర్పాటు చేసిన మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు సమర్థవంతంగా పనిచేయడం లేదు. కొన్ని ప్లాంట్లు మూతపడ్డాయి. కాగితాలపై మాత్రం అవి పనిచేస్తూనే ఉన్నాయి. నియంత్రణ లేని ఇసుక తవ్వకాలు, డ్రెడ్జింగ్ పనులు, పర్యాటక ప్రాజెక్టులతో పాటు నదీ జలాల అనుసంధానం వంటి పైప్‌లైన్ ప్రాజెక్టులు నదికి నష్టం కలిగిస్తున్నాయని ..11లో

మోడీకి ఇస్లాం ఫోబియా
పట్టుకుందేమో..!
మత ప్రాతిపదికన బీజేపీ పాలన



- రామమందిరాన్ని పడగొట్టాల్సిన అవసరం ఏంటి?
- ప్రజాస్వామ్య విప్లవం కోసం పోరాటం చేద్దాం..
- ప్రజల కోసమే కమ్యూనిస్టుల పోరాటం
- కమ్యూనిస్టు సారథ్యంలోనే ఆదర్శపాలన : ఖానాపురం హవేలీ సీపీఐ(ఎం) కార్యాలయ ప్రారంభోత్సవ సభలో కేరళ మాజీ మంత్రి, ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు శైలజా టీచర్
- రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతుతో ఎరుపెక్కిన ఖమ్మం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఇస్లాం ఫోబియా పట్టుకుందేమో.. అందుకే హిందువుల ఆభరణాలు ముస్లింలకు.. ముస్లింల ఆభరణాలు హిందువులకంటూ ఏవేవో మాట్లాడుతున్నారని కేరళ మాజీ మంత్రి, ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు శైలజా టీచర్ విమర్శించారు. ఇండియా కూటమి వస్తే రామమందిరాన్ని పడగొడుతుందంటూ అపోహలు సృష్టిస్తున్నారన్నారు. కేంద్రంలో మతప్రాతిపదికన బీజేపీ పాలన సాగుతోందన్నారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీ సీపీఐ(ఎం) కమిటీ ఇందిరానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌ను ఆదివారం సాయంత్రం శైలజా టీచర్ ప్రారంభించారు. అనంతరం ..5లో




పతంజలికి మరో దెబ్బ

నాణ్యతా పరీక్షలో సోన్‌పాపిడి విఫలం
కంపెనీ అధికారి సహా ముగ్గురికి జరిమానాతో పాటు శిక్ష

న్యూఢిల్లీ : పతంజలికి మరో ఎదురుదెబ్బ తగిలింది. సోన్‌పాపిడి నాణ్యతా పరీక్షలో విఫలమవ్వడంతో ఆ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సహ ముగ్గురు వ్యక్తులకు పిథోరాగఢ్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2019లో ఉత్తరాఖండ్‌లోని పిథోరగఢ్‌లోని బెరినాగ్ మెయిన్ మార్కెట్‌లోని లీలాధర్ పథక్ దుకాణంలో పతంజలి నవరత్న ఇలాచీ సోన్ పాపిడి ...11లో

సింగపూర్‌లో కోవిడ్ పంజా
వారం వ్యవధిలో కరోనా కేసులు రెట్టింపు



సింగపూర్ సిటీ : వారం రోజుల వ్యవధిలోనే సింగపూర్‌లో కోవిడ్ కేసులు రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తుంది. ఈ నెల 5 నాటికి 13,700గా ఉన్న కేసుల సంఖ్య ఈ నెల 11 నాటికి 25,900కు చేరుకున్నాయి. అలాగే రోజుకు ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య 181 నుంచి 250కు చేరుకుంది. అయితే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చేరే కేసులు సంఖ్య తక్కువగానే ఉండటం కొంచెం ఉపశమనం కలిగిస్తుంది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పతుల సామర్థ్యాన్ని, ప్రజా ఆస్పత్రుల సంఖ్య పెంచడానికి సింగపూర్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అలాగే అత్యవసరం కాని సర్జరీలను తగ్గించాలని ఆస్పతులకు సూచించింది. ప్రభావం తక్కువగా ఉన్న రోగులను హోమ్ కేర్‌కు లేదా పరివర్తన సంరక్షణ ...11లో



సూపర్ సన్‌రైజర్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ సూపర్ విక్టరీ సాధించింది. సన్‌రైజర్స్‌తో ఆట అంటే నిప్పుతో చెలగాటమే అని మరోసారి నిరూపించింది. గ్రూప్ దశలో ఆఖరు మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో అదిరే విజయం అందుకుంది. 215 పరుగుల ఛేదనలో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (66) అర్థ సెంచరీతో చెలరేగగా.. హెన్రిచ్ క్లాసెన్ (42), నితీశ్ కుమార్ రెడ్డి (37) మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. ప్రభుసిమ్రన్ సింగ్ (71) అర్థ సెంచరీతో పంజాబ్ కింగ్స్ తొలుత 214 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంతో ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టగా.. పంజాబ్ కింగ్స్ మరో పరాజయంతో సీజన్ నుంచి నిష్క్రమించింది.

- పంజాబ్ కింగ్స్‌పై అదిరే విజయం
- ఛేదనలో అభిషేక్, క్లాసెన్, నితీశ్ జోరు
- రెండో స్థానంపై హైదరాబాద్ ఆశలు!

నవతెలంగాణ-హైదరాబాద్

పంజాబ్ కింగ్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 215 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలోనే ఊదేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచేందుకు తన చేతుల్లో ఉన్న పని చేసేసింది. భారీ ఛేదనలో ట్రావిశ్ హెడ్ (0) నిరాశపరిచినా.. అభిషేక్ శర్మ (66, 28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (42, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (37, 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), రాహుల్ త్రిపాఠి (33, 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కదం తొక్కటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అలవోక విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్ ఏ దశలోనూ సన్‌రైజర్స్‌ను ఇరకాటంలో పడేయలేకపోయింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 214 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (71, 45 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), రోసో (49, 24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అథర్వ (46, 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. పంజాబ్ కింగ్స్ 14 మ్యాచుల్లో తొమ్మిదో పరాజయంతో సీజన్‌ను ముగించగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్ దశలో 14 మ్యాచుల్లో ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-2 నిలిచేందుకు ఎదురుచూస్తుంది!. ఛేదనలో ధనాధన్ అర్థ సెంచరీ సాధించిన సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



215 ఊదేశారు : ప్లే ఆఫ్స్ ముంగిట సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ లక్ష్యాన్ని ఊదేసింది. ప్రమాదకర ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (0) తొలి బంతికే నిష్క్రమించినా.. సన్‌రైజర్స్ దూకుడు తగ్గలేదు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (66)తో కలిసి రాహుల్ త్రిపాఠి (33) పవర్‌ప్లేలో దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో త్రిపాఠి పవర్‌ప్లేలో చెలరేగాడు. నెమ్మదిగా మొదలెట్టిన అభిషేక్ శర్మ.. పంజాబ్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 21 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన అభిషేక్ శర్మ ఛేదనను లాంఛనం చేశాడు. రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ నిష్క్రమించినా.. నితీశ్ కుమార్ రెడ్డి (37), హెన్రిచ్ క్లాసెన్ (42) అదరగొట్టారు. క్లాసెన్ తనదైన శైలిలో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో విశ్వరూపం చూపించగా.. నితీశ్ కుమార్ రెడ్డి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. ఆఖరు ఓవర్లో 4 పరుగులు అవసరం కాగా.. అబ్దుల్ సమద్ (11 నాటౌట్), సన్వీర్ సింగ్ (6 నాటౌట్) తొలి బంతికే లాంఛనం ముగించారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ (2/37), హర్షల్ పటేల్ (2/49) రెండేసి వికెట్లతో రాణించారు.

మెరిసిన ప్రభుసిమ్రన్ : టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ బౌలర్లను ఎదుర్కొని పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు దంచికొట్టారు. ప్రభుసిమ్రన్ సింగ్ (71), అథర్వ (46) తొలి వికెట్‌కు 97 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో 61 పరుగులు జోడించిన ఓపెనర్లు.. ఆ తర్వాత జోరు కొనసాగించారు. ప్రభుసిమ్రన్ సింగ్ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 34 బంతుల్లో అర్థ సెంచరీ సాధించగా..అర్థ సెంచరీ ముంగిట అథర్వ వికెట్ కోల్పోయాడు. నం.3 బ్యాటర్ రోసో (49) సైతం నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో మెరిశాడు. అశుతోష్ (32) రాణించటంతో డెత్ ఓవర్లలో పంజాబ్ కింగ్స్ భారీగా పరుగులు పిండుకుంది. నితీశ్ కుమార్ రెడ్డి మూడు ఓవర్లలో 54 పరుగులు సమర్పించుకున్నాడు. టాప్-3 బ్యాటర్లు రాణించటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 214 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ తరఫున ఒకే విదేశీ క్రికెటర్ తుది జట్టులో నిలిచాడు.



స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ : అథర్వ (సి) సన్వీర్ సింగ్ (బి) నటరాజన్ 46, ప్రభుసిమ్రన్ సింగ్ (సి) క్లాసెన్ (బి) విజయకాంత్ 71, రోసో (సి) అబ్దుల్ సమద్ (బి) కమిన్స్ 49, శశాంక్ సింగ్ (రనౌట్) 2, జితేశ్ శర్మ నాటౌట్ 32, అషుతోశ్ శర్మ (సి) సన్వీర్ సింగ్ (బి) నటరాజన్ 2, శివం సింగ్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం :** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 214.

వికెట్ల పతనం : 1-97, 2-151, 3-174, 4-181, 5-187.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-36-0, పాట్ కమిన్స్ 4-0-36-1, నటరాజన్ 4-0-33-2, విజయకాంత్ 4-0-37-1, షాబాజ్ అహ్మద్ 1-0-13-0, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-54-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ : ట్రావిశ్ హెడ్ (బి) అర్షదీప్ సింగ్ 0, అభిషేక్ శర్మ (సి) శివం సింగ్ (బి) శశాంక్ సింగ్ 66, రాహుల్ త్రిపాఠి (సి) అర్షదీప్ సింగ్ (బి) హర్షల్ పటేల్ 33, నితీశ్ కుమార్ రెడ్డి (సి) శివం సింగ్ (బి) హర్షల్ పటేల్ 37, హెన్రిచ్ క్లాసెన్ (బి) హర్‌ప్రీత్ 42, షాబాజ్ అహ్మద్ (సి) శశాంక్ సింగ్ (బి) అర్షదీప్ సింగ్ 3, అబ్దుల్ సమద్ నాటౌట్ 11, సన్వీర్ సింగ్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం :** (19.1 ఓవర్లలో 6 వికెట్లకు) 215.

వికెట్ల పతనం : 1-0, 2-72, 3-129, 4-176, 5-197, 6-208.

బౌలింగ్ : అర్షదీప్ సింగ్ 4-0-37-2, రిషీ ధావన్ 3-0-35-0, హర్షల్ పటేల్ 4-0-49-2, రాహుల్ చాహర్ 4-0-43-0, హర్‌ప్రీత్ బరార్ 3-0-36-1, శశాంక్ సింగ్ 1-0-5-0, అథర్వ 0.1-0-4-0.

ఉప్పల్ అభిమాన సంద్రం



ఈ సీజన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విశేష అభిమాన ఆదరణ చవిచూసింది. ముంబయి ఇండియన్స్‌తో తొలి మ్యాచ్ నుంచి పంజాబ్ కింగ్స్‌తో ఆఖరు మ్యాచ్ వరకు అభిమానుల జాతర సాగింది. పంజాబ్ కింగ్స్‌తో మధ్యాహ్నం మ్యాచ్ అయినా 35967 మంది అభిమానులు స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షించారు. ఐపీఎల్ 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఏడు మ్యాచులు ఆడింది. ఇందులో ఐదు మ్యాచుల్లో ఘన విజయాలు సాధించింది. వర్షంతో ఓ మ్యాచ్ రద్దు కాగా.. బెంగళూర్‌తో మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం సన్‌రైజర్స్ జట్టు 'థ్యాంక్యూ ల్యాప్'తో హైదరాబాద్ అభిమానులకు ధన్యవాదాలు తెలిపింది. క్లాసెన్, నితీశ్, హెడ్, అభిషేక్ సహా ఇతర ఆటగాళ్లు టెన్నిస్ బాల్స్‌ను స్టాండ్స్‌లోకి పంపిస్తూ అభిమానులను అలరించారు.

చాంపియన్స్ సాత్విక్ జోడీ

- ఫైనల్లో చైనా జోడీపై ఘన విజయం
- థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500



బ్యాంకాక్ (థాయ్‌లాండ్) : ఇటీవల వరుస టోర్నమెంట్లలో అంచనాలు అందుకోవటంలో నిరాశపరిచిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి.. థాయ్‌లాండ్ ఓపెన్‌లో మెప్పించారు. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన భారత షట్లర్లు పురుషుల డబుల్స్ విభాగంలో చాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అన్‌సీడెడ్ చైనా షట్లర్లు చెన్ బో యాంగ్, లి యులపై 21-15, 21-15తో వరుస గేముల్లో మెరుపు విజయం సాధించారు.46 నిమిషాల్లో ముగిసిన టైటిల్ పోరులో చైనా షట్లర్లను చిత్తు చేశారు. తొలి గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు చైనా షట్లర్లు గట్టి పోటీ ఇచ్చారు. కానీ అది ప్రథమార్థం వరకే పరిమితం అయ్యింది. 7-10తో వెనుకంజ వేసిన మనోళ్లు విరామ సమయానికి 10-11తో నిలిచారు. ద్వితీయార్థంలో సాత్విక్ సక్సెస్‌ఫుల్ రివ్యూతో 12-11తో ముందంజ వేసి అక్కడ్నుంచి వెనక్కి తగ్గలేదు. వరుస పాయింట్లతో 21-15తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. ఇక రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లు టాప్ క్లాస్ గేమ్ చూపించారు. విరామ సమయానికి ఐదు పాయింట్ల ఆధిక్యం సాధించారు. కానీ చిరాగ్ శెట్టి లయ తప్పటంతో 15-14తో చైనా షట్లర్లు రేసులోకి వచ్చారు. ఇక్కడ సాత్విక్ సాయిరాజ్ వరుస స్మాష్‌లతో చెలరేగాడు. సాత్విక్ స్మాష్‌లకు చిన్నబోయిన చైనా షట్లర్లు 21-15తో టాప్ సీడ్స్ ముందు తలొంచారు. వరుస గేముల్లో ఫైనల్లో విజయం సాధించిన వరల్డ్ నం.3 జోడీ థాయ్‌లాండ్ ఓపెన్ విజేతగా అవతరించింది. మహిళల సింగిల్స్‌లో సుపనిద (థాయ్‌లాండ్), మెన్స్ సింగిల్స్‌లో లీ జి జియ (మలేషియా) విజేతలుగా నిలిచారు.

2019లో తొలిసారి థాయ్‌లాండ్ ఓపెన్ విజయం సాధించిన సాత్విక్, చిరాగ్ జోడీ.. తొలి బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టైటిల్ సొంతం చేసుకున్నారు. ఐదేండ్ల కిందట థాయ్‌లాండ్ ఓపెన్ విజయం సాత్విక్, చిరాగ్ జోడీకి కలిసొచ్చింది. ఆ తర్వాత వరుసగా అద్వితీయ విజయాలతో వరల్డ్ నం.1గా ఎదిగారు. ఇప్పుడు 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట థాయ్‌లాండ్ ఓపెన్‌లో చాంపియన్స్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్‌లు ఇదీ రాబోయే వరుస విజయ జైత్రయాత్రకు సంకేతంగా భావిస్తున్నట్టు సాత్విక్, చిరాగ్‌లు విజయానంతరం తెలిపారు. 'థాయ్‌లాండ్ ఓపెన్ విజయం మాకు ప్రత్యేకం. ఇక్కడే మేము తొలి సూపర్ 500 టైటిల్ సాధించాం. ఆ తర్వాత వరుసగా టైటిళ్లు గెల్చుకున్నాం. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందని ఆశిస్తున్నాం' అని సాత్విక్ అన్నాడు. థాయ్‌లాండ్ ఓపెన్ విజయంతో సాత్విక్ జోడీ 9200 ర్యాంకింగ్స్ పాయింట్లతో పాటు సుమారు రూ.27.63 లక్షల నగదు బహుమతి సైతం అందుకున్నారు.

రాయల్స్‌కు వర్షం దెబ్బ

- కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ రద్దు
- మూడో స్థానానికి పరిమితమైన రాజస్థాన్

గువహటి : ఐపీఎల్ 17వ సీజన్ గ్రూప్ దశలో స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన రాజస్థాన్ రాయల్స్ ఆఖరుకు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి పరిమితమైంది. తొమ్మిది మ్యాచుల్లోనే ఎనిమిది విజయాలతో ప్లే ఆఫ్స్ బెర్త్ లాంఛనం చేసుకున్న రాయల్స్ ఆ తర్వాత ఐదు మ్యాచుల్లో ఒక్క విజయం సాధించలేదు. నాలుగింట ఓడగా.. ఆఖరు మ్యాచ్ వర్షం కారణంగా రద్దుగా ముగిసింది. ఆదివారం గువహటి వేదికగా కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ వర్షం కారణంగా సాధ్యపడలేదు. దీంతో రాజస్థాన్ రాయల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ చెరో పాయింట్ పంచుకున్నాయి. 20 పాయింట్లతో కోల్‌కత నైట్‌రైడర్స్ అగ్రస్థానం పదిలం చేసుకోగా.. రాజస్థాన్ రాయల్స్ 17 పాయింట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సమవుజ్జీగా నిలిచింది. కానీ మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో స్థానం సాధించి క్వాలిఫయర్ 1లో తలపడేందుకు సిద్ధమైంది. ఇక రాత్రి 10 గంటల వర్షం నెమ్మదించటంతో ఏడు ఓవర్ల మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. టాస్ నెగ్గిన కోల్‌కత బౌలింగ్‌కు సిద్ధమవగా.. వరుణుడు మళ్లీ విజృంభించాడు. దీంతో మ్యాచ్‌ను రద్దు చేసినట్టు అంపైర్లు ప్రకటించారు.

ప్రజ్వల్‌పై అరెస్ట్ వారెంట్ జారీ

- జర్మనీ నుంచి లండన్‌కు రైల్లో వెళ్ళినట్టు సిట్ గుర్తింపు

బెంగళూరు: మహిళలపై లైంగిక, దౌర్జన్య ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం శనివారం వారెంట్ జారీ చేసింది. ఈ కేసుపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బందం ముందు విచారణకు హాజరు కాకపోవటంతో అధికారులు కోర్టును ఆశ్రయించారు. మూడు వారాలుగా పరారీలో ఉన్న ప్రజ్వల్ జర్మనీ నుంచి లండన్‌కు రైల్లో వెళ్లాడని సిట్ ధ్రువీకరించుకుంది. ఇప్పటికే చాలాసార్లు భారత్‌కు టికెట్లు బుక్ చేసుకొని రద్దు చేసుకున్నట్టు గుర్తించింది. చేసేది లేక కోర్టును ఆశ్రయించి సిట్ అరెస్టు వారెంటును జారీ చేసింది. ఇప్పటికే ప్రజ్వల్‌పై ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసు జారీ అయిన విషయం తెలిసిందే. ప్రజ్వల్‌ను మరింత కట్టడి చేసేందుకు బ్యాంక్ ఖాతాలపై అధికారులు దష్టి సారించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్ తండ్రి హెచ్.డి.రేవణ్ణ ప్రస్తుతం బెయిల్‌పై బయటకొచ్చారు. అంతకుముందు ఆయన ఏడు రోజులు జైల్లో ఉన్న విషయం తెలిసిందే. దోషిగా తేలితే ప్రజ్వల్ పై చర్యలకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తాత, మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ ప్రకటించిన విషయం తెలిసిందే.

గ్రాడ్యుయేట్ ఎన్నికలకు నియోజకవర్గ ఇన్‌చార్జీల నియామకం : బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల కోసం శాసనసభా నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను బీఆర్ఎస్ నియమించింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. మూడు ఉమ్మడి జిల్లాల్లోని శాసనసభా నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జీలను పేర్లను వెల్లడించింది. సూర్యాపేట, హుజూర్ నగర్ నియోజకవర్గాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పాలకుర్తి, వర్ధన్నపేట (ఎస్సీ) నియోజకవర్గాలకు ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఇతర నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను ప్రకటించారు.



జీ హుజూర్

- ఇదీ మోడీ ఇంటర్వ్యూల తీరు
- అబద్ధం చెప్పినా 'ఐతే ఓకే'
- అసత్యాలు, ప్రత్యారోపణలతో సరి
- ఎదురు దాడితో తప్పించుకునే ప్రయత్నం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మార్చి 31 నుండి ఈ నెల 14వ తేదీ వరకూ వివిధ పత్రికలు, న్యూస్ ఛానల్స్‌కు 41 ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయనకు ఎదురైన క్లిష్టతరమైన ప్రశ్నల సంఖ్య బాగా తక్కువే. ఉదాహరణకు న్యూస్ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మొట్టమొదటిసారిగా ఆయనకు ఓ క్లిష్టమైన ప్రశ్న ఎదురైంది. రాజస్థాన్‌లోని బన్స్వారాలో జరిగిన ర్యాలీలో ముస్లింలకు వ్యతిరేకంగా మోడీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ప్రశ్న అది.

'అధిక సంతానం' అనే మాట తాను కేవలం ముస్లింలను ఉద్దేశించి మాత్రమే చెప్పలేదని ప్రధాని బదులిచ్చారు. 'అన్ని పేద కుటుంబాలలోనూ సంతానం ఎక్కువగానే ఉంటుంది. వారు తమ పిల్లలను విద్యావంతులను చేయలేరు. పేదరికం ఎక్కడ ఉంటుందో అధిక సంతానం అక్కడ కన్పిస్తుంది' అని వివరణ ఇచ్చారు. తాను హిందువులు లేక ముస్లింలు అని చెప్పలేదని తెలిపారు. చొరబాటుదారులంటే ఎవరని ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి అడగనూ లేదు. మోడీ చెప్పనూ లేదు. అంతేకాదు...మోడీ వాదనలను పాత్రికేయులెవ్వరూ సవాలు చేసిన పాపాన పోలేదు. హామీల అమలులో ఎందుకు విఫలమయ్యారని కూడా జర్నలిస్టులు నిలదీయలేదు.

ఈ అంశాలపై ప్రశ్నలేవి?

పాత్రికేయులతో ముచ్చటించేటప్పుడు మోడీ ఎక్కువగా తన 'మూడో పదవీకాలం' గురించే కాకుండా 2047 నాటికి భారత్ విజన్‌పై కూడా మాట్లాడారు. పది సంవత్సరాల పాలనలో మీ ట్రాక్ రికార్డు ఏమిటని ఒక్క పాత్రికేయుడు కూడా ప్రశ్నించలేదు. ప్రధాని 41 ఇంటర్వ్యూలు ఇచ్చినప్పటికీ కోవిడ్‌ను ప్రభుత్వం ఎలా ఎదుర్కొన్నదంటూ ఒక్క ప్రశ్న అడిగిన వారు లేరు. దేశంలో ముస్లింలపై జరుగుతున్న హింసను కూడా ఎవరూ ప్రస్తావించలేదు. 'అస్సాం ట్రిబ్యూన్' పత్రిక ఇంటర్వ్యూలో మాత్రం మణిపూర్ హింసపై ప్రశ్నించారు. 'న్యూస్‌వీక్' పాత్రికేయుడు చైనాతో సరిహద్దు ఉద్రిక్తత గురించి ప్రశ్న వేశారు.

స్థానిక సమస్యల పైనా అంతే

తంతి టీవీ, ఎఎన్ఐ, రాజస్థాన్ పత్రిక, దివ్య భాస్కర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నికల బాండ్ల వివాదంపై మోడీని ప్రశ్నించారు. ఇక జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మోడీ 29 ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రజ్వల్ వ్యవహారంపై కేవలం మూడు ఇంటర్వ్యూల్లో మాత్రమే (టైమ్స్ నౌ ఛానల్, హిందీ పత్రిక హిందుస్థాన్, ఆంగ్ల పత్రిక హిందుస్తాన్ టైమ్స్) మోడీని ప్రశ్నించారు. ప్రాంతీయ మీడియా సంస్థలు తమ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలను లేవనెత్తడంలో విఫలమయ్యాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన స్థానిక హిందీ పత్రికలు అమర్ ఉజాలా, హిందుస్థాన్ వివాదాస్పద అగ్నిపథ్‌పై ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. ఈ రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున యువత సైనిక దళాల్లో చేరుతుంటుంది. అస్సాం ట్రిబ్యునల్, బెంగాల్ దినపత్రిక ఆనంద్‌బజార్ జర్నలిస్టులు మోడీని పౌరసత్వ సవరణ చట్టంపై ప్రశ్నించలేదు. అసోం, బెంగాల్ రాష్ట్రాల్లో ఈ చట్టం కీలకమైన ఎన్నికల అంశంగా మారింది. గుజరాత్‌కు చెందిన ఆరు వార్తా సంస్థలు మోడీని ఇంటర్వ్యూ చేశాయి. రాష్ట్ర బీజేపీలో నెలకొన్న విభేదాలపై ఒక్కరు కూడా ఆయన్ని ప్రశ్నలు అడగలేదు.

తప్పని చెబితే ఎదురు దాడే

ఇంటర్వ్యూల్లో మోడీ తప్పుడు వాదనలు విని పించినా, తప్పుడు సమాచారం ఇచ్చినా పాత్రికేయులు ఆయనకు అది తప్పని చెప్పలేదు. ఒకవేళ ఎవరైనా ఆ విషయాన్ని గుర్తు చేస్తే మోడీ ఎదురు దాడికి దిగేవారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన 'ప్రమాదకరమైన ప్రకటనల'ను ఆయన ప్రస్తావించే వారు. ప్రజ్వల్ ఉదంతాన్ని ఎవరైనా ప్రస్తావిస్తే అలాంటి వాటిని తాను సహించబోనని చెబుతూనే కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రజ్వల్ రేవణ్ణ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నదని గుర్తు చేశారు. సంపద పంపిణీ ప్రస్తావన కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో లేదన్న విషయాన్ని, ప్రజ్వల్ విదేశాలకు పరారైన విషయాన్ని పాత్రికేయులెవరూ లేవనెత్తలేదు. జేడీఎస్‌తో పొత్తు విషయంలో బీజేపీ నేతలు చేస్తున్న హెచ్చరికలను కూడా ఎవరూ ప్రస్తావించలేదు.

దక్షిణాదిపై ఫోకస్

మోడీ తన ఇంటర్వ్యూల్లో దక్షిణాది మీడియా సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చారు. దీనిని బట్టి ఆయన దక్షిణ భారతదేశంపై దృష్టి సారించారని అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఏడు సంస్థలకు ఆయన ఇంటర్వ్యూలు ఇచ్చారు. గుజరాత్ తర్వాత ఆయన ఎక్కువగా దృష్టి సారించింది దక్షిణాది పైనే. గుజరాత్ సంస్థలకు ఆరు ఇంటర్వ్యూలు ఇచ్చారు.

అది ప్రజా నినాదమేనట

మోడీ ఇంటర్వ్యూల్లో తరచూ వినిపించిన మరో పదం '400 ప్లస్'. బీజేపీ కార్యకర్తలకు ఆత్మసంతృప్తి కలిగించేందుకే మోడీ ఈ నినాదాన్ని ఎత్తుకున్నారన్న విమర్శలు వచ్చాయి. అయితే అలాంటిదేమీ లేదని ప్రధాని చెప్పుకొచ్చారు. బీజేపీకి 370 సీట్లు ఇస్తే ఆర్టికల్ 370ని రద్దు చేసిందని ప్రజలు అనుకున్నారని, అందుకే వారి నుండే అబ్‌కీ బార్...400 పార్ అనే నినాదం వచ్చిందని తెలిపారు. పైగా ఎన్డీఏకు ఇప్పటికే 400కు పైగా స్థానాలు ఉన్నాయని అంటూ '2019లో ఎన్డీఏ సుమారు 359 స్థానాలు గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలు మా వైపే ఉన్నాయి. అంటే మరో 35 స్థానాలు కలిశాయి. ఈశాన్య ప్రాంతం ఎంపీలు కూడా మా పక్షానే ఉన్నారు' అని వివరించారు.

అబద్ధాలు...అభాండాలు

మత ప్రాతిపదికన విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ప్రమాదకరం కాదా అని ఓ పాత్రికేయుడు ప్రశ్నిస్తే ఈ అంశం కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉన్నదని అబద్ధం చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ 400కు పైగా స్థానాలు కోరుకుంటోందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణను టీవీ9 నెట్‌వర్క్ పాత్రికేయులు ప్రస్తావించినప్పుడు మోడీ సుదీర్ఘమైన సమాధానం ఇస్తూ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ అనేక సందర్భాల్లో నీరుకార్చిందని ఆరోపించారు.

అత్యధిక మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని నలుగురు బీజేపీ నాయకులు బాహాటంగా చెప్పడాన్ని ఎవరూ గుర్తు చేయలేదు. ఎన్నికల బాండ్లపై కేవలం నాలుగు ఇంటర్వ్యూల్లో మాత్రమే మోడీని ప్రశ్నించగా ఆయన ఆ పథకాన్ని సమర్థించారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా కార్పొరేట్ సంస్థలు, బీజేపీ మధ్య చోటుచేసుకున్న క్విడ్‌ప్రోకో సంబంధాలపై మోడీని ఎవరూ ఏమీ అడగలేదు.

గత మూడు వారాల్లో ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మోడీ పలు సందర్భాల్లో తప్పుడు వాదనలు విన్పించారు. సంపద పున:పంపిణీ, రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్‌పై అభాండాలు వేశారు. ఏప్రిల్ 5న కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించింది.

దానిపై పక్షం రోజుల పాటు పెదవి విప్పని మోడీ, బన్స్వారాలో తాను చేసిన ప్రసంగం వివాదాస్పదం కావడంతో దాని నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి తప్పుడు వాదనలు విన్పించడం మొదలు పెట్టారు. ఉదాహరణకు ఏప్రిల్ 15న ఎఎన్ఐ వార్తాసంస్థకు 77 నిమిషాల పాటు సుదీర్ఘమైన ఇంటర్వ్యూ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆ ప్రస్తావనే తేలేదు. ఏప్రిల్ 20న కన్నడ ఛానల్ ఆసియానెట్ సువర్ణకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ దాని గురించి ఊసే లేదు. బన్స్వారా ర్యాలీ తర్వాత ఇచ్చిన ప్రతి ఇంటర్వ్యూలోనూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రస్తావించి విమర్శలు గుప్పించారు.



రోజుకో అబద్ధం

గంటకో విద్వేష బీజం

- ప్రధాని మోడీపై మండిపడిన స్టాలిన్

చెన్నై : రాష్ట్రాల మధ్య ఘర్షణలు రేపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చౌకబారు ఎత్తుగడలు అవలంబిస్తున్నారని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ విమర్శించారు. ఎన్నికల సందర్భంగా మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ ప్రచారం చేస్తున్నారని, అయితే అది బీజేపీకి ఏమీ ఉపయోగపడదని ఆయన చెప్పారు. 'ప్రధాని బాధ్యతారాహిత్యమైన ప్రసంగాలు చేస్తున్నారు. వాటిని అడ్డుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమవుతోంది. వీటన్నింటినీ దేశ పౌరులందరూ దిగ్భ్రాంతితో, నిస్పృహతో చూస్తున్నారు' అని అన్నారు.

మోడీ ఊహాజనిత కథలు, పుట్టెడు అబద్ధాలు వల్లె వేస్తున్నారని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి దక్షిణాది ప్రజలు అమర్యాదకరంగా మాట్లాడుతున్నారంటూ మోడీ చేసిన ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. ప్రధాని కార్యాలయపు హుందాతనాన్ని మోడీ మరచిపోయారని, ప్రతి రోజూ ఒక కొత్త అబద్ధం చెబుతున్నారని, గంట గంటకూ విద్వేషపు విత్తనాలు నాటుతున్నారని మండిపడ్డారు. వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లపై అమలులో ఉన్న 50% పరిమితిని ఎత్తివేయాలని తమిళనాడు, సామాజిక న్యాయం కోసం పనిచేసే రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయని గుర్తు చేశారు. ఈ డిమాండ్‌ను ఇప్పుడు జాతీయ స్థాయిలో లేవనెత్తుతున్నామని, దీనికి కాంగ్రెస్, ఇండియా బ్లాక్ మద్దతు ఇచ్చాయని చెప్పారు.

'ఉత్తరప్రదేశ్ ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే ఈ విషయంపై ప్రధాని ఎప్పుడైనా మాట్లాడారా? ఏదైనా గ్యారంటీ ఇచ్చారా?. లేదు. కానీ ఆయన విద్వేషాలను త్వరగా వ్యాప్తి చేయడంలో నిమగ్నమయ్యారు' అని స్టాలిన్ ధ్వజమెత్తారు. నకిలీ వార్తలను బీజేపీ సమర్థిస్తోందని, ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తూ యూట్యూబర్ మనీష్ కశ్యప్ ఉదంతాన్ని ప్రస్తావించారు. మోడీ విద్వేష ప్రచారం విఫలమైందని, తన పది సంవత్సరాల పాలన గురించి ఆయనకు చెప్పుకునేందుకు ఏమీ లేదని అన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధాని నీరుకారిస్తే పేదలకు శత్రువుగా మారిపోతారని చెప్పారు.

తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఉద్దేశించిన పథకం కారణంగా మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య తగ్గిందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యను స్టాలిన్ ప్రస్తావిస్తూ ఈ పథకం ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడుతోందని తెలిపారు. మోడీ ప్రసంగాలు వింటే వాటిలో కిలో నిజానికి ఎంత ఖరీదో అన్న ఆశ్చర్యం కలుగుతుందని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

రాయ్‌బరేలి కుటుంబ ఆస్థా?

సోనియాపై మోడీ ఫైర్



న్యూఢిల్లీ: రాయ్‌బరేలిని వదిలివేసిన కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఇప్పుడు తన కుమారుడు రాహుల్ గాంధీ కోసం ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జంషెడ్‌పూర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి మోడీ మాట్లాడారు. రాయ్‌బరేలిలో ప్రచారానికి వెళ్లిన సోనియా గాంధీ తన కొడుకును ప్రజలకు అప్పగిస్తున్నానని చెప్పారని, కానీ అక్కడ దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు ఎవరూ లేరా అని మోడీ ప్రశ్నించారు.

రాయ్‌బరేలి స్థానాన్ని వారు తమ కుటుంబ ఆస్తిగా భావిస్తున్నారని మండిపడ్డారు. కోవిడ్ అనంతరం తన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని సోనియా గాంధీ ఇప్పుడు కొడుకు కోసం ఓట్ల వేటకు వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ యువరాజు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వాయనాడ్ నుంచి రాయ్‌బరేలి పారిపోయి వచ్చారని ఎద్దేవా చేశారు. రెండు లోక్‌సభ స్థానాల నుంచి రాహుల్ పోటీ చేయడాన్ని మోడీ తప్పుపట్టారు. ఇది తన తల్లి ప్రాతినిధ్యం వహించిన స్థానమని చెప్పుకుంటూ రాహుల్ తిరుగుతున్నారని అన్నారు. పార్లమెంటరీ స్థానాలను సైతం ఈ కుటుంబ పార్టీలు తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ఈ తరహా కుటుంబ పార్టీల నుంచి జార్ఖండ్‌ను కాపాడుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు పిలుపు ఇచ్చారు.

రాజకీయ ప్రత్యర్థులపై మోడీ దాడి

ఈడీ, సీబీఐని ఉసిగొల్పుతున్నారు : జైరాం రమేష్



న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వం తరహాలో ఈడీ, సీబీఐ, ఐటీ వ్యవస్థలను దుర్వినియోగం చేసిన తీరు గతంలో ఎన్నడూ చూడలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జీ జైరాం రమేష్ ఆరోపించారు. హేమంత్ సొరెన్, అరవింద్ కేజ్రీవాల్‌పై ఈడీని ఉసిగొల్పిన ప్రధాని నరేంద్ర మోడీ వారిని అరెస్టు చేయించి జైల్లో వేశారని అన్నారు.

పారిశ్రామిక దిగ్గజాలు అదానీ, అంబానీలు టెంపోలో కాంగ్రెస్ కార్యాలయానికి నగదు తరలించారని ప్రధాని మోడీ స్వయంగా ఆరోపించారని, అలా జరిగితే దీనిపై ఆయన ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని జైరాం రమేష్ నిలదీశారు. రాజకీయ ప్రత్యర్థులపై మోడీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తూ విపక్ష నేతలను బెంబేలెత్తిస్తోందని ఆయన దుయ్యబట్టారు.

మరోవైపు ఆప్ అగ్ర నేతలను అరెస్టు చేసేందుకు మోడీ ప్రభుత్వం ఆపరేషన్ ఝాడూ చేపట్టిందని ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆప్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేసేందుకు కాషాయ పాలకులు కుట్ర పన్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రజల్లోకి దూసుకెళ్తూ.. బీజేపీకి చెమటలు పట్టిస్తూ

జార్ఖండ్‌లో ఉధృతంగా కల్పనా సొరెన్ ప్రచారం

- గండే ఉప ఎన్నికల్లో హేమంత్ సొరెన్ భార్యకు సానుకూల పవనాలు
- బీజేపీ సంప్రదాయ ఓటు కూడా ఆమెకే వెళ్లే అవకాశం : రాజకీయ విశ్లేషకులు
- కాషాయపార్టీ నాయకులు కూడా కల్పనాకే మద్దతు



రాంచీ : జార్ఖండ్‌లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బీజేపీ, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) పార్టీల మధ్య పోటీ చాలా ఘోరంగా ఉంది. ఆదివాసీలకు న్యాయం, బీహార్ భూస్వామ్య పద్ధతులకు వ్యతిరేకంగా జార్ఖండీ గుర్తింపును ప్రకటించటం వంటి పోరాటాల నుంచి జేఎంఎం ఉద్భవించింది. అయితే మతమార్పిడి వంటి భావోద్వేగ సమస్యలపై ఆదివాసీలు, హిందూ కుల సమూహాలను ముస్లింలకు వ్యతిరేకంగా ఉంచటం, ఆహారపు అలవాట్లు, విశ్వాస ఆధారిత అంశాల ద్వారా బీజేపీ క్రమంగా రాష్ట్రంలో ప్రాముఖ్యతను సంతరించుకున్నది. అయితే, మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ అరెస్టు కావటంతో ఆయన సతీమణి కల్పనా సొరెన్ తొలి సారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

గండేలోని అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో ఈ స్థానం మరోసారి ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇటీవలి వరకు గృహిణిగా ఉన్న కల్పన రాజకీయ జీవితానికి దూరంగా ఉన్నారు. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆమె భర్తను అరెస్టు చేసిన తర్వాత పరిస్థితులు మారాయి. ఆమె ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో జార్ఖండ్‌లోని ఎంపీ స్థానాలతో పాటు గండే అసెంబ్లీ స్థానానికీ ఉప ఎన్నికల జరగనున్నది.

తిరిగి గతేడాది డిసెంబర్‌లో హేమంత్ సొరెన్‌ను అరెస్టు చేయవచ్చనే పుకారు ఊపందుకోవటంతో జేఎంఎం నాయకుడు సర్ఫరాజ్ అహ్మద్ అకస్మాత్తుగా తన గండే అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేశారు. హేమంత్‌ను అరెస్టు చేస్తే.. ఆయన స్థానంలో కల్పన ముఖ్యమంత్రి అవుతారనీ, ఆరు నెలల వ్యవధిలో ఎన్నిక కావాల్సి ఉంటుందని బీజేపీ ఈ పరిణామాలపై ఆరోపణలు చేసింది. ఈ ఏడాది మార్చిలో అహ్మద్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, ఈ ఏడాది హేమంత్ సొరెన్ అరెస్టు అనంతరం.. కల్పనకు పగ్గాలు అప్పజెప్పాలని జేఎంఎం పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే జేఎంఎం వ్యవస్థాపకుడు శిబూ సొరెన్ కుటుంబంలో తిరుగుబాటు కారణంగా ఆమె కోడలు, జామా ఎమ్మెల్యే సీతా సొరెన్ తెర పైకి వచ్చారు. దీంతో శిబూ సొరెన్ సహచరుడు అయిన చంపై సొరెన్ గందరగోళం మధ్య సీఎంగా ఎన్నికయ్యాడు. జార్ఖండ్‌లో కేంద్ర రాష్ట్రపతి పాలనను విధించే అవకాశం ఉన్నదన్న పరిస్థితుల నేపథ్యంలో.. చంపై సొరెన్ ఎంపికతో మోడీ సర్కారు వెనక్కి తగ్గవలసి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

తిరుగుబాటు కారణంగా జేఎంఎం నుంచి బహిష్కరించబడిన తర్వాత.. సీతా సొరెన్ ఇప్పుడు దుమ్కా నుంచి బీజేపీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నారు. మోడీ హయాంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న అన్యాయానికి వ్యతిరేకంగా గిరిజనుల ప్రతిఘటనకు కల్పన ఒక ఐకాన్‌గా ఉద్భవించింది.తన భర్త అరెస్టుకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన కల్పన.. ఇది రాజకీయ పగ అని ఆరోపిస్తూ.. "జల్, జంగల్, జమీన్"ల ఆదివాసీ సమస్యలను చేపట్టటమే కాకుండా.. హేమంత్ సొరెన్ లేకపోయినా ఆమె తన పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా కూడా ఎదిగిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

అయితే, కల్పన ఒడిశాలోని మయూర్‌భంజ్‌కి చెందిన ఆదివాసీ కాబట్టి, జార్ఖండ్‌లోని షెడ్యూల్డ్ తెగల కోసం రిజర్వ్ చేయబడిన ఏ స్థానంలోనైనా పోటీ చేయకుండా నియమాలు ఆమెను నిషేధిస్తున్నందున.. ఆమె హేమంత్ సొరెన్ సీటు బర్హైత్‌ను ఎంపిక చేసుకోలేకపోయింది.

అహ్మద్ రాజ్యసభ నామినేషన్ ఆమెను గిరిదిహ్ జిల్లాలోని ఆదివాసీ-ముస్లిం మెజారిటీ సీటు అయిన గండే నుంచి పోటీ చేయటానికి దారిని కల్పించింది. గండే స్థానానికి నేడు పోలింగ్ జరగనున్నది. అయితే, బీజేపీ సాంప్రదాయ ఓటు కూడా ఆమెకు మరలే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. "మేము ఇంతకుముందు జేఎంఎంకు ఓటు వేశాం. మేము మళ్ళీ ఆ పార్టీకే ఓటు వేస్తాం" అని గండేలోని సైకిల్ మెకానిక్ రకీబ్ చెప్పారు.

బీజేపీ మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీకి కూడా పొరుగున ఉన్న తీస్రీలోని సంతాల్ నివాసితులు కూడా కల్పనా పట్ల తమ సానుభూతిని, మద్దతును తెలిపారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. స్థానిక బీజేపీ కార్యకర్తలు కూడా కల్పన కోసం ప్రచారం చేస్తున్నారు. ఇందుకు వారి కారణాలు కొంచెం భిన్నంగా ఉన్నాయి.

స్థానిక బీజేపీ నాయకుడు, గిరిడి జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు యదునందన్ పాఠక్‌కు ప్రాధాన్యతనిస్తూ బీజేపీ అభ్యర్థి దిలీప్ వర్మను ఎంపిక చేసినట్టు వారు భావిస్తున్నారు. "2019లో బీజేపీ ఓటమిలో దిలీప్ వర్మ కీలక పాత్ర పోషించారు. ఆయన బాబూలాల్ మరాండీకి చెందిన జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) అభ్యర్థిగా 8,000 ఓట్లకు పైగా సాధించారు" అని గిరిడిహ్‌లో బీజేపీ యువ మోర్చా మాజీ అధ్యక్షుడు ప్రదీప్ పాఠక్ అన్నారు. కల్పన కనీసం 30,000 ఓట్ల తేడాతో గెలుస్తారని ఆమె కోసం ప్రచారం చేయటానికి బయలుదేరిన మరో మాజీ బీజేపీ సభ్యుడు అన్నారు.గండేలో బీజేపీ అయోమయ స్థితిలో ఉన్నదనీ, జేఎంఎం ఇండియా కూటమిలో ప్రధాన ప్రతిపక్ష పాత్రతో ఈ ప్రాంతంలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

నూతన క్రిమినల్ చట్టాల వ్యతిరేక పిటీషన్‌పై

నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : నూతన క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు విచారించనుంది. జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిథల్ ఈ పిటీషన్‌ను విచారించే అవకాశం ఉందని సమచారం. ఇప్పటి వరకూ ఉన్న క్రిమినల్ చట్టాల్లో లోపాలు, వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ గత ఏడాది డిసెంబర్ 21న మూడు నూతన క్రిమినల్ బిల్లులను లోక్‌సభ ఆమోదించింది.

భారతీయ న్యా (రెండో) సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష (రెండో) సంహిత, భారతీయ సాక్ష్య (రెండో) బిల్లు అనే మూడు బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది



ముర్ము డిసెంబరు 25న ఆమోదం కూడా తెలిపారు. ఈ చట్టాలు ఇప్పటి వరకూ ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ చట్టాలను భర్తీ చేయనున్నాయి. అయితే నూతన చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో, ఎలాంటి చర్చలు లేకుండానే కొత్త చట్టాలను ఆమోదించారని, కాబట్టి వీటి అమలుపై స్టే విధించాలని పిటీషన్‌లో కోరారు. అలాగే ఈ చట్టాల సమర్థతను పరిశీలించడానికి ఒక నిపుణుల కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని కూడా కోర్టును కోరారు.

కొత్త చట్టాలు బ్రిటీష్ వలస వాద చట్టాల కంటే క్రూరంగా ఉన్నాయని పిటీషన్‌దారులు ఆరోపించారు. బ్రిటిష్ కాలంలో ఒక వ్యక్తిని గరిష్ఠంగా 15 రోజుల వరకూ పోలీసు కస్టడీలో ఉంచడానికి అనుమతిస్తే, దానిని కొత్త చట్టాలు 90 రోజుల వరకూ పొడిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత దంపతులపై దాష్టీకం

మధ్యప్రదేశ్‌లో ఘోరం
- స్తంభానికి కట్టేసి కొట్టి, చెప్పుల దండలతో ఊరేగింపు



అశోక్‌నగర్ : వృద్ధులైన దళిత దంపతులపై కొందరు వ్యక్తులు దాష్టీకానికి పాల్పడ్డారు. స్తంభానికి కట్టేసి కొట్టడంతోపాటు చెప్పుల దండలు వేసి ఊరేగించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది.

ముంగవోలి పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి గబ్బర్‌సింగ్ గుర్జార్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం కిలోరా గ్రామానికి చెందిన వృద్ధ దంపతుల కొడుకు నిందితులలోని ఓ వ్యక్తి భార్యపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడ్డాడు. ఈ ఘటన జరిగిన తరువాత ఆ కుటుంబం గ్రామం నుంచి వెళ్లిపోయింది. దళిత దంపతులిద్దరూ గ్రామానికి ఇటీవల వచ్చారు. ఈ విషయం తెలిసిన నిందితులు శుక్రవారం ఒక్కసారిగా వారిపై దాడికి పాల్పడ్డారు. 65 ఏళ్ల వృద్ధుడు, 60 ఏళ్ల మహిళ అన్న కనికరం కూడా లేకుండా వారిద్దరినీ స్తంభానికి కట్టేసి కొట్టారు. ఆ తరువాత చెప్పుల దండలు వేసి ఊరేగించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు 10 మంది నిందితులపై శనివారం ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంలోని సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు గబ్బర్‌సింగ్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు.

గుజ్జె రాజయ్య బంగ్లా

గాంధీ చౌరస్తాలో
గుజ్జె రాజయ్య బంగ్లా దగదగా మెరిసిపోతూ
సిరిసిల్ల టవర్‌లా కనబడేది
మండెపల్లి నుంచి వచ్చి
పది సాపుడు మగ్గాల కార్ఖానాలు పెట్టి
నేసినప్పుడు మగ్గంలో కండె ఆడినట్టు
నేతగాళ్లతో మగ్గం వేసేవాడు
వంకాయ రంగు దడువతు చీరలు
పొద్దంతా గుంటలో ఉండి మగ్గం నేసినా రోజుకు
ఒక చీర కోస్తే మహా ఎక్కువయ్యేది
సాయంత్రమైతే మానేరు వాగులోంచి
జాతర సాగినట్టు తాటి కల్లు మండువాకు
కార్మికుల దార పడేది లాల్ బహుటా పదఘట్టన
ఉద్యమ ఊరేగింపుల సాక్షి
కాలంతో పాటు కుల వృత్తిలో వచ్చిన
ఆటుపోట్లను చూసిన వలస పక్షి
నిరసన ఊరేగింపుపై పోలీసు కాల్పులు జరిపితే
కార్మిక కర్షకులు పరిగెత్తుకొచ్చి
ఇక్కడే తలదాచుకున్నారు
ఎండలో పడి వచ్చిన వారిని
వేపచెట్ల నీడ తల్లి కొంగై పట్టేది
డంగు సున్నం గానుగ కట్టి
కార్మికుల కరిగిన కండలను



ఎర్రెర్రని ఇటికల్లా పేర్చి నిర్మించిన
ముగ్గురు అన్నదమ్ములు
పక్కపక్కన కట్టికున్న బంగ్లా
ఆ పక్కనున్న మద్రాస్ హోటల్‌లో
పొద్దున్నే సేట్లు నెహ్రూ టోపీలు ధరించి
కొసరి కొసరి దోసెలు తినేవారు
అప్పటి కమ్మని వాసన అటువైపు పోతే
ఇప్పటికీ నోట్లో నీళ్ల ఊరుతుంటయ్
గీతాశ్రమ వైరాగ్యం కార్మిక సంస్కృతి సౌందర్యం
వెల్లి విరిసిన వైభోగం
నడి ఎండల్లో చల్ల చల్లని నీడకు
సిమెంటు గద్దెల మీద పడుకొని
అంగీలు విప్పి తువ్వాలుతో
పెయ్యంతా కారుతున్న చెమటను
ఉష్ ఉష్ అంటూ విసురుకునేవారు
రంగునూలు కార్మికులు సైకిళ్ల
క్యారేజీకి కట్టుకొని పోయేవారు
గంజితో అచ్చు అద్ది కుంచెతో సర్ల మీద
కుంచెతో సుతారంగా పోగుల చిక్కులు తీస్తూ
మగ్గం కట్టడం ఎర్ర గీతల తువ్వాల సంబరం
బొక్కల గూడు కామ్ గారీ సంరంభం
బాసాన్లకు చిన్నపిల్లల్లా స్నానం చేయించి
కట్టెల పొయ్యి మీద
మసలే ఎసరై వంటలు వండి
రాట్నం మీద సన్నని దారాలు
వేళ్లకొనలు కోసుకుపోగా
నుదుట కుంకుమ సూర్యుణ్ణి ధరించి
స్త్రీలు కండెలు చుట్టేవారు


2

రోడ్డు వెడల్పు అభివృద్ధిలో
వేప చెట్లు నేల కూలాయి
ముగ్గురు అన్నదమ్ములు గతించారు
కాలం చేసిన గాయాలింకా పచ్చిగానే ఉన్నై
ఇప్పుడు ప్రధాన కూడలిలో
తలెత్తుకున్న బంగ్లాను
డ్రిల్లింగ్ మిషన్లతో జెసిబితో
అతి కష్టంగా పడగొడుతున్నారు
చేనేత నెత్తురు చెమటతో కట్టిన ఇల్లు
ఏడుపదుల వయసు దాటినా
ఇంకా బంధోబస్తుగానే ఉంది
పనిమీద ఊరిలో ఎక్కడెక్కడికో పోయి
చివరికి గుజ్జె రాజయ్య బంగ్లా దగ్గర
కలుసుకోవడం ఒక కొండగుర్తు
అప్పటి దయగల్ల మనుషులు
గూడు చెదిరిన పక్షుల్లా
ఎటెటో ఎగిరిపోయి కాట కలిసి పోయారు
నీటి వసతి నుంచి మనిషి రోడ్డున పడ్డాడు
అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కు
ముహూర్తం చూసి ముగ్గు పోసేందుకు
ఇప్పుడు గుజ్జె వారసులు సిద్ధమవుతున్నారు

- జూకంటి జగన్నాథం

స్త్రీవాద దృక్పథ అవగాహనకు సజీవ సాక్ష్యం

ప్రకృతిలో సంభవించే ఆటుపోట్ల పర్యవసానంగా సమాజంలో సంభవించే అనేక అనుకూల, ప్రతికూల పరిస్థితులలో ఏర్పడిన వైరుధ్యాలను ఒక క్రమపద్ధతిలో కవులు, రచయితలు అధ్యయనం చేసి, వాటికి ఏ పరిష్కారమైతే సమాజంలోకి చొచ్చుకపోయి ఫలితాలను తమ కళ్ల ముందు చూడాలని ఒక ప్రత్యేక కోణంలో కవిత, కథ, విమర్శ ఇలా కావ్యాలను సాహితీమూర్తులు పాఠక లోకానికి, సాహితీ లోకానికి అందించే ఒక బృహత్తర కార్యక్రమమే రేపటి భవితకు మార్గం చూపక తప్పదు. అలాంటి రచనలను చేస్తూ సమకాలీన పరిస్థితులను ఒక వైపు ప్రత్యేక కోణంలో దృష్టిలో పెట్టుకొని ఏ విమర్శ అయితే మార్పును కోరుకుంటుందో ఆ విమర్శను తన కలం ద్వారా తనదైన ప్రత్యేక వ్యాసాంగంతో నేటి తరానికి అందిస్తున్న ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, విమర్శకురాలు డాక్టర్ కొండపల్లి నీహారిణి. తను రచించిన 'అనివార్యం' స్త్రీవాద సాహిత్య విమర్శా వ్యాసాలు సంపుటిలోని వ్యాసాలు వికసిత పుష్పాలుగా నిలుస్తున్నాయి.



వరంగల్ జిల్లాలోని చినపెండ్యాల గ్రామంలో తల్లిదండ్రులు పెండ్యాల రాఘవరావు, కౌసల్యాదేవిలకు నీహారిణి జన్మించినారు. చిన్నతనం నుంచి చదవడంపై ఉన్న ఆసక్తితో చదువుకునే రోజుల్లో వ్యాసాలు రచించి, ఉపన్యాసాలు ఇచ్చి బహుమతులు అందుకున్నారు. కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కవిత్వంపై ఒక అభిలాషను ఏర్పరచుకున్నారు. తండ్రి ప్రముఖ రాజకీయ నాయకులు వరంగల్ తొలి పార్లమెంట్ సభ్యులుగా కొనసాగినారు. తన మామ చిత్రకళాతపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు ప్రముఖ చిత్రకారుడుగా పేరు గడించినారు. ఒకవైపు పుట్టినింటి వైపు, మరోవైపు మెట్టినింటి వైపు ఇరువైపులా ప్రముఖ చరిత్ర కలిగిన నీహారిణి దాదాపు 20 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించినారు. తన భర్త కొండపల్లి వేణుగోపాలరావు ప్రోత్సాహం తన ఊహలకు మార్గం అంటారు. 'ఒద్దిరాజు సోదరుల జీవితం సాహిత్యం' అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా అందుకున్నారు.

చిత్రకళాతపస్వి కొండపల్లి శేషగిరిరావు, పెండ్యాల రాఘవరావు, ఒద్దిరాజు సోదరుల జీవిత చరిత్రలతో పాటు అగ్ర తలుపులు, నిర్నిద్ర గానం, ఎనిమిదో అడుగు, కాల ప్రభంజనం, కవితా సంపుటాలు, రాచిప్ప, ఘర్షణ కథల సంపుటాలు పరిశోధన గ్రంథం, యాత్రా చరిత్ర, రెండు విమర్శా వ్యాసాల సంపుటాలతోపాటు పలు సంకలనాలకు సంపాదకత్వం వహించారు. 20 పైచిలుకు గ్రంథాలను రచించిన డా.కొండపల్లి నీహారిణి ఇటీవల వెలువరించిన 'అనివార్యం' స్త్రీవాద సాహిత్య విమర్శా వ్యాసాల సంపుటిని పరిశీలించినట్లయితే స్త్రీవాద గొంతుక బలంగా వినిపిస్తున్న పలు నేటి కవయిత్రుల, రచయిత్రుల ప్రామాణిక గ్రంథాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇప్పుడు 'అనివార్యం' సంపుటిని ప్రచురించారు.

మాతృస్వామ్య కుటుంబ జీవనం నుండి మార్పు చెందుతూ పితృస్వామ్య కుటుంబ జీవనంగా మన దేశంలో కొనసాగుతున్న అనేక పరిస్థితులను పరిశీలనలోకి తీసుకొని, ఆ మార్పు పరిణామ క్రమం ఏ రూపాంతరానికి కారణమవుతుందో ఆ పర్యవసానంగా ఎటువంటి పరిస్థితులను సమాజం ఎదుర్కొంటుందో అందులో కుటుంబ జీవనం అయితే నేమి! రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ బాధ్యత లైతేనేమీ!! లింగ వివక్ష కారణంగా ఎదుర్కొంటున్న పరిస్థితులు కారణమైతేనేమి!!! ఇలా అనేక కారణాలను ఎత్తిచూపుతూ సమ సమాజ నిర్మాణంలో భాగంగా స్త్రీవాదాన్ని ప్రపంచమంతా వినిపిస్తున్న వ్యక్తపరుస్తున్న సందర్భాలను, విషయాలను అనేకమంది రచయితలు స్త్రీవాద అస్తిత్వాన్ని కాపాడటానికి చేసే ప్రయత్నంలో తన ప్రత్యేక బాధ్యతగా నీహారిణి వ్యాసాలలో తెలియజేస్తుంది.

ఆదర్శవాది. చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ 80 ఏళ్ళు వచ్చినా అద్భుతమైన రచనలు చేస్తున్నారని తెలియజేస్తూ... **"ఆమె,/ కాదు కేవలం ఒక భామ/ ఈ తరం సత్యభామ/ ఆమె కాదు కేవలం అభిసారిక/ ఆమె ఈ విశ్వ నాటక ప్రథమ భూమిక/ లేదామెకు కులుకులు/ లేదామెకు అలకలు/ లేదామెకు సపత్నీ మత్సరాలు/ లేనే లేదామెకు కోపగృహాలు/ కానీ ఆమె ధరించిందొక కవితా ధనస్సు /చీల్చి వేస్తున్నది, జీవన విషాద తమస్సు"** అంటూ కణకణ మండే నిప్పు కణికల్ని గళంలో గరళం దాచుకుని భావావేశ కవిత్వాన్ని సంధించింది. లక్ష్మీనరసమ్మ ఈ కవితను 1980లోనే రాశారని. తాను చూసిన దృశ్యాలను తమకు తెలిసిన విషయాలను, స్వీయ అనుభవాలను పురాణగాథల నాయికల ప్రతీకలతో పరోక్షంగా చూపిస్తూ రాసిన ఈ కవిత తరతరాల స్త్రీజాతి బ్రతుకును చిత్రిక పడుతున్నదని వివరించారు.

మాతృస్వామ్య కుటుంబ జీవనం నుండి మార్పు చెందుతూ పితృస్వామ్య కుటుంబ జీవనంగా మన దేశంలో కొనసాగుతున్న అనేక పరిస్థితులను పరిశీలనలోకి తీసుకొని, ఆ మార్పు పరిణామ క్రమం ఏ రూపాంతరానికి కారణమవుతుందో ఆ పర్యవసానంగా ఎటువంటి పరిస్థితులను సమాజం ఎదుర్కొంటుందో అందులో కుటుంబ జీవనం అయితే నేమి! రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ బాధ్యత లైతేనేమీ!! లింగ వివక్ష కారణంగా ఎదుర్కొంటున్న పరిస్థితులు కారణమైతేనేమి!!! ఇలా అనేక కారణాలను ఎత్తిచూపుతూ సమ సమాజ నిర్మాణంలో భాగంగా స్త్రీవాదాన్ని ప్రపంచమంతా వినిపిస్తున్న, వ్యక్తపరుస్తున్న సందర్భాలను, విషయాలను అనేకమంది రచయితలు స్త్రీవాద అస్తిత్వాన్ని కాపాడటానికి చేసే ప్రయత్నంలో తన ప్రత్యేక బాధ్యతగా నీహారిణి వ్యాసాలలో తెలియజేస్తుంది.

'స్త్రీవాదం 'సంఘటిత' పరిచిన కవిత్వం' వ్యాసంలో రచయిత్రి జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన సంఘటిత కవితా సంకలనం గురించి రాసిన వ్యాసం. కవయిత్రి జయప్రద రాసిన కవిత లో...."రెండు కళ్ళనించి చూపులు సూదుల్లా వచ్చి/ మాంసపు ముద్దలపై విచ్చలవిడిగా తిరుగు తుంటాయి/ చూపులెప్పుడూ ముఖంలోకి చూడవు / మాట ఎప్పుడూ మనసు నించి పుట్టదు/ కనిపించినప్పుడల్లా కంపరం పుట్టేలా/ వంటిమీద చూపులు చెదల్లా పాకుతుంటాయి" (చూపులు), 'జయప్రభ గారు ఎప్పుడో రాసిన ఈ కవితను ఇక్కడ తప్పనిసరి గుర్తు చేసుకోవాలి' అని రచయిత్రి కొండపల్లి నీహారిణి వివరిస్తూ ఎందుకు స్త్రీవాదం అవసరం అంటే ఇదిగో ఇందుకు! ఈ పంక్తులలోని భావాన్ని విడమరిచి చెప్పకున్నా తెలిసిపోతుంది. అందుకే, ఈ దేశంలోని ఆడవాళ్ళకి వళ్ళంతా ముళ్ళుండే రోజు ఎప్పుడొస్తుందా" అని చూడాల్సి వస్తుందని ఖరాఖండిగా చెప్పారీ కవయిత్రి అంటూ వివరించారు.

ఓల్గా రాజకీయ కథలు -ఓ విశ్లేషణ వ్యాసంలో స్త్రీవాద రచయిత్రి ఓల్గా రాసిన కథలను వివరిస్తూ... సమాజం లోంచి సమాజ పరంగానే విశ్లేషణ వివేచనలతో సమూహాలను కదిలించేదిగా పుట్టుకొచ్చి బలపడి ప్రాబల్యంతో రాజకీయాలు జనపాలనకు తగిన విధంగా రూపుదిద్దుకున్నాయి. ఈ గమన క్రమంలోనే అవినీతికి మరోపేరుగా, 'అంతా రాజకీయం' అనే మారుపేరుగా మార్చేసిన రోజుల్లో ఉన్నాం. రాజకీయాలు అనే ఈ మాట గొప్పమాట.

కాని ఏనాటినుండో తమవైన రాజకీయాలు చేసి స్త్రీని తమ చేతుల్లో కీలుబొమ్మగా చేసిన రాజకీయాలు ఎన్నో ఉన్నాయి. ఓల్గా 'రాజకీయ కథలు' కథలుగా మనల్ని చదివించి మనకళ్ళు తెరిపించేవి అని ప్రస్తావించారు.

స్త్రీ అనగానే ఎట్లా ఆలోచిస్తారో, ఎట్లా ఊహిస్తారో, ఎట్లా మాట్లాడుతారో ఓల్గా చాలా నిర్మొహమాటంగా ఎట్లా రాసారో వారి మాటలో చెప్పిన విషయాలను తప్పకుండా అందరూ చదవాల్సినదేనని అప్పుడైనా ఆత్మవిమర్శ చేసుకునే ప్రయత్నం చేస్తారని తెలిపింది.

సమ్మక్క, సారక్కలు వ్యాసంలో...పండుగలు, ఉత్సవాలు, జాతరలలో మానవీయ సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, ఆనందోత్సాహాలను పొందుతుంటారు ప్రజలు.

వరంగల్లు కోటకు సమీపంలోని మొగిలిచర్ల గ్రామంలో ఏకవీరాదేవి ఆలయం ఉంది. ఏకవీర గ్రామదేవత కాదు. మానవ జన్మమెత్తిన వీరవనితలైన సమ్మక్క సారక్కలు దేవతలుగా కొలువబడు తున్నారు. రాణి రుద్రమ 80 సంవత్సరాలకు పైబడి రాజ్యాధికారంలో ఉండి, చివరగా ప్రజల శత్రువైన కాయస్త అంబదేవునితో యుద్ధంలో చంపబడిందని, ప్రజల కొరకు ప్రాణాలు కోల్పోయిన రుద్రమదేవి పేరున ఎలాంటి జాతరలూ, కొలువులూ చేయలేదని సమ్మక్క సారలమ్మలకు విశేష ప్రజాదరణ లభించిందని పూజారతలు సంపాదించి పెట్టిన వారి మానవాతీత శక్తులను ప్రజోపయోగానికి వినియోగించడం వల్లనేమో! కట్టుబాట్లను, అవరోధాలను ఛేదించి ప్రజలు తమ ఇష్టదేవతలను ఆరాధిస్తున్నారు. కేవలం కోయ జాతికి, కులానికే సమ్మక్క సారక్కల జాతర పరిమితం కాలేదు. సర్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరిసే ఈ జాతర ప్రజాదరణ పొందినదని రచయిత్రి నీహారిణి వివరించారు.

ఆసియా ఖండంలో అతిపెద్ద జాతరగా సమ్మక్క సారలమ్మ జాతరను చెప్పుకుంటారని మరో వ్యాసంలో రచయిత్రి కళ్లకు కట్టినట్లుగా తెలియజేశారు.

ప్రతిభావంతమైన నాటక రచయిత్రి అమృతలత అనే శీర్షికతో రాసిన వ్యాసంలో... ప్రస్తుతం నాటక రచయితలెవరు, బాలల నాటక రచయితలెవరు అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు. తొవ్వి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఎప్పుడో 1970లలోనే నాటకాలు రచించి, తమ పాఠశాలలో విద్యార్థులతో ప్రదర్శింపచేసారు డా॥అమృతలత. 1989లలోనే వీరు రచించిన ఎన్నో నాటకాలు పలు ప్రసిద్ధ దిన, వారపత్రికల్లో ప్రచురించబడ్డాయని పాఠకుల ఆదరణకు పాత్రమైనవని వివరించారు. డా.కొండపల్లి నీహారిణి రచించిన 'అనివార్యం' స్త్రీవాద సాహిత్య విమర్శా వ్యాసాల సంపుటిలోని ప్రతి వ్యాసం దేనికదే ప్రత్యేకం. స్త్రీవాదాన్ని నాటినుండి నేటి వరకు బలంగా వినిపిస్తున్న రచయిత్రుల అంతర్గత, బాహ్య వాదనలతో పాటు, తెలంగాణ ప్రాచీన కవుల కవిత్వ ప్రభావం గురించి, పత్రికా సంపాదకత్వంలో స్త్రీల గురించి, మహిళలకు సమస్యగా మారిన మద్యపానం గురించి, ఇలా పలు విమర్శనా వ్యాసాలను ఇట్టి సంపుటిలో వివరణాత్మకంగా తెలియజేశారు. అంతే కాకుండా స్త్రీ పురుష లింగ వివక్షతను వ్యతిరేకిస్తూ, స్త్రీ స్వేచ్ఛను, స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రగాఢంగా విశ్వసిస్తున్నది. సాహిత్య సృజనయే కాక, అనేకమంది రచయితలను ప్రోత్సహిస్తూ రెండు పత్రికలు నిర్వహిస్తున్నారు. తన వంతు కర్తవ్యంగా సాహిత్య సేవలో భాగమై పలు సాహితీ కార్యక్రమాలకు, పుస్తక సంకలనాలకు సంపాదకత్వాన్ని వహిస్తున్నారు. ఇలాంటి మరిన్ని రచనలు తన కలం నుండి వెలుబడాలని కోరుతున్నాను.



- డా. చిటికెన కిరణ్ కుమార్, 9490841284

నేనూ-అతనూ



సొంతంగా నాక్కొంత భూముంటే
అతని దగ్గర నీళ్ల పారకాన్ని
కొంత అరువుగా తీసుకుని
దుక్కి దున్ని నాలుగు విత్తనాలు పండించి
భూమిని సస్యశ్యామలం చేద్దును
అతననుకున్నాడు!
నిజమే నాకో బావి అందులో కొన్ని నీళ్లూ వుండి వుంటే
చేబదులిద్దును పంట చేతికొచ్చాక
ఇద్దరమూ కడుపు నింపుకునేవాళ్ళం
నిజానికి భూమీ, నీళ్లూ, ఆకాశం, గాలి
అన్నీ అందరివీ ఏ ఒక్కరివీ కాదంటారు!
కానీ నాకేమో భూమి లేదు అతని దగ్గర నీళ్ళు లేవు
ఒకవేళ మాదంటూ మాకంటూ
అడుగంత భూమీ, పిడికెడంత ఆకాశం
బుక్కెడన్ని నీళ్లూ, గుప్పెడంత గాలీ వుండివుంటే
ఈ లోకానికి కొంత పచ్చదనాన్నీ
ఆకలిగొన్న ఆ కడుపుల కింత అన్నమూ పెట్టేవాళ్లం
అతనికీ నాకూ ఇద్దరికీ వున్న సమస్యల్లా
నాకు భూమి లేదు, ఆతనికి నీళ్ళు లేవు
ఆకాశంకేసి చూస్తూ గాలిని భోంచేస్తున్నాం

- వారాల ఆనంద్

కోప కాలం

మనిషికే కాదు కాలానికీ కోపం వస్తుంది
అసహనం పెరిగిన చోట మొలిచేది 'క్రోధి' వృక్షమే!
బయటి యుద్ధం సరే లోపలి యుద్ధాలకే అంతుండడం లేదు
ఎవరి విశ్వాసాలు వారివి సహనం కోల్పోతేనే విధ్వంసాలు!
ఒకరి భుజాల మీద మరొకరు
ఎక్కే కదా ఆకాశాన్ని ముద్దాడింది
కలిసి బ్రతకడానికి అతి పెద్ద రాజ్యాంగం
ఏ కోణంలోంచి చూసినా ఉల్లంఘనలే!
అతిథితులుగా భూమ్మీదకు వచ్చాక ఉన్న నాలుగు రోజులైనా
మనసారా ఒక కౌగిలింత ఒక పలకరింపు
ఆప్యాయంగా ఒక కరచాలనం!
వేదం మన తోబుట్టువు కదా
కలిసి కళకళలాడే పూల మొక్కల్లాగా
నాలుగు కాలాలపాటు మనుషులుగా
ఈ నేల మీద పరిమళించ లేమా?!
ఉద్రేక ప్రసంగాలు ఎవరు విన్నా
పాదరసంలా పాకేది ఉన్మాదమే
గాయం చేయడం సుళభమే
మానాలంటేనే కాల పరీక్షకు నిలవాలి!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 9440233261

సాహితీ వార్తలు

వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాలు

పాలపిట్ట మాస పత్రిక - వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సుప్రసిద్ధ సాహితీవేత్త వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాలను వెల్లడించింది. మొదటి మూడు బహుమతులు వరుసగా 'మౌన యాగం, ఋతుచక్రం, నిశ్శబ్దపు ఆకలి' కథలలు, 8 ప్రత్యేక బహుమతులు... 'స్టీల్ వాకర్, జుట్టు నెరిసింది, ఒక్కసారి మా ఊరికి పోయి రావాలి, కలగనటం తప్పుకాదు కదా!?, మహాప్రస్థానానికి మరో మహాదారి, పరీక్ష సమయమ్, ఐచ్ఛికం, నాన్న'. విజేతలకు జూన్ 6వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుంది. - గుడిపాటి

మరోగ్రంథాలయ ఉద్యమం

విద్యార్థుల కోసం లక్షల కాపీల కవితా సమాహారం పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థులను సాహిత్యంలోకి ఆహ్వానించే దిశగా మరో గ్రంథాలయ ఉద్యమం మహా ప్రయత్నంలో భాగంగా రెండు రాష్ట్రాల కవులు రాసిన వచన అచ్చయిన కవితలను studentspoetrybook2024@gmail.com ఈ మెయిల్ చేయండి

-పలమనేరు బాలాజీ, 919440995010

కవితల పోటీ ఫలితాలు

సాయుధ తెలంగాణ పోరాట యోధులు కర్క ముత్తారెడ్డి స్మారకార్థం వసుంధర విజ్ఞాన వికాస మండలి నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కవితల పోటీ ఫలితాలను ప్రకటించారు. ఐదు సమాన బహుమతులకు గాను ఎస్.లహరి, జీ.వీ రమణ, ఆలేటి పరంజ్యోతి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రాకుమార ఎంపికయ్యారు. ప్రోత్సాహ బహుమతులకు ఫిజిక్స్ అరుణ్‌కుమార్, నల్లు రమేశ్, పోత్తూరి సీతారామరాజు ఎంపికయ్యారు. వీరికి త్వరలోనే హైదరాబాద్‌లో జరిగే సంస్థ 31వ వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తారు. - వి.సుమలత, 8688603130

మానవత్వాన్ని మేల్కొలిపే కవిత్వం

సుమారుగా రెండు దశాబ్దాలకు పైగా కవిత్వం రాస్తున్న ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు. తాను రాస్తున్న కవిత్వంతో ధిక్కార స్వరాన్ని లోకానికి వినిపిస్తున్నారు. నిరంతరం తనని తాను సరిచేకుంటూ, అక్షరాలను పేనుకుంటూ కవిత్వాన్నే శ్వాసిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకున్న కవి సిరికి స్వామినాయుడు. ఆయన పుట్టిన మట్టితో... ఆయన నడియాడిన మట్టితో... ఆయన గాలి పీలుస్తున్న మట్టితో... కవిత్వం అనే బొమ్మలు చెక్కుతున్న శిల్పి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తున్నది సిరికి గళం, కలం. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజా సంక్షోభాల్లోంచి పుట్టిన కవి. విజయనగరం జిల్లా, తెర్లాం మండలం, కుసుమూరు గ్రామానికి చెందిన ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఇప్పటివరకు 'మంటి దివ్వ' (2011), 'మట్టిరంగు బొమ్మలు' (2018) అనే కవితా సంపుటిలు వెలువరించారు. వివిధ దినపత్రికల్లో, మాస పత్రికల్లో ఆయన రాసిన కవితలు తరచూ వస్తూనే ఉన్నాయి. "ఎక్సరే ప్రధాన అవార్డు" (2008), "ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం" (2011), "రంజనీ కుందుర్తి జాతీయ అత్యుత్తమ పురస్కారం" (2012), "రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం" (2013), "ఉగాది పురస్కారం" (2018) అందుకున్నారు. తాజాగా 2018వ సంవత్సరానికి గాను ఫ్రీవర్స్ ఫ్రంట్ 49వ అవార్డు 'మట్టిరంగు బొమ్మలు' కవితా సంపుటికి అందుకున్నారు.

గిరిజన ప్రాంతాల్లో పనిచేయడం వల్ల, అక్కడి ప్రజల నిత్యజీవితాల్లోని అలజడులను దగ్గరగా చూశారు. భూమిని నమ్ముకున్న రైతుకు, రైతుల్ని నమ్ముకున్న నిరుపేద కుటుంబాలకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్లారా చూసి, ఆ దుఃఖాన్ని కవిత్వంగా మలచి ఆవిష్కరించారు. సామాజిక స్థితిగతులను చూసి రగిలిపోయి కవిత్వమనే చైతన్య దివిటీలు వెలిగించారు. తన వేదనను ఆవేదననూ కవిత్వంగా మార్చి తానేమిటో సాహిత్యంలో నిరూపించుకున్నారు. ప్రగతిశీల దృక్పథంతో సృజనాత్మక రంగంలో కృషిచేస్తున్న వీరి నేపథ్యం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. 'మట్టిరంగు బొమ్మలు' కవితా సంపుటి 70 కవితల సమాహారం. ఈ కవితలు పాఠకుల హృదయాన్ని మీటుతాయి.

ప్రపంచీకరణయుగం ప్రవేశించాక రైతన్న జీవితం, వ్యవసాయం చిందరవందరగా తయారైంది. భూమి దున్నే యజమాని కూలీగా మారిపోవడం, పనులు లేక ఊర్లో ప్రజలు వలస బాట పట్టడం మొదలైన సన్నివేశాలు చూసి సిరికి తీవ్రంగా స్పందించారు. చీకటి పడినా పనికి వెళ్ళిన భర్త ఇంకా రాకపోవడంతో ఆవేదన చెందుతున్న భార్య మనస్తత్వాన్ని 'నాగళ్ల మొనల మీద...!' కవితలో కవి చాలా ఆర్ధ్రంగా చిత్రీకరించారు.

"కూలికోసం.../ తూరుపుకన్ను తెరవక ముందు పోయినోడు!/ ఎక్కడ యే రాళ్లు కొడుతున్నాడో...!/ భవనానికి బువ్వ పెట్టాల్సినవాడు/ ఎక్కడ, యే భవనాలకు పునాదులేస్తున్నాడో...!/ అతడొస్తే బాగున్ను, బతుకుపోరులో గెలిచి/ నాగళ్ల మొనల మీద ఒక దేశాన్ని నిలబెట్టదానికి!!" అంటూ కవి వ్యవసాయేతర కూలీగా మారిన రైతన్న పట్ల తన ఆవేదనను ఈ కవితలో వ్యక్తం చేశారు. స్వామినాయుడికి పొలానికెళ్లిన రైతు, యుద్ధభూమిలో సైనికుడిగా కనిపిస్తాడు. మట్టిని ప్రేమించి, పూజించే రైతును గురించి రాసే ఆధునిక కవుల్లో స్వామినాయుడు ఒకరు.

పొలం దున్ని ప్రపంచానికి అన్నం పెట్టే రైతు, పంట కోసం చేసిన అప్పుల భారం మోయలేక ఆత్మహత్య చేసుకున్న గాథను 'ఎదురీత' కవితలో.. **"నువ్వు లేవు,/ నిదురగూటిలోంచి ఉలిక్కిపడిలేచిన గువ్వలు/ 'అయ్యేదీ'.. అని అడుగుతూనే ఉన్నాయి!/ గంగడోలు దువ్వుతూ నువ్వు గుర్తొచ్చావేమో.../ కట్టుదగ్గర మూగజీవాలు కన్నీరు కారుస్తూనే ఉన్నాయి!/ నీవు లేవని ఎవరుజెప్పారో../ అరటితోట పెళ్లున విరిగిపోయింది!/ నీవు లేవని ఎవరు కబురిచ్చారో, యేరు/ హోరుహోరుమంటూ ఏకధారగా ఏడుస్తూనే ఉంది!"** అంటూ సిరికి స్వామినాయుడు రైతు ఆత్మహత్య చిత్రాన్ని హృదయాన్ని ద్రవించేలా ఈ కవితలో చిత్రీకరించారు.



"ఉద్దానమా... ఊపిరి తీసుకో!" కవిత పాఠకుల్ని కంటతడి పెట్టిస్తుంది. పాఠకుల హృదయాన్ని కంటతడి పెట్టించే శక్తి స్వామినాయుడుగారి కలానికి ఉంది. సిక్కోలు ప్రాంతంలో ప్రాణాలు కోల్పోతున్న గ్రామాలు స్థితిని కళ్ళకు కట్టినట్టుగా చూపారు.

"ఉద్యానవనాల ఉద్దానంలో.. నిత్య తద్దినాల నైరాశ్యం!/ చావుగాలికి చిగురుటాకుల్లా వణికిపోతున్నాయి పల్లెలు!/ ఆరటంలేదు చితులు! నిత్య శవాలజాతరలో../ ఆగడంలేదు చావు డప్పులు! పాడెత్తని రోజే పండగ!" అని అనగానే ఒక్కసారిగా పాఠకుల కళ్లల్లో నీళ్ళు ప్రవహిస్తాయి. ఈ దుస్థితిని ప్రజలపక్షాన నిలబడి కవి ప్రభుత్వానికి తన గళాన్ని వినిపించారు. మనిషి వైపు, ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడని పాలకవర్గాల దుర్మార్గాన్ని ప్రశ్నించారు. స్వామినాయుడు అక్షరాలా ప్రజలకవి. పీడిత తాడిత సమాజం నుంచి పుట్టుకొచ్చిన కవి. పాలక వర్గాల దురన్యాయాలను తూర్పారపడుతున్నారు.

అడవులలో, కొండలలో నివసించే గిరిజనుల బతుకు చిత్రాలను తన కవితలలో వీరు చూపించారు. ప్రపంచీకరణ ప్రభావం గిరిజనుల జీవన విధానాన్ని ఏ రీతిగా చిన్నాభిన్నం చేసిందో ఈయన కవితలలో చూడవచ్చు. గిరిజనుల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, సంస్కృతిని, పండగలను, అడవి సౌందర్యాన్ని ఒకవైపు చూపించారు. పెత్తందార్లు, పెట్టుబడిదార్లు వచ్చి గిరిజనులను దోచుకుని కొండకు దూరం చేసే దుర్మార్గ సన్నివేశాల్ని మరో వైపు హృద్యంగా 'దుర్గ' కవితలో చూపారు.


"యిప్పుడా పండుగల్లేవు, పున్నాల్లేవు,/ తుడుంనాదాల్లేవు, థింసానాట్యాల్లేవు!/ పచ్చని అడవుల్లో.../ యిపుడు పాప్ సంగీతాల హోరు!/ పురి విప్పిన నెమళ్ళ వనాల్లో../ యిపుడు దిగంబరదేహాల తైతక్కలు!/" అని అడవి ఈ దుస్థితిని ఏర్పడడానికి కారణం అయిన పెత్తందార్లను, షావుకార్లను తూర్పారబట్టారు. శిశిరం నడిచిన జాడలు, మోదుగు పూలు, వెదురు పొదల యుద్ధ రహస్యం, నిత్యగాయాల నెలవంక మొదలైన కవితలలో కూడా గిరిజనుల దయనీయ స్థితిని చూడవచ్చు.

ఈ కవితా సంపుటికి శీర్షికగా నిలిచిన 'మట్టిరంగు బొమ్మలు' ప్రపంచీకరణ ప్రభావం వల్ల గ్రామాలు ఏ రీతిగా నేడు ఉన్నాయో ఈ కవితలో కవి తన ఆవేదనను వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని తన ధిక్కార స్వరంతో ఎలుగెత్తి చాటి చెప్పిన సన్నివేశాలు ఈ కవితలో మనం దర్శించవచ్చు.

"అప్పటి వూరు.. గంపెడు సంసారాల్ని/ గుట్టుగా కడుపునా దాచుకునే కోళ్లగంప!" అని ఊరు సౌందర్యాన్ని సిరికి చెప్పాడు. నేడు మాత్రం అవే గ్రామాలు ఎలా ఉన్నాయో...

"మాయదారి కాలం దాపురించింది!/ వేయిపడగల విధ్వంసమొక్కటి అభివృద్ధి ముసుగేసుకుని/ నా ఊర్లో అడుగుబెట్టింది!/ వచ్చిపడింది ప్రపంచీకరణ వరద!/ ఇప్పుడు ఊళ్లు,/ వరదనీటికి కరిగిపోయిన మట్టిరంగు బొమ్మలు" అంటూ పల్లెల పరిస్థితిని కళ్ళకు కట్టినట్టుగా చూపించారు.

వర్తమాన సామజిక సంక్షోభాన్ని కళ్లముందు నిలిపే వస్తువును తన కవిత్వంలో చూపిస్తూ, ఆ కవితలకు మరింత శక్తిని ఇచ్చే భాషను పొదుగుతూ ప్రవాహంలా సాగిపోయే భావధార సిరికి స్వామినాయుడు కలం సొంతం. అద్భుతమైన అభివ్యక్తి సౌందర్యంతో స్వామినాయుడు కవిత్వాన్ని అవగాహన చేసుకొన్న కవి. ఆయన మాట్లాడే ప్రతి అక్షరమూ కవిత్వమే. ఎందుకంటే అతని జీవితమే కవిత్వం. కవిత్వంలోనే కాదు, జీవితంలోనూ కొన్ని సామాజిక విలువలుండాలని బలంగా నమ్మే ఉత్తరాంధ్ర ప్రాంతపు వర్తమాన కవులకూ, కథకులకూ గంటేడ గౌరునాయుడుకు ఈ కవితా సంపుటిని అంకితమిచ్చి తన గురుభక్తిని చాటుకున్నారు. అట్టడుగు జీవితాల్ని అక్షరాల్లో పొదిగి, ఎదిగింపజేస్తున్న కవి సిరికి స్వామినాయుడు. ఈ కవితా సంకలనంలో ఏ పుటను తెరచినా బంగారంలా కవిత్వం మెరిసిపోతుంది.



- సారిపల్లి నాగరాజు, 8008370326

పిడుగుపాటుకు ముగ్గురు రైతులు మృతి

- వికారాబాద్ జిల్లా యాలాలలో ఘటన



నవతెలంగాణ-తాండూరు

పిడుగుపాటుకు గురై ముగ్గురు రైతులు మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలోని జుంటుపల్లి, బెన్నూర్ గ్రామాల్లో ఆదివారం జరిగింది. జుంటుపల్లి గ్రామానికి చెందిన మంగాలి శ్రీనివాస్(35), కోనింటి లక్ష్మప్ప (28) పెర్కంపల్లి గ్రామ శివారు పొలంలో వరి కోపిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో వారు వరి కోత మిషన్ కింద కూర్చుకున్నారు. ఈ క్రమంలో పిడుగు పడటంతో మంగాలి శ్రీనివాస్, కోనింటి లక్ష్మప్ప అక్కడికక్కడే మృతిచెందారు. వరి కోత మిషన్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను తాండూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అలాగే బెన్నూర్ గ్రామంలో గొల్ల వెంకటయ్య (62) రైతు పంట పొలానికి మందు కొడుతున్నాడు. వర్షం పడటంతో చెట్టు కిందికి వెళ్లాడు. ఈ క్రమంలో పిడుగు పడటంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందారు. ఒకే మండలంలో ఒకే రోజు ముగ్గురు రైతులు పిడుగుపాటుకు గురై మృతిచెందడంతో బాధితుల కుటుంబాల్లో విషాదఛాయాలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

పిడుగుపాటుకు గురై ముగ్గురు రైతులు మృతిచెందిన ఘటన పట్ల తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన రూ.ఆరు లక్షల ఆర్థిక సహాయం అందేలా వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆర్డీవోకి సూచించారు. వీలైనంత త్వరలో బాధిత కుటుంబాలకు సాయం అందేలా కృషి చేస్తానని ఒక ప్రకటనలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మిషన్ భగీరథ పైప్ లైన్లు లీకేజీ భారీగా వృథా పోతున్న నీరు

నవతెలంగాణ-మల్హర్‌రావు



జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని మల్లారం అరేవాగు బ్రిడ్జి, ఇప్పల వద్ద అటవీ ప్రాంతంలోని గుట్టపై మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లైన్లు లీకవుతోంది. నీరు భారీగా వృథా పోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఈ విషయంపై మిషన్ భగీరథ, గ్రిడ్ అధికారులకు ఆదివారం ఉదయం నుంచి స్థానికులు సమాచారం అందిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఆదివారం ప్రభుత్వ సెలవు కావడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించిన ఉన్నతాధికారులు పట్టించుకొని పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అరుదైన రక్త గ్రూప్, రక్తదాతల అవగాహనా సదస్సు

- ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్, నిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్, నిమ్స్ ఆధ్వర్యంలో అరుదైన రక్త గ్రూప్, రక్తదాతల అవగాహనా సదస్సును ఆదివారం నిర్వహించారు. సదస్సుకు ముందు బాంబే బ్లడ్ గ్రూప్ దాతలను.. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప, నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణతో కలిసి బాంబే బ్లడ్ గ్రూప్ దాతలను సత్కరించి వారి సేవా స్ఫూర్తిని కొనియాడారు. నిమ్స్ బ్లడ్ సెంటర్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.శాంతి మాట్లాడుతూ.. అరుదైన బ్లడ్ గ్రూప్స్ కలిగిన బాంబే గ్రూప్ దాతలను సత్కరించి, నమోదు కార్యక్రమం చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సదస్సులో వివిధ బ్లడ్ సెంటర్స్ నుంచి ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ స్పెషలిస్టులు పాల్గొని అరుదైన బ్లడ్ గ్రూప్స్ గురించి వారి అనుభవాలను పంచుకున్నారు. ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్ డాక్టర్ స్వాతి కులకర్ణి అరుదైన బ్లడ్ గ్రూప్స్ నమోదు కార్యక్రమం, మాలిక్యులర్ టీసింగ్ గురించి వివరించారు. అనంతరం ఈ సదస్సును విజయవంతం చేసిన ఐసీఎంఆర్-ఎన్ఐఐహెచ్ డాక్టర్ మనీష, నిమ్స్ బ్లడ్ సెంటర్ సిబ్బంది డాక్టర్ మహేష్, డాక్టర్ మురళి, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ వైద్య విద్యార్థులు, టెక్నికల్, నర్సింగ్ సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన డాక్టర్లకు ధన్యవాదములు తెలిపారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

సుందరయ్య స్మారకోపన్యాసంలో ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎస్ మురళీధర్ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ, దేశంలోని మత సామరస్యానికి విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్‌థాకరే అప్పట్లో ఎన్నికల సభల్లో చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు ఆక్షేపిస్తూనే, 'హిందూ' అనే పదం మతం కాదనీ, ఆదో జీవన విధానం అంటూ కామెంట్ చేసిందని గుర్తుచేశారు. దీన్ని అడ్డుపెట్టుకొని ప్రస్తుత ఎన్నికల సభల్లో హిందూ శక్తులు ఇతరుల్ని రెచ్చగొట్టేలా ఇష్టంవచ్చినట్టు మాట్లాడుతున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్య, లౌకికత్వానికి సరైంది కాదని చెప్పారు. సుప్రీం కామెంట్స్‌ను సరిదిద్దేలా అప్పటి నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నా, ఇప్పటికీ కొలిక్కిరాలేదని తెలిపారు. భావప్రకటనా స్వేచ్ఛలో భాగమైన మీడియాను ఇప్పుడు ప్రభుత్వాలు, కార్పొరేట్లు, రాజకీయపార్టీలు నియంత్రిస్తున్నాయని వివరించారు. రిలయన్స్ సంస్థ చేతిలో 700 ఛానల్స్ ఉన్నాయనీ, దూరదర్శన్ ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని ఉదహరించారు. టీవీ చర్చలన్నీ మోడీకి అనుకూలంగా జరుగుతున్నాయనీ, బీబీసీ వంటి విదేశీ మీడియా కూడా ఆయన్ని ప్రశ్నించలేని స్థితిలో ఉన్నదని చెప్పారు. ప్రశ్నిస్తే ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు జరుగుతున్నాయనీ, ప్రబీర్ పుర్కాయస్థ, సిద్దిక్ థాపర్ వంటి వాళ్లపై అనేక కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని గుర్తుచేశారు. టీవీలో వాణిజ్య ప్రకటనలు కూడా నైతికత లేకుండా ఉంటున్నాయన్నారు. ఎక్కడైనా మత సామరస్యాన్ని చూపిస్తూ వాణిజ్య ప్రకటనలు వస్తే, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) వంటి సంస్థలు దాడులకు తెగబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు, మత విశ్వాసాలను నియంత్రిస్తూ, శాసిస్తూ వీహెచ్‌పీ వంటి సంస్థలు ఇప్పుడు అన్నిరంగాల్లోకి చొరబడుతున్నాయని చెప్పారు. ఎమ్ఎఫ్ హుస్సేన్, కబీర్ కళామంచ్, మహ్మద్ జుబేర్ వంటి కళాకారులపై కూడా కేసులు పెట్టి వేధించిన చరిత్రను చూస్తూనే ఉన్నామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, మణిపూర్ అల్లర్ల సమయంలో ఇంటర్నెట్ సేవలు సహా అన్నీ నిలిపేసి, మీడియాపై ఆంక్షలు విధించి, అక్కడ ఏం జరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియకుండా చేశారని విమర్శించారు. దళితులు భావప్రకటనా స్వేచ్ఛను వెల్లడించకుండా, వారిపై నిర్బంధాలు, దాడులు చేస్తున్నారని వివరించారు. సెల్‌ఫోన్లలో ఇంటర్నెట్‌ను కూడా నియంత్రిస్తూ, మనం ఏం చూడాలో కూడా వారే నిర్ణయిస్తున్నారనీ, ఇంతకంటే అన్యాయం ఇంకేం ఉందని ప్రశ్నించారు. ప్రజలకు అందే వార్తలు ఏవీ కూడా పూర్తి ఉచితం కాదనీ, యాడ్ ఫ్రీ పేరుతో మరో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించారని తెలిపారు.

చదువుకున్న యువతరం విషయ అవగాహన లేకుండా, గ్రూపులుగా విభజించి కేవలం మతం అనే ఉచ్చుతో, దేశభవిష్యత్‌ను పణంగా పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనీ, దీనివెనుక రాజకీయ కుట్రకోణాలు ఉన్నాయని వివరించారు. డీప్ ఫేక్ న్యూస్‌తో ఇలాంటి ప్రచారాలను మరింత విస్తృతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఏ) వాక్ స్వాతంత్ర్యం, హక్కులు సాధించుకున్నామనీ, అయితే ప్రశ్నలు, విమర్శల్ని సహించలేని స్థితిలోకి నెట్టివేయబడుతున్నామని అన్నారు. ఇది ప్రజా ఐక్యత, భావప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కల్పిస్తుందని విశ్లేషించారు. ఆయన ప్రసంగం మొత్తం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా, పూర్తి ఆధారాలు, వీడియోలను చూపిస్తూ ఆసక్తిగా సాగింది. ఆయన ప్రసంగాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలుగులోకి అనువాదం చేశారు. అంతకుముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు జీ బుచ్చిరెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ నివేదిక సమర్పించారు. ఎస్వీకే ట్రస్ట్ అధ్యక్షులు బీవీ రాఘవులు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం స్మారకోపన్యాస కర్త డాక్టర్ ఎస్ మురళీధర్‌ను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నైరుతి వచ్చేసింది

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీ దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతు పవనాలు ఆదివారం విస్తరించాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ వాతావరణ కేంద్రం ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. 'మాల్దీవుల్లో కొన్ని ప్రాంతాలు, కొమోరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలో కొన్ని ప్రాంతాలకు ఆదివారానికి నైరుతి ప్రభావంతో రుతుపవనాలు చేరుకున్నాయి' అని ఐఎండీ తెలిపింది. ఈ నెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఇది క్రమంగా ఈశాన్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. మే 24 నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ అంతర్గత కర్నాటక వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా సగటు సముద్ర మట్టానికి 31 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ద్రోణి బలహీనపడిందని, ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన మెరుపులు ఒకట్రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

రుతుపవనాల రాకలో ఏటా వ్యత్యాసం

రుతుపవనాలు కేరళకు 31కు చేరుకుంటాయని ఐఎండి గతంలో ప్రకటించింది. ఐఎండీ డేటా ప్రకారం గత 150 సంవత్సరాల్లో కేరళకు నైరుతి రుతుపవనాల రాకలో ఏటా వ్యత్యాసం ఉంటుంది. అత్యంత తొందరగా 1918లో మే 11నే కేరళకు చేరుకోగా, 1972లో అత్యంత ఆలస్యంగా జూన్ 18న వచ్చాయి. గత ఏడాది కూడా ఆలస్యంగా జూన్ 8న వచ్చాయి. 2022లో మే 29, 2021లో జూన్ 3, 2020లో జూన్1న కేరళకు రుతుపవనాలు వచ్చాయి. పసిఫిక్ మహా సముద్రంలో లా నినా పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని గత నెలలోనే ఐఎండి అంచనా వేసింది. ప్రస్తుతం దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అనేక పట్టణాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదవుతోంది. ఇది ప్రజల ఆరోగ్యం, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారీ ఉష్ణోగ్రతలతో పవర్ గ్రిడ్‌లు దెబ్బతింటున్నాయి. నీటి వనరులు ఎండిపోతున్నాయి. దేశంలో అనేక ప్రాంతాలు కరువు వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందన్న అంచనా దేశానికి భారీ ఉపశమనం కలిగిస్తుంది.

భారతదేశ వ్యవసాయ రంగానికి రుతుపవనాలు చాలా కీలకం. నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం రుతుపవనాలపైనే ఆధారపడి ఉంది. విద్యుదుత్పత్తికి, తాగునీటికి కీలకమైన రిజర్వాయర్లు కూడా రుతుపవనాల కాలంలోనే నిండుతాయి. జూన్, జులై నెలలను రుతుపవనాల నెలలుగా పరిగణిస్తారు.

క్యాబినెట్‌కు ఈసీ ఓకే

(మొదటిపేజీ తరువాయి)

పులుముకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ప్రభుత్వం సుప్తచేతనావస్థలో ఉంది. ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో రెండు నెలలుగా విధానపరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. ఫలితంగా అనేక సమస్యలు పేరుకుపోయాయి. సంక్షేమ పథకాలు ఆగిపోయాయనీ, క్షేత్ర స్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పలుమార్లు సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టింది. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళికతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు సీఎంను కలిసి విన్నవించారు. కోడ్ పేరు చెప్పి కాంగ్రెస్ సర్కార్ సమస్యల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని వారు ఆరోపించారు. అయితే విపక్షాల విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. ఎన్నికల కోడ్ ఉందని తెలిసి కూడా బీఆర్ఎస్, బీజేపీలు పదే పదే రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల గురించి రాద్ధాంతం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాజకీయాలు మాని అభివృద్ధిలో కలిసి రావాలని హితవు పలికింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దుమారం లేపిన క్యాబినెట్ మీటింగ్ ఎట్టకేలకు షరతులతో ఈసీ అనుమతివ్వడంతో సోమవారం జరగనుంది. ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మోడీకి ఇస్లాం ఫోబియా పట్టుకుందేమో..!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ.. మతప్రాతిపదికన పాలన సాగిస్తున్న బీజేపీ విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజాస్వామ్య విధ్వంసం, లౌకికదేశం, సామ్యవాద స్థాపన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మెరుగైన సమాజం కోసం పోరాడాలన్నారు. ప్రజల కోసమే కమ్యూనిస్టుల పోరాటమని తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వాలు మారటం కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కడమేనని చెప్పారు. కమ్యూనిస్టు పాలనలోనే ఇలాంటి అవకాశాలు దక్కుతాయని తెలిపారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా పేదనే..!

రైతాంగం, శ్రామికులు, విద్యార్థులు, మహిళల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఆమె అన్నారు. బ్రిటీష్‌వాళ్లు కమ్యూనిస్టులను అణచివేయాలని చూశారని, అయినా ప్రజల కోసం వారు పోరాటం చేశారని చెప్పారు. మనుషుల మధ్య వైషమ్యాలు ఇంకా తొలగలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తెలిపారని, కానీ ఇప్పుడు వీటన్నింటికీ ముప్పు పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

భూస్వామ్య, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పోరాటం

భూస్వామ్యదోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సాగించే పోరాటంలో ప్రజలు మరింతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రపంచ మార్పు కోసం కార్మిక, కర్షక, శ్రామిక వర్గం పోరాడాలని నాడు మార్క్స్, ఎంగెల్స్ పిలుపునిచ్చారని తెలిపారు. 'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప' అని నినదించారని చెప్పారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని కూలదోసినా.. భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. సుందరయ్య, ఈఎంఎస్ నంబూద్రిపాద్, కృష్ణపిళ్లై, హరికిషన్‌సింగ్ సూర్జిత్, జ్యోతిబసు, మల్లు స్వరాజ్యం.. తదితరులు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు.సోషలిజం భావవ్యాప్తికి కృషి చేశారన్నారు. తెలంగాణ ఓ గొప్ప పోరాట భూమి అని అభివర్ణించారు. విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో భవననిర్మించడం అభినందనీయమని తెలిపారు.

కమ్యూనిస్టుల ఆదర్శ పాలన..

స్వాతంత్ర్యం వచ్చాక కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపురలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారన్నారు. కానీ నేడు ఒక్క కేరళలోనే కమ్యూనిస్టుల పాలన కొనసాగుతోందన్నారు. నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులు, శ్రామికులు సాగు చేసుకుంటున్న భూములను వాళ్లకే చెందేలా.. 1960లో కేరళలో భూసంస్కరణల చట్టం తెచ్చారని చెప్పారు. ఫలితంగానే ఇవాళ కేరళలో మెజార్టీ ప్రజలకు భూమి ఉందన్నారు. విద్యా, వైద్యం, సంపూర్ణ అక్షరాస్యత, శిశు మరణాల తగ్గింపులోనూ కేరళ దేశంలోనే ఆదర్శంగా ఉందని తెలిపారు. పేదల ఇండ్ల నిర్మాణం, పాఠశాలల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన ఇలా అన్నింటా కేరళ ఆదర్శంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి 12 నుంచి 15 ఎంపీ స్థానాలు గెలుస్తుందనే విశ్వాసాన్ని ప్రకటించారు. యూడీఎఫ్ ప్రాబల్యం అధికంగా ఉన్నా తాను పోటీ చేసిన వనగర్ ప్రాంతంలో సోషల్ మీడియా ద్వారా ప్రత్యర్థులు తనపై, పార్టీపై ఎంత దుష్ప్రచారం చేసినా తాను గెలవబోతున్నట్టు చెప్పారు.

సుందరయ్య ఓ మహాశక్తి.. సత్తెనపల్లి పేరుతో భవనం అభినందనీయం: తమ్మినేని

సుందరయ్య ఓ వ్యక్తి కాదు మహాశక్తి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని అన్నారు. సైద్ధాంతిక శక్తి సుందరయ్య అని తెలిపారు. సుందరయ్య వర్ధంతి రోజున ఖానాపురం హవేలీ కమిటీ భవనాన్ని విద్యుత్ పోరాట వీరుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. సత్తెనపల్లి రామకృష్ణతో పాటు ఆయన కుటుంబం ఎంతో క్రమశిక్షణ కలదిగా పేర్కొన్నారు. కార్యాలయ నిర్మాణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కార్యదర్శి తిరుపతిరావు, హవేలీ మాజీ సర్పంచ్ బుగ్గవీటి సరళను అభినందించారు. కష్టాలు, కన్నీళ్లు ఉన్నంత కాలం వాటిని తుడిచే కమ్యూనిస్టులు ఉంటారని స్పష్టంచేశారు. సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కార్యదర్శి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు పి.సోమయ్య, ఎం. సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, వై.విక్రమ్, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, చింతలచెర్వు కోటేశ్వరరావు, సత్తెనపల్లి రామకృష్ణ సతీమణి మంగ తదితరులు పాల్గొన్నారు.



'శ్రమ దోపిడీ' ఆదాయాలు!

పార్ట్ 3





ఒక సంగతి : 'కౌలూ, వడ్డీ'-అనేవి లేకుండా, 'లాభం' ఒక్కటే విడిగా ఉండదు. ఆ 3 తప్పుడు ఆదాయాలూ కలిసి, 'లాభం' అనే ఒకే మాటతోనే వుండే సందర్భాలు కూడా వుంటాయి. పెట్టుబడిదారుడు, ఈ 3 ఆదాయాలూ తీసుకుంటాడు. (1) తన పరిశ్రమని ఎంత భూమి మీద నడుపుతాడో, ఆ భూమి అతని స్వంతమే అయినా, ఆ భూమి కోసం, 'కౌలు' రావాలంటాడు. (2) సాధనాలూ, జీతమూ-అయిన 2 ఖర్చుల కోసం, డబ్బు పెడితే, దాన్ని పెట్టుబడిదారులు కేవలం డబ్బుగా చూడరు! ఎంత డబ్బు ఖర్చయితే, అంత డబ్బే వెనక్కి రావాలి- అనుకోరు. ఆ డబ్బుకి 'పెట్టుబడి' అనే పేరు పెట్టి "పెట్టుబడికి, 'వడ్డీ' రావాలి!" అంటారు. (3) చివరికి, పెట్టుబడిదారుడికి 'లాభం'!

సరుకుని (వస్తువుని) అమ్మితే, దాని 'ధర'లో నించే లాభం రావాలి! ఎలాగ? దీన్ని చూశాం కదా? పెట్టుబడిదారుడు, తన కొత్త సరుకుకి (వస్తువుకి) 'ధర'ని ఎలా ఏర్పరుస్తాడు? దాని కోసం తను పెట్టిన 2 ఖర్చులతో పాటు, తను కోరే 3 ఆదాయాల కోసం కూడా కొంత డబ్బు రావాలి - అని తన లెక్కలతో ధరని పెడతాడు. సరుకుని అమ్మితే, 2 ఖర్చులు వెనక్కి రావడమేగాక, 3 ఆదాయాలతో కలిసిన 'లాభం' కూడా రావలిసిందే! "భూమికి కౌలూ, అప్పుకి వడ్డీ, పరిశ్రమకి లాభం రావాలి" అని మనం చెప్పేయడం కాదు. కౌలుని తీసుకునేవాడు, ఏ శ్రమని ఇచ్చి కౌలుని తీసుకుంటాడు? వడ్డీని ఏది ఇచ్చి తీసుకునేవాడు? లాభాన్ని ఎలా? చెప్పగలరా వాళ్ళు?- ఈ 3 ఆదాయాలూ, స్వంత శ్రమలు లేకుండా, ఇతరుల శ్రమల్ని దోచే తప్పుడు ఆదాయాలే! **(మార్క్స్: "లాభం, వడ్డీ, వర్తక లాభం, భూమి కౌలూ వంటి ఒక దానితో ఒకటి సంబంధం లేని రూపాలతో, అదనపు విలువలోని భాగాలు రకరకాల వ్యక్తులకు పోతాయి.")**

ఈ 'లాభం' సంగతి, దాన్ని లాగే యజమానికి తెలిసినట్టుగా, 'శ్రమ దోపిడీకి గురి అయ్యే' శ్రామికుల్లో నూటికి 99 మందికి, ఈ నాటికీ ఇంకా తెలీదు!

ఈ 3 తప్పుడు ఆదాయాల వల్లా, శ్రమలు చేసే వారిలో, శారీరక శ్రమలు చేసే వారందరూ నిరుపేదలుగానూ, నిరుద్యోగులుగానూ, ఉంటారు. మేధాశ్రమల శ్రామికుల్లో కూడా నిరుద్యోగులుగా వుండని వారు, పేదలూ ధనికులూ కాని, మధ్య దశల్లో వుంటారు. శ్రామిక వర్గం వారందరూ ధనవంతులై పోవాలని కాదు సుమా! ఇక, తప్పుడు ఆదాయాల వారందరూ, ధనికులుగా, అందులోనే చిన్నా, పెద్దా దశల్లో ఉంటారు!

దినపత్రికల్లో 'బిజినెస్' పేజీల్లో, తరచుగా 'గత 3 నెలల కాలంలో ఫలాన కంపెనీ లాభాలలో వృద్ధి' అని, లెక్కలు చెపుతూ వుంటారు! లాభాల వాళ్ళు, లాభాలు వచ్చాయని ఎంత ధైర్యంగా చెప్పేస్తారో! ఆ ధైర్యం ఎందుకు? వారి వ్యతిరేక వర్గానికి ఏమీ తెలీదు కదా? ఆ లాభాలన్నిటికీ మూలం శ్రామికుల అదనపు విలువే అనీ, శ్రమ దోపిడీయే అనీ, అసలు విషయాన్ని పాఠకులు గ్రహించాలి! ఈ 3 ఆదాయాలనూ ఉత్తమ ఆదాయాలుగా భావించేవారందరూ, ఈ ఆదాయాలు ఎప్పుడూ ఉండాలనే, వాటిని స్థిరపరచాలనే చట్టాలతో ప్రభుత్వ పాలన సాగిస్తూ వుంటారు! **(మార్క్స్, ఎంగెల్సులు: "రాజ్యం అనేది, పాలకవర్గానికి చెందిన వ్యక్తులు, తమ ఉమ్మడి ప్రయోజనాల్ని శక్తివంతంగా వ్యక్తీకరించే రూపం.... ఆధునిక కార్యనిర్వాహక యంత్రాంగం అనేది మొత్తం బూర్జువా వర్గపు ఉమ్మడి వ్యవహారాల్ని నిర్వహించే ఒక కమిటీ మాత్రమే.")** ఈ నాటికీ, 'ప్రపంచ దేశాలన్నిటిలోనూ' వున్న పరిపాలనలన్నీ శ్రమ దోపిడీ కోసం సాగేవే!

మూడు తప్పుడు ఆదాయాలకూ, అంటే, శ్రమ దోపిడీకి, పరిష్కారం ఏమిటి?

ఏ సమస్య అయినా, ఎందుకు వుందో తెలిస్తే, పరిష్కారం ఆ సమస్యలోనే వుంటుందని కూడా తెలుస్తుంది! పరిష్కారాన్ని సాధించవలిసింది ఎవరు? శ్రమ దోపిడీకి గురి అయ్యేవారే! అంటే, శారీరక శ్రమల, మేధా శ్రమల శ్రామికులే కదా? వీరు, శ్రమ దోపిడీకి పరిష్కారం చూడాలి!

(1) 'కౌలు' సమస్యకి పరిష్కారం : 'భూమి' మానవుల శ్రమలతో ఏర్పడినది కాదు! కాబట్టి భూమి మీద వ్యక్తులకు 'ఆస్తి హక్కు' వుండకూడదు. భూమి అంతా, సమాజానిదే! అంటే, మానవులందరిదీ! ప్రతీ ఒక్కరికీ, వ్యక్తిగా గానీ, కుటుంబంగా గానీ, మరణం వరకూ నివశించడానికీ; మరణం తర్వాత కూడా దహనానికి గానీ, ఖననానికి గానీ; లభించేదిగా భూమి వుండాలి! భూమి మీద, వ్యక్తికి 'ఆస్తి హక్కు'ని తీసివెయ్యాలి! చట్టాలలోనే కాదు, సమాజపు సంస్కృతిలో మొదటి నించీ!

(2) 'వడ్డీ'కి పరిష్కారం కోసం ఆలోచించాలా! ఆ మాటనీ, ఆ సంపాదనా హక్కునీ, రద్దు చెయ్యడమే! వ్యక్తులకి అయినా, సంస్థలకి అయినా!

(3) 'లాభం'కి పరిష్కారం?: లాభానికి పరిష్కారం జీతానికి పరిష్కారమే! 'అదనపు విలువ'కి పరిష్కారమే! 'లాభమే లేకపోతే,'లాభంతో బతికేవారు ఎలా జీవించాలి?-అంటారా ఎవరైనా? వారికి సమాజ సంబంధాలు తెలియకపోతే, అంటారు మరి! 'లాభం' అనే ఆదాయం లేకుండా జీవించే శ్రామికులు ఎలా జీవిస్తున్నారు? ఎవరి స్వంత శ్రమలతో వారు జీవిస్తున్నారు కదా? ఇదే పరిష్కారం! పనివాళ్ళూ, యజమానులూ-అనే మాటలే భాషనించి పోవాలి! ఆ మాటలు, ఎందుకు పుట్టాయో, ఆ కారణాలు పోతే, ఆ మాటలూ పోతాయి! ఆ సంస్కృతే పోతుంది. మానవులందరూ తోటి మానవులు!

ఈ పరిష్కారమే జరగకపోతే, మానవ సమాజం అనేది, శ్రమ దోపిడీదారుల సమాజంగానే, సాగుతూ వుంటుంది. ఆ పరిష్కారాలే ప్రారంభమై, క్రమంగా జరిగితే, అది స్వచ్ఛమైన, నిర్మలమైన, నిజాయితీతో నిండి వున్న నిజమైన మానవులందరి సమాజం అవుతుంది! ఈ నాటి పెట్టుబడిదారీ సమాజం, మానవులందరిదీ కాదు, అవదు!

(ఈ వ్యాసం ముగిసింది)

- రంగనాయకమ్మ

ప్రయివేటు బడి.. అంతేనండి..!

- గుర్తింపు లేకుండా గుట్టుగా నిర్వహణ
- ఓ వైపు నిర్మాణాలు, మరోవైపు అడ్మిషన్లు
- కనిపించని కనీస భద్రతా ప్రమాణాలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

అనుమతిలేని పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఫీజులు, అడ్మిషన్లు అంటూ హడలెత్తిస్తున్నాయి. ఆరంభంలోనే అడ్డుకట్ట పడకపోవడంతో ప్రయివేటు, కార్పొరేటు స్కూల్స్ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని ఏరియాల్లో ఇరుకు వీధులు, చిన్న చిన్న భవనాల్లో బోర్డులు పెట్టి స్కూల్స్ నడిపిస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అనుమతులు రాకముందే అడ్మిషన్లకు తెర లేపారు.

పలు ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కనీస రక్షణ, అనుమతి లేని భవనాల్లో గుట్టుగా తరగతులు నిర్వహించడానికి రెడీ అవుతున్నాయి. ఆయా విద్యా సంస్థలు కనీస గుర్తింపు పొందకుండా రహస్యంగా అడ్మిషన్లు స్వీకరిస్తున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఈసీఐఎల్, ఘట్‌కేసర్, అల్వాల్, మేడ్చల్ మండలాల్లో ఈ తరహా విద్యా సంస్థలు ఎక్కువగా వెలుస్తున్నాయి. ఒకే క్యాంపస్‌లో ఒక బ్లాక్‌కు గుర్తింపు పొంది.. అదే ప్రాంగణంలో అనధికారికంగా మరికొన్ని బ్లాకులు నిర్వహిస్తున్నారు. ఒక బ్రాంచీకి అనుమతి తీసుకుని అదే బ్రాంచీ పేరుతో చిన్న సైన్ బోర్డు ఏర్పాటు చేసి మరికొన్ని స్కూల్స్‌ను నడిపిస్తున్నారు. ఓపెన్ పర్మిషన్ తీసుకుని సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు చేస్తున్నారు. సీబీఎస్ఈ గుర్తింపు రాకముందే ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫ్రాంచైజీ పేరుతో ఒక్క పర్మిషన్ తీసుకుని నాలుగు స్కూల్స్ నడిపిస్తున్నారు. ఇలాంటి స్కూల్స్‌లో కొన్నింటికి జీహెచ్ఎంసీ, ఫైర్ సేఫ్టీ విభాగాల నుంచి ఎన్ఓసీ పత్రాలు కూడా జారీ కాలేదు. ఇలాంటి విద్యా సంస్థలపై విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేస్తే.. షోకాజు నోటీసులు, హెచ్చరికలతోనే సరిపెడుతున్నారు తప్పితే కఠిన చర్యలు తీసుకోవడం లేదు.

ఐదంతస్తుల భవనాలు.. అడ్డగోలు అనుమతులు..

'ఎస్టాబ్లిష్‌మెంట్, రికగ్నిజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూలు అండర్ ప్రయివేటు మేనేజ్‌మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993' ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఏరియాల్లో ప్రధాన రోడ్డులో పార్కింగ్ సదుపాయం లేని భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి లభించింది అనేది అంతుచిక్కడం లేదు. ఇక పలు నివాస భవనాల్లో కొత్తగా పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇక ఆయా స్కూళ్లలో కనీస పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తమ సైకిళ్లను రోడ్డుపైనే పార్క్ చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా కాలనీల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆటస్థలాలు లేకపోవడంతో శరీరానికి వ్యాయామం లేకుండా పోతోంది. శారీరక, మానసిక వికాసం లేక మెజార్టీ పిల్లలు ఊబకాయం బారినపడుతున్నారు. సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకైనా కన్పించడం లేదు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఇక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. ఇవి పరోక్షంగా పిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

7వరకు అనుమతి.. పది వరకు బోధన..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ 2వేలకు పైగానే ఉన్నాయి. అనధికారికంగా మరో 20 స్కూళ్ల వరకు ఉన్నట్టు అంచనా. ఈ ప్రయివేటు స్కూళ్లలో లక్షల్లో విద్యార్థులు చదువుతున్నారు. మెజార్టీ పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిర్మాణ అనుమతులే కాదు, అగ్నిమాపక వ్యవస్థ కూడా లేదు. కూకట్‌పల్లి, ఉప్పల్, కాప్రా, బాచుపల్లి మండలాల్లో ఈ తరహా భవనాలు ఎక్కువగా ఉన్నాయి. జీహెచ్ఎంసీ అనుమతుల్లేని ఈ భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఇదిలా ఉంటే కొన్ని యాజమాన్యాలు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అనుమతి తీసుకుని.. పదో తరగతి వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాయి. తీరా వార్షిక పరీక్షల సమయంలో మరో స్కూలు పేరుతో హాల్ టికెట్లు జారీ చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయం తెలిసిన తల్లితండ్రులు యాజమాన్యంతో విభేదిస్తే, పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తారేమో అనే భయంతో నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

ఐదంతస్తుల భవనాలు.. అడ్డగోలు అనుమతులు..

'ఎస్టాబ్లిష్‌మెంట్, రికగ్నిజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూలు అండర్ ప్రయివేటు మేనేజ్‌మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993' ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఏరియాల్లో ప్రధాన రోడ్డులో పార్కింగ్ సదుపాయం లేని భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి లభించింది అనేది అంతుచిక్కడం లేదు. ఇక పలు నివాస భవనాల్లో కొత్తగా పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇక ఆయా స్కూళ్లలో కనీస పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తమ సైకిళ్లను రోడ్డుపైనే పార్క్ చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా కాలనీల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆటస్థలాలు లేకపోవడంతో శరీరానికి వ్యాయామం లేకుండా పోతోంది. శారీరక, మానసిక వికాసం లేక మెజార్టీ పిల్లలు ఊబకాయం బారినపడుతున్నారు. సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకైనా కన్పించడం లేదు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఇక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. ఇవి పరోక్షంగా పిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

వెంటనే చర్యలు తీసుకోవాలి

రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

గుర్తింపు లేకుండా కొనసాగుతుండటం, అనుమతుల్లేకుండా అడ్మిషన్లు తీసుకోవడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న స్కూల్స్‌పై జిల్లా విద్యాశాఖ వెంటనే చర్యలు తీసుకోవాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. ఓపెన్ పర్మిషన్ తీసుకుని సీబీఎస్ఈ పేరుతో చెలామణి అవుతూ, గుర్తింపు రాకముందే ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్స్‌పై దృష్టి పెట్టి, చర్యలు తీసుకోవాలి. బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టులను బయటి కంటే మూడు రెట్లు అధిక రేటుకు విక్రయిస్తున్నారు. ఒక్క బ్రాంచీకి పర్మిషన్ తీసుకుని నాలుగు బ్రాంచీలు కొనసాగించడం సరికాదు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రావస్థ నుంచి మేల్కొని ప్రయివేటు, కార్పొరేటు స్కూల్స్‌ను నియంత్రించాలి.



రెండు లక్షల ఉద్యోగాల దిశగా చర్యలు

- పట్టభద్రులను నడిరోడ్డు మీద వదిలేసిన పల్లా : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి.. తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టభద్రులను నడిరోడ్డు మీద వదిలేశారని తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపును కోరుతూ.. ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే పద్మావతి నివాసంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తాం.. 400 సీట్లు ఇవ్వండి అంటూ ప్రచారం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మరో పార్టీ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక అంటూ ప్రచారం చేస్తున్నారని, అసలు ఎమ్మెల్సీ ఎన్నికలు రావడానికి కారణం వారు కదా అని ప్రశ్నించారు. ఆరేండ్ల పాటు పట్టభద్రులకు అండగా ఉండాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే మూడేండ్లలోనే రాజీనామా చేసి పట్టభద్రులను నడిరోడ్డు మీద వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడు ఉమ్మడి జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, బలమైన క్యాడర్ కాంగ్రెస్‌కు ఉందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ కార్యకర్తలు నిర్లక్ష్యం వహించకుండా పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేయాలన్నారు. ఇండియా కూటమిలో భాగంగా సీపీఐ(ఎం), సీపీఐ మద్దతు ఇస్తున్నందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మావతి, సామేలు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే ధిక్కారస్వరాలను ఎన్నుకోవాలి

- నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల బీఆర్ఎస్ అభ్యర్థి.. ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించండి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ-భువనగిరి అర్బన్

విద్యారంగ సమస్యలపై అనుభవం కలిగిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాల్‌లో రాకేశ్‌రెడ్డి గెలుపుకోసం భువనగిరి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మాజీ భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతున్న ఈ ఉప ఎన్నికలో.. పట్టభద్రుల అభ్యర్థిని గెలిపించేందుకు మండలాలు, వార్డుల వారీగా బాధ్యత తీసుకొని ముందుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 నియోజకవర్గాల నుంచి 4.73 లక్షల పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోరాటకేంద్రాలు, చైతన్యవంతమైన ప్రజలు నివసిస్తున్న ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో గతంలో నాలుగుసార్లు గులాబీ జెండా ఎగరేశారని గుర్తుచేశారు. 10 ఏండ్ల బీజేపీ పరిపాలనలో ప్రజల అభివృద్ధి వెనకబడిందని చెప్పారు. బీజేపీ ప్రతిపక్షాలు మాట్లాడకుండా వారిపైన దాడులు చేయించడం, కేసులు పెట్టించడం మాత్రమే చేసిందని విమర్శించారు. రైతు ఆదాయం డబుల్ చేస్తామని చెప్పి ఆదాయం పెంచకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. బీజేపీ గుడులను కట్టి ఓట్లు వేయాలంటున్నారని తెలిపారు. ఒకపక్క యాదాద్రి దేవాలయం నిర్మించి మరొకపక్క రిజర్వాయర్లు, ప్రాజెక్టులను నిర్మాణం చేసి కేసీఆర్ ఆధునిక దేవాలయాలను నిర్మించారన్నారు. ఆనాడు భువనగిరి పరిస్థితులను అంచనా వేసుకోవాలని ప్రస్తుతం ఉన్న భువనగిరిని గమనించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నల్లగొండ ధాన్యగార కేంద్రంగా రూపు దిద్దుకున్నదని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోవడానికి చిన్నచిన్న కారణాలే ఉన్నాయని, చేసిన పనిని ప్రచారం చేసుకోలేదదని, కొన్ని వర్గాలను దూరం చేసుకోవడంతో తమ వైపు నుంచి తప్పిదాలు ఉన్నాయని స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలుచేస్తుందని ప్రశ్నించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పరిపాలన కొనసాగిస్తుందో ప్రజలు చూస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు తుంగబాలు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై చర్యలకు ఈసీ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలింగ్ రోజు నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఈసీ చర్యలకు ఆదేశించింది. మేరకు రాష్ట్ర అదనపు ఎన్నికల ముఖ్య అధికారి లోకేష్ కుమార్ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల రోజున కేటీఆర్ మాట్లాడుతూ ఏ వ్యక్తికి ఓటేశారనే విషయాన్ని పరోక్షంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు నిరంజన్ ఫిర్యాదుతో కదిలిన ఈసీ చర్యలకు ఉపక్రమించింది.

పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామం

- హరిత నిర్మాణం ఓ విధానంగా మారాలి
- సగటు మనిషి కొనేలా నివాసాలు
- రీజినల్ రింగ్‌రోడ్ నిర్మాణంతో తెలంగాణ పట్టణ రాష్ట్రంగా మారుతుంది
- గ్రీన్ ప్రాపర్టీ షో ముగింపు సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరం ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు స్వర్గధామమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణాలనేవి పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్నారు. హరిత నిర్మాణాలు ఓ జీవన విధానంగా మారాలని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ ప్రాపర్టీ షో ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చని వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. 50 శాతం నీరు, 40 శాతం విద్యుత్తు ఆదా చేసే రీతిలో నిర్మించే హరిత భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలుంటాయనీ, సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు. సగటు మానవుడు కొనుగోలు చేసేలా గ్రీన్ భవనాల నిర్మాణాలుండాలని బిల్డర్లను ఆయన కోరారు. ఇక్కడి వాతావరణం, నీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, కావాల్సినంత భూమి, శాంతి భద్రతలు, ఫ్రెండ్లీ గవర్నమెంట్ అన్ని అందుబాటులో ఉన్నాయని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే తెలంగాణ పట్టణ రాష్ట్రంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుదీకరణ, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడానికి వీలుగా పటిష్టమైన మౌలిక సదుపాయాలను నిర్మించడంపై దృష్టి పెడుతున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రీన్, నెట్ జీరో కాన్సెప్ట్‌లను సులభతరం చేయడంలో తమకు సహకరించాలని కోరారు. రాబోయే కొద్ది రోజుల్లో 50 శాతం పట్టణ ప్రాంతాల్లో జనాభా నమోదు కానుందని చెప్పారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా నిలబెట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రెప్పపాటు సమయం కూడా కరెంటు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా అందిస్తున్నామని వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సమగ్ర ఇంధన పాలసీని తీసుకురాబోతున్నామని వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా కొత్తగూడెంలో రూ.56 కోట్లతో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా ప్రపంచ ప్రమాణాలతో రివర్స్ అండ్ ప్రయివేటుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరం నలుమూలల మెట్రో రైలును విస్తరించే ఆలోచనలో ఉన్నామని అన్నారు. తమది బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమనీ, ఈ రంగంలోనైనా పెట్టుబడులను సాదరంగా ఆహ్వానిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములే గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌ను అందరం కలిసి ముందుకు తీసుకెళ్దామని కోరారు.

కన్న కూతురు భారమై.. కడతేర్చిన తల్లిదండ్రులు

- కూతురి మానసిక స్థితి బాగా లేదని హత్య
- తల్లిదండ్రులను జైలుకు తరలించిన పోలీసులు : వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ - సిరిసిల్ల

కూతురి మానసిక పరిస్థితి బాగాలేదని, ఆమె వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తల్లిదండ్రులే ఆమెను హత్యచేశారు. మానసిక స్థితి బాలేని ఆ కూతురికి సరైన వైద్యం చేయించక మూఢనమ్మకాలను నమ్మి కూతురి రోగం మరింత పెరిగి తల్లిదండ్రుల చేతిలో బలయిన ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ఆదివారం జరిగింది. జిల్లాలోనే సంచలనం సృష్టించిన ఈ ఘటనలో తల్లిదండ్రులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. నేరెళ్ల గ్రామంలో చెప్యాల నరసయ్య, చెప్యాల ఎల్లవ్వ దంపతుల కూతురు ప్రియాంక ఈనెల 14న మరణించింది. ఆమె మరణంపై గ్రామస్తులకు అనుమానం రాగా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజుకు ఈ విషయాన్ని వివరించారు. వెంటనే ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, అనుమానంతో తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో తమ కూతురు ప్రియాంకను తామే చంపామని తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

నేరెళ్ల గ్రామానికి చెందిన నరసయ్య - ఎల్లవ్వల పెద్ద కుమార్తె ప్రియాంక ఏడేండ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుండగా ఆమెను ఆస్పత్రుల చుట్టూ తిప్పడంతోపాటు మూఢవిశ్వాసాలను నమ్మి పలువురి దగ్గరకు తీసుకువెళ్లి దంపతులు అప్పుల పాలయ్యారు. కొంతవరకు వ్యాధి నయం కావడంతో 2020లో పృథ్వి అనే వ్యక్తితో ఆమెకు వివాహం జరిపించారు. ఆమెకు 13నెలల కుమారుడు ఉన్నారు. కాగా, నెల రోజుల నుంచి ఆమె మానసిక వ్యాధి గతంలో లాగే మళ్లీ రావడంతో తల్లిదండ్రులు వెళ్లి ఆమెను నేరెళ్లకు తీసుకుని వచ్చారు. జిల్లాలోని ఓ దేవాలయానికి తీసుకెళ్లి మూడు రోజులు ఉంచినప్పటికీ ఏమాత్రం నయం కాకపోవడంతో ఇంటికి తీసుకువచ్చారు. ఆమె ఇంటికి వచ్చిందని తెలిసిన బంధువులు వచ్చి చూసి వెళ్లారు.

ప్రియాంక అత్తింటి వారు తమ కుటుంబసభ్యులు, గ్రామస్తులను ఇష్టం వచ్చినట్టు దూషించడం, తమ కుమారుడిపై కూడా దాడి చేస్తుండటంతో పాటు అప్పులూ పెరిగిపోవడం ఆమె తల్లిదండ్రులు అన్నింటితో విసిగిపోయారు. దాంతో తమ కుమార్తె భారాన్ని వదిలించుకోవాలని నిర్ణయించుకొని.. ఈనెల 14న రాత్రి.. ప్రియాంక నిద్రిస్తున్న సమయంలో తాడుతో ఉరివేసి హత్య చేశారు.

ప్రియాంక మానసిక స్థితి బాగోలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు నమ్మించే ప్రయత్నం చేశారు. స్థానికులకు అనుమానం రావడంతో పంచాయతీ కార్యదర్శికి చెప్పగా ఆయన అక్కడికి చేరుకొని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ప్రియాంక తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. మృతురాలి తల్లిదండ్రులు నరసయ్య, ఎల్లవ్వను అరెస్టు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు. సమావేశంలో ఇంచార్జ్ సీఐ శ్రీనివాస్ ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుకు పోరాడతాం

యువమోర్చా సమావేశంల బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో యువమోర్చా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రంలో డబుల్ డిజిట్ వస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన ఓటర్లు కూడా తమ పార్టీకే ఓటు వేశారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామన్న విషయం మరిచిపోయారని అన్నారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి హామీలను అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగులకు రూ.నాలుగు వేల భృతి ఇవ్వడం లేదని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీ కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోవడానికి పదేండ్లు పట్టిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం పోవడానికి ఐదేండ్లు కూడా పట్టేలా లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేవైఎం నేతలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయడానికి యువత సిద్ధంగా ఉండాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉందని తెలిసి కూడా

రుణమాఫీపై బీఆర్ఎస్ రాద్ధాంతం

- చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందనీ తెలిసి కూడా రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రునూరైనా ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ చేసి తీరుతామనీ, అప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అంటేనే రైతుల పక్షపాతి అని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేక పార్టీలని విమర్శించారు. ప్రశ్నించే గొంతులపై కత్తులు పెట్టి పదేండ్లు పాలించిన కేటీఆర్‌కు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. మేడిగడ్డ అవినీతిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ప్రమేయముందని ఆరోపించారు. త్వరలో రైతు రాజ్యానికి పునాది పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కోస్గిలో ఇంజినీరింగ్ కాలేజీకి

ఏఐసీటీఈ అనుమతి

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని నెలకొల్పేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. దీంతో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు చేపట్టేందుకు అవకాశం లభించింది. కోస్గిలో పాలిటెక్నిక్ కాలేజీని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీగా మార్చేందుకు ఆదివారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి ఏఐసీటీఈ సభ్య కార్యదర్శి రాజీవ్ కుమార్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రూవల్ (ఈవోఏ)ను జారీ చేశారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డాటా సైన్స్) కోర్సుల్లో ఒక్కో 60 చొప్పున 360 సీట్లకు అనుమతి ఇస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఆయా సీట్లలో ప్రవేశాలు కల్పించొచ్చని సూచించారు.

నవతెలంగాణ
నవ్య తెలుగు దినపత్రిక
హైదరాబాద్
7
సోమవారం | మే 20, 2024 | www.navatelangana.com

ఘనంగా సుందరయ్య వర్ధంతి



నవతెలంగాణ-మెహిదీపట్నం

సీపీఐ (ఎం) పార్టీ నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39 వర్ధంతిని భోజగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) పార్టీ నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేష్ వెల్కమ్ సభ్యులు బి.శంకర్ ఎం.యాదయ్య సిహెచ్.వెంకట్ స్వామి పార్టీ నాయకులు శ్రీనివాస్, కృష్ణా, రాములు, జంగయ్య, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపు'



నవతెలంగాణ-బంజారాహిల్స్

అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారి ప్రతిభకు గుర్తింపుగా బీఎన్ఐ గెలాక్సీ 'బెస్ట్ చాప్టర్ అవార్డు లభించడం అనేది గొప్ప అనుభూతని రేసు గుర్రం, సలార్ ఫేమ్ నటి క్రాంతి బలివాడ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ లోని పార్క్ హయత్‌లో హైదరాబాద్ రీజియన్‌లో ప్రామిసింగ్ చాప్టర్ బీఎన్ఐ గెలాక్సీ వేడుకలకూ హాజరైన ఆమె బీఎన్ఐ గెలాక్సీ అధ్యక్షుడు డాక్టర్ జీ.సతీష్ కుమార్‌కు ఈ అవార్డును అందజేసి మాట్లాడారు. బీఎన్ఐ వేడుకలలో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బీఎన్ఐ గెలాక్సీ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందనీ మరిన్ని విజయాల కోసం కృషి చేయడానికి స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందులో యాభై మంది వ్యాపారులు నెట్‌వర్కింగ్ కార్యక్రమాల ద్వారా తమ వ్యాపారాలకు చేసుకొనే వారు, బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా,తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు తమ లక్ష్యాలను సాధించుకోవాలి

- ఏసీవిత్‌ఎస్ ఐఎఎస్ శిక్షణ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ శివతేజ



నవతెలంగాణ-ముషీరాబాద్

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు శిక్షణపై సంపూర్ణ విశ్వాసం కలిగినప్పుడే అభ్యర్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఏసీవిత్‌ఎస్ ఐఎఎస్ శిక్షణ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ శివతేజ తెలిపారు. ఐపిఎస్, ఐఎఎస్‌లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏసీఈ విత్ ఎస్ ఐఎఎస్ ఆఫ్లైన్ లాంచ్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివతేజ మాట్లాడుతూ గతంలో హైదరా బాద్ ఐపిఎస్, ఐఎఎస్ శిక్షణ కేంద్రానికి హబ్బుగా ఉండేదని అనేక మార్పుల నేపథ్యంలో పోటీ పరీక్ష కోసం గాను దేశ రాజధానికి వెళ్లి అనేక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. పోటీ పరీక్షకు సిద్ధమే అభ్యర్థుల అవసరాలను గుర్తించి హైదరాబాద్‌లోనే అన్ని వర్గాల విద్యార్థిని, విద్యార్థులకు సివిల్స్‌లో అనేక రకాలుగా మెలకువలను నేర్పుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక స్తోమత లేని అభ్యర్థులకు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ లో గత మూడు సంవత్సరాలుగా జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన 9 మంది ఐపీఎస్, ముగ్గురు ఐఏఎస్ అభ్యర్థులను ఒకే వేదికపైకి ఏసీఈ సంస్థ తీసుకువచ్చిందన్నారు. ఆ యా అభ్యర్థులు సాధించిన విజయాలను అనుసరించిన వ్యూహాలను మెలకువలను పోటీ పరీక్ష సిద్ధమవుతున్న అభ్యర్థులకు కూలంకుశంగా వివరించారు.

మూఢనమ్మకాలతో మానసిక బానిసత్వం

- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

సమాజంలో మూఢ నమ్మకాలు ఎంత ఎక్కువగా ఉంటే ఆ సమాజం అంతగా మానసిక బానిసత్వంలో మగ్గుతుందని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నగర విద్యా వైజ్ఞానిక తరగతులో 'మూఢ నమ్మకాలు - సైన్స్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ సైన్స్ వల్లనే అభివృద్ధికర మానవ పురోగతి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు మూఢనమ్మకాలను విడనాడి మానసిక బానిసత్వం నుండి విముక్తి కావాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం. హన్మేష్ 'పరిణామక్రమం' పై మాట్లాడుతూ జీవపరిణామక్రమంలో మనిషి ఈ దశకు చేరుకోవడానికి కొన్ని కోట్ల సం.లు పట్టిందని, కొందరు తమ నిరాఘాట దోపిడీ కోసం కులం, మతం పేరిట వైషమ్యాలు సృష్టిస్తున్నారన్నారు. పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్ మాట్లాడుతూ యువకులు ఎప్పటికప్పుడు ప్రతీ విషయాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించాలని, తద్వారా సామాజిక అసమానతల కారణాలను ప్రశ్నిస్తూ ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జెండాను అధ్యక్షులు ఎం. రవి కుమార్ ఆవిష్కరించారు. పీడీఎస్‌యు యూని వర్సిటీల జాతీయ కోఆర్డినేటర్ ఎస్. నాగేశ్వర రావు, పీవైఎల్ గ్రేటర్ హైదరా బాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవికుమార్, బి.ఎస్ కృష్ణ, ఉపాధ్యక్షులు కిరణ్, మల్లేష్, సహాయ కార్యదర్శులు బంగారి శ్రీనివాస్, యల్లప్ప, కోశాధికారి కొల్లూరి భీమేష్, సభ్యులు బాలు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను ప్రోత్సహిస్తాం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్యార్థులను ప్రోత్సహిస్తామని భారతరత్న కర్పూరి ఠాకూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కన్వీనర్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం భారతరత్న కర్పూరి ఠాకూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ టెక్డి లోని బీసీ సాధికారత భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అసోసియేషన్ తీసుకునే నిర్ణయాలపై చర్చించామన్నారు. విద్యార్థులను చదువులలో ప్రోత్సహించడం, నాయి బ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిని త్వరలోనే కలిసి కోరుతామన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జ్, లోహియా విచార్ మంచ్ అధ్యక్షులు టి గోపాల్ సింగ్ చేతులమీదుగా ఇటీవలే పదవి విరమణ పొందిన సుధాకర్ దంపతులను ప్రమోషన్ పొందిన ఏసీపీ సురేష్, వినోద్ కుమార్ విద్యార్థులు సహితలను మెమెంటో అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత ప్రభాకర్, అసోసియేషన్ ప్రతినిధులు మురళీమోహన్, లక్ష్మణ్ రావు, భవాని శంకర్, లక్ష్మీ నారాయణ, వినోద్, జానయ్య సంతోష్, సురేష్, నరహరి, దేవరకొండ నాగ రాజు, వరంగల్ ఎఈ శ్రీనివాస్, ఘట్కేసర్ వనజ, వెంకటేష్, సిద్దిపేట్ కనకయ్య, శ్రీధర్ మురహరి, పెద్ద ఎత్తున ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

బల్కంపేట ఎల్లమ్మను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్కిరెడ్డి ముకుంద రెడ్డి దంపతులు, ముషీరాబాద్ మీడియా ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, సాయి యాదవ్, సాయి చాణిక్య రెడ్డి ఎమ్మెల్యేలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న ప్రవేశాలు

- ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 318 కళాశాలు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ కాలేజీల్లో 70వేలకుపైగా సీట్లు
- మొదటి విడుత అడ్మిషన్లకు వచ్చేనెల చివరి వరకు గడువు
- జూన్ 1 నుంచి క్లాసులు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభమైన మొదటి విడుత అడ్మిషన్ల ప్రక్రియ వచ్చే నెల చివరి వరకు కొనసాగనుంది. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, ట్రైబల్, బీసీ రెసిడెన్షియల్, మైనార్టీ, రైల్వే కళాశాలల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. జిల్లాలో పదో తరగతి పాసైన విద్యార్థులకు అవగాహన కల్పించి.. ఈ ఏడాది ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఇప్పటికే సర్కారు కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దిశానిర్దేశం చేశారు. దీంతో అధ్యాపకులు తమ పరిధిలో ప్రచారంతో పాటు ప్రభుత్వ కాలేజీల్లో కోర్సులు, మౌలిక వసతులు తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 22 ప్రభుత్వ కళాశాలలు, 14 ఎయిడెడ్, ఒకటి ట్రైబల్, నాలుగు బీసీ రెసిడెన్షియల్, 26 మైనార్టీ, ఒక రైల్వే కళాశాలతో పాటు 250 ప్రయివేటు కాలేజీలున్నాయి. వీటిలో ఆయా గ్రూపుల్లో కలిపి 75 వేలకు పైగా సీట్లు ఉన్నాయి. ఇటీవల విడుదలైన పదీ పరీక్షల్లో హైదరాబాద్ జిల్లాలో 63వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇక్కడి కళాశాలల్లో చదవనున్నారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో సుమారు 7-8వేల సీట్లు ఉండగా.. విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అంతేగాక ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందిన ఈ విద్యార్థులతో పాటు సెకండియర్ స్టూడెంట్స్‌కు జూన్ 1 నుంచి క్లాసులు ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.

నేరుగా లేదా ఆన్‌లైన్‌లో అడ్మిషన్..

గవర్నమెంట్ కాలేజీల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు నేరుగా కాలేజీలకు వెళ్లి తమ పదో తరగతి పాస్ ఆన్‌లైన్ మెమో, ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా అప్లికేషన్ సమర్పించాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోని ప్రవేశం పొందవచ్చు.

ప్రభుత్వ కాలేజీల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం



దాసరి ఒడ్డెన్న, డీఐఈవో, హైదరాబాద్

ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు ఆన్‌లైన్‌తో పాటు నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడుత అడ్మిషన్లు వచ్చే నెల 30 వరకు కొనసాగుతాయి. జిల్లాలోని విద్యార్థులు ఇంటర్ బోర్డు అనుమతి, గుర్తింపు పొందిన కళాశాల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలి. ప్రభుత్వ కాలేజీల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. సిబ్బంది కొరత లేదు. పుస్తకాలతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

డయాబెటిస్ ప్రజల్లో చాలా వరకు విస్తరిస్తుంది

- ఆరోగ్య నియమాలు, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం
- ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రస్తుత సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా డయాబెటిస్ వ్యాధి ప్రజల్లో చాలా వరకు విస్తరిస్తుందని దానిని కట్టడి చేయాలంటే ఆరోగ్య నియమాలు వ్యాయామం తప్పనిసరి అని సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందర య్య విజ్ఞాన కేంద్రంలో లయన్స్ క్లబ్, సాధురామ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఆప్తమాలజీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్, రిటైర్డ్ సరోజినీ దేవి కంటి ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ కులశేఖర్, ఫ్యామిలీ ఫిజీషి యన్ డాక్టర్ శ్రావణి దాదాపు 80 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో డయాబెటిస్ చక్కెర వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తుందన్నారు.

డయాబెటిస్, బీపీ, ప్రమాదకరమైన వ్యాధులని వాటిని కట్టడి చేయకపోతే బాధితుల్లో తీవ్ర పరిణామాలను చూపుతాయన్నారు. ఈ వ్యాధులను అరికట్టాలంటే ఆహారపు నియమాలను కఠినంగా పాటించాలని వాటితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు మెడికల్ చెకప్‌లు చేయిస్తూ వాటిని తరిమి కొట్టాలన్నారు. ప్రజల్లో జీవనశైలిలో మార్పుకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఎంతగానో ఉపయోగపడుతుందని నూటికి 80% వ్యాధులను ప్రాథమిక పద్ధతి ద్వారానే నయం చేయవచ్చునన్నారు. పాశ్చాత్య దేశాలలో ప్రాథమిక వైద్యం బలపడుతుందని మనదేశంలో ప్రాథమిక వైద్యాన్ని బలపరిచి ప్రజల ఆరోగ్య పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బీపీని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చు అన్నారు.

సమాప్త కార్మిక వర్గం బీజేపీ ప్రభుత్వ విధానాలపై గళం విప్పాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్మిక వర్గం బీజేపీ ప్రభుత్వ విధానాలపై గళం విప్పాలని, కార్మికుల సమస్యలపై పోరాటం చేసే సత్తా సీఐటీయూకే ఉందని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, కోశాధికారి వంగూర్ రాములు అన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు రెండోవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని వారు ప్రసంగించారు. కార్మికుల గురించి పోరాటం చేసే సత్తా, ఒక సీఐటీయూ మాత్రమే ఉందన్నారు. ఇతర సంఘాలు తమ స్వార్థం కోసం పెట్టుకొని పెట్టు బడిదారులకు, బీజేపీ ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నారన్నారు. సమాప్త కార్మిక వర్గం బీజేపీ ప్రభుత్వ విధానాల పై గళం విప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.శ్రవణ్‌కుమార్, మీన, కిషన్, కోటయ్య, నాగేశ్వరరావు, జంగయ్య, రాం కుమార్, కృష్ణ, బాబా, కూర్మయ్య, సమీమ్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

భారత సమాజానికి ఆదర్శ ప్రాయుడు సుందరయ్య

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్



నవతెలంగాణ-ధూల్‌పేట్

భారత సమాజానికి ఆదర్శప్రాయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతి సభ ఐఎస్ సదన్ క్రాస్ రోడ్ సంతోష్ నగర్ లోని అలంకన్ మేరీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సౌత్ జిల్లా పార్టీ, యూనియన్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పులమాలవేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో కులం, మతం, ప్రాంతం, భాష, స్త్రీ పురుష వంటి అనేక విధాలుగా వివక్షకు గురి చేస్తూ విభజించి పాలించు అనే స్వార్థపూరిత రాజకీయాలకు స్వస్తి చెప్పాలని కోరుకున్న వారిలో అగ్రగన్యుడు సుందరయ్య అని తెలిపారు. సుందరయ్య యుక్త వయసులోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మహనీయుడన్నారు. భూస్వాముల గడిల్లో వెట్టి చాకిరికి పూర్తిగా స్వస్తి చెప్పాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో అగ్రగణ్యుడని తెలిపారు. పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టి తనకున్న వందల ఎకరాల భూమిని పేద రైతులకు పంచిన నిస్వార్థ కమ్యూనిస్టు నేత అని గుర్తు చేశారు. నేడు సనాతన ధర్మం అంటూ కులం, మతం, భాష, ప్రాంత, లింగ వివక్ష లను ముందుకు తెస్తూ విభజించి పాలించు అనే పద్ధతిని అవలంభిస్తున్న పాలకులకు ప్రజలంతా ఏకమై తగిన బుద్ధి చెప్పడమే సుందరయ్యకు నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. విఠల్, పి.నాగేశ్వర్, ఎల్.కోటయ్య, ఎం.మీన, అబ్దుల్ సత్తార్, ఎం శ్రావణ, జి కిషన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి'

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం వరకు పెంచాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో 'బీసీ రిజర్వేషన్లు' అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సమ గ్ర కులగణన, అలాగే బీసీ సమగ్ర సర్వే నిర్వహించిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాహుల్ గాంధీ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే తాము ఎంతవరకైనా తెగిస్తామని గ్రామ, గ్రామాన బీసీ రిజర్వేషన్లపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఆందోళన లు, ధర్నా కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున గ్రామ, గ్రామనా ఆందోళనలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో 40 బీసీ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు సి.రాజేందర్, పర్వతా లు, అనంతయ్య, కృష్ణమూర్తి, శ్రీనివాస్, శారద, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పీర్జాదిగూడ' మేయర్, కార్పొరేటర్లపై దాడికి ప్రయత్నం..!



నవతెలంగాణ-బోడుప్పల్:

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాసం నెగ్గిందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమపై దాడి చేసేందుకు దీనిని ప్రయత్నం చేశారని పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారు రవీందర్, మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు ఆరోపించారు. ఈ మేరకు వారు మీడియాతో మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం సమయంలో వర్గానికి చెందిన కార్పొరేటర్లతో కలిసి ఔటర్ రింగ్ రోడ్డుపై వస్తుండగా కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు తమ వాహనాలను వెంబడించి, దాడి చేసేందుకు ప్రయ త్నం చేశారని కార్లలాకులు ఓపెన్ కాకపోవడంతో బయ టకు లాగే ప్రయత్నం విఫలం అయ్యిందని వాపోయారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నారని పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని వాపోయారు.

ప్రాణహాని ఉంది..

కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్‌లో చేరిన ఇతర కార్పొరేటర్లతో తమకు ప్రాణ హాని ఉందని పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఇప్పటికైన పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితులకు సీఎం న్యాయం చేయాలి

- ఫైనాన్స్ యజమాని సాయిబాబాను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితుల విషయం లో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులతో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితులకు న్యాయం చేయాలని, లేకపోతే ఎమ్మెల్యే, ఎంపీలను గ్రామాల్లో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన 50 గ్రామాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద ప్రజలను ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ కంపెనీ అధిక వడ్డీ పేరుతో బాధితులను నిండా ముంచిందని, దాదాపు రూ.150 కోట్ల వరకు ఉంటుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టం పరిహారం కింద ఇచ్చిన డబ్బులను ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ యజమాని సాయిబాబా అధిక వడ్డీ చెల్లిస్తానని ఆశ చూపి 50 గ్రామాల ప్రజల నుండి దాదాపు రూ.150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. కొన్ని నెలల తర్వాత అవసరాల రీత్యా బాధిత ప్రజలు మా డబ్బులు మాకు ఇవ్వా లని సాయిబాబాని అడగగా ప్రజలను మభ్యపెట్టారని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బాధితులు దబాయించి అడగగా నా దగ్గర డబ్బులు లేవని మీరు ఏం చేసు కుంటారో, చేసుకోండని, బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసులు, రాజకీయ నాయకులకు చెప్పిన పట్టించుకోలేదని ఆయన ధ్వజమెత్తారు. బాధితులకు డబ్బులు చెల్లిం చకపోతే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇండ్ల ఎదుట బాధితులతో కలిసి ధర్నాలు చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. వెంటనే పోలీసులు సాయిబాబాను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో 50 గ్రామాల బాధిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రజక వృత్తిదారుల సదస్సును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జూన్ 2న తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సదస్సును విజయవంతం చేయాలని సంఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ సమావేశం రాష్ట్ర కార్యాలయంలో సిహెచ్. వెంకటస్వామి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి రాజు నరేష్ మాట్లాడుతూ జూన్ 2న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాల్ లో జరిగే జిల్లా సదస్సు కార్యక్రమానికి హైదరాబాద్‌లోని అన్ని జోన్ లో నుంచి రజకులు పెద్ద ఎత్తున హాజరై జిల్లా సదస్సును విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్ మాట్లాడుతూ ప్రతి జిల్లా కమిటీ సభ్యులు బాధ్యతలు తీసుకొని అన్ని డివిజన్లలో రజక సంఘాలను ఏకం చేసి ఈ సదస్సుకు 200 మంది రజకులతో జరపాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు చారకొండ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్క సభ్యుడు చొరవ తీసుకొని హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రచారం చేయాలని జూన్ 2న జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, పి.పద్మ, వీ.యాదమ్మ, పీ.భాస్కర్‌రావు, ఎం.రమేష్, జే.బాబు, వీ. రమేష్, జే.నర్సింగ్ రావు, పి.రాజు, ఆర్. తిరుపతి, బీ.వెంకటేష్,వీ. భరత్, పి.రాజయ్య ,కే. మంగయ్య తదిరులు పాల్గొన్నారు.

జమ్మిగడ్డలో 103వ వారం..జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో ప్రతి ఆదివారం చేపట్టే అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావు, మహాత్మాజ్యోతిరావు పూలే జ్ఞానమాల కార్యక్రమం 103వ వారానికి చేరింది. ఈ సందర్భంగా జ్ఞానమాల టీం సభ్యులు మహనీయులకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కల్పించారని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, ఎస్.ఏ.రహీం, నర్సింహ్మా చారి, నరేందర్ రావు, దయానంద్, రవి నాయక్, మెకానిక్ కొండల్, సాయిలు, సత్తయ్య, స్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పోరాటం



నవతెలంగాణ-సంతోష్‌నగర్

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసే సత్తా సీఐటీయూకు మాత్రమే ఉన్నదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే. వెంకటేష్, కోశాధికారి వంగూర్ రాములు అన్నారు. హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులు రెండోవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్మిక వర్గాల సంక్షేమం కోసం ఎల్లవేళ్లలా పని చేస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు రాజకీయ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



- మహిళ నేతలు నర్మద పరుశురాం, రూప చంద్రమౌళి

నవతెలంగాణ-కీసర

నవభారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన కల్పించిన రాజ్యాంగా ఫలాలను అందరికీ అందేలా చూడటమే ఆయనకిచ్చే ఘన నివాళి అని మాల సంఘం మహిళా నేతలు గుజ్జుక నర్మద పరుశురాం, పాడుగుల రూప చంద్రమౌళి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలి టీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతీ ఆదివారం అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 111వ అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమానికి హాజరై జ్ఞానమాల సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేడు మనం అనుభవిస్తున్న ఫలాలు అన్ని కూడా ఆయన రాసిన రాజ్యాంగం ద్వారా అందించిన ఫలాలేనని అన్నారు. ఆకలి, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం ఆయన అహొరా రాత్రులు పోరాడి మన కోసం హక్కులను సాధించి పెట్టారని అన్నారు. ఆయన ఆశయ సాధనను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకిచ్చే అసలైన నివాళి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా నాయకులు గుజ్జుక పరుశురాం, మాల సంఘం పెద్దలు అబ్బులు, ఆర్జికే కాలనీ సంఘం అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, సలహాదారులు యాటా రాజు, కోశాధికారి చెన్నయ్య, సభ్యులు చంద్రమౌళి , వెంకటేష్, గౌతమ్, తరుణ్, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

అన్ని జీవులలో దైవత్వం దర్శించిన ఆది శంకరాచార్య



- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

నవతెలంగాణ-కల్చరల్

అన్ని జీవులలో ఆత్మ ఉంటుందని, అదే దైవత్వం అని, ఆ అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన తత్వవేత్తనే ఆది శంకరాచార్యులు అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో శ్రీత్యాగరాయ గానసభలోని కళా వెంకట దీక్షితులు కళా వేదికపై జగద్గురు ఆది శంకరా చార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. హిందూమతాన్ని ఉద్ధరించిన త్రిమతా చార్యులలో ప్రథములు ఆది శంకరాచార్యులు అని అన్నారు. సమకాలీన హిందూమతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త అని అన్నారు. ఎనిమిదేండ్ల వయస్సులోనే సన్యాసం స్వీకరించి వేదాలకు భాష్యాలతో పాటు పలు దేవతలపై స్తోత్రాలు అస్టకాలు హైందవ సమాజానికి అందించారని తెలిపారు. ఆయన కాలి నడకన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించి నాలుగు శక్తి పీఠాలు స్థాపించి ప్రజలలో భక్తి భావన పెంచారని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్పీ భారతి, సంగీత గురువు మల్లాది ఉష, గానసభ పాలకవర్గ సభ్యుడు బండి. శ్రీనివాస్ ద్రావిడ తదితరులు పాల్గొన్నారు.

మాదాల వీరభద్రరావు ఆదర్శవంతమైన పాత్రికేయులు



నవతెలంగాణ-కల్చరల్

నమ్మిన సిద్ధాంతాలను రాజీ లేకుండా తన వ్యాసాలతో ప్రజలను జాగృతం చేసిన మాదాల వీరభద్రరావు ఆదర్శవంతమైన పాత్రికేయులు అని త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్దన మూర్తి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా లలిత కళా వేదికపై త్యాగరాయ గానసభ, మాదాల వీరభద్రరావు స్మారక సమితి సాధన సాహితీ స్రవంతి, మానస ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మాదాల వీరభద్రరావు 105వ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళా జనార్ధన మూర్తి శాలువా జ్ఞాపికతో మాదాల వీరభద్రరావు స్మారక పురస్కారం సీనియర్ జర్నలిస్ట్ రాయప్రోలు రమణకు బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీరభద్రరావు స్వాతంత్ర పోరాటంలోనూ ఆంధ్రరాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారనీ, ఆంధ్ర ప్రభ, ఆంధ్ర జనత వంటి నాటి ప్రముఖ పత్రికల్లో కాలమిస్ట్‌గా, వ్యాఖ్యాతగా పని చేసి నిజాయితీ జర్నలిస్ట్ గా గుర్తింపు పొందారని కొనియాడారు. తన తండ్రి మరణించిన తరువాత కూడా అయన పేరిట పురస్కారాలను ప్రతీ సంవత్సరం ఇస్తున్న రాజేంద్ర ప్రసాద్ అభినందనీయులు అన్నారు. తల్లితండ్రిలను విస్మరించిన వారు క్షమ అర్హులు కారన్నారు. పురస్కారం అందుకున్న రమణ తమ తండ్రి సుబ్బా రావు నుంచి గాన సభతో అనుబంధం ఉందని, ఆయన స్థానిక ఇంగ్లీష్ పత్రిక సిటిజన్స్ ఈవెనింగ్‌లో పని చేస్తూ తెలుగు పత్రికలు ప్రజాశక్తి తదుపరి నవతెలంగాణలోనూ నలభై ఏండ్లుగా పత్రిక రంగంలో ఉన్నారన్నారు. వార్తలు రాయటంలో శ్రద్ధ నిజాయితీ అంకిత భావం ఉన్న వారని పేర్కొన్నారు. పురస్కార ప్రదాత మాదాల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. తమ తండ్రి వీరభద్రరావు పేరిట పురస్కారాలు పొత్తూరి వెంకటేశ్వరరావు, ఏ బీ. కె ప్రసాద్ వరదా చారి వంటి వారు అందుకొన్నారనీ తెలిపారు. ఈ ఏడు నిబద్ధత కల రమణకు అందించటం సంతోషంగా ఉందన్నారు. రమణ తమ స్పందన తెలుపుతూ ఎందరో పెద్దలు అందుకొన్న వీరభద్రరావు పురస్కారానికి తనను ఎంచుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మానస ఆర్ట్స్ అధ్యక్షుడు రామ చంద్రరావు అధ్యక్షత వహించారు. శివ శంకర్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీఎన్-2024 మార్గదర్శకాల ప్రకారం ఢిల్లీలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇండియన్ సొసైటీ ఆఫ్ అంకాలజీ క్యాన్సర్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం.

-నవతెలంగాణ-సిటీబ్యూరో

సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయాల్లో

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

- నివాళులర్పించిన సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు



కాప్రాలో..

నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని కమలానగర్‌లోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సభను కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, కృష్ణా జిల్లా సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోమటి రవి మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర పోరాటంలో అతి చిన్న వయసులోనే జైలు జీవితం అనుభవించారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా చిన్నతనంలోనే కుటుంబంతోనూ, సమాజంతో పోరాడారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి సామాన్యులను వీరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పార్లమెంట్, శాసనసభల్లో పలు విషయాలపై ప్రభుత్వాలకు మార్గ నిర్దేశం చేశారని చెప్పారు. అందుకే అధికారంలో ఎవరు ఉన్నా సుందరయ్యను గౌరవించేవారని గుర్తు చేశారు. ప్రజల పట్ల, కార్యకర్తల పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలు చూపించారని, కార్యకర్తలను ప్రోత్సహించి నాయకులు ఎదగడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కృష్ణాజిల్లా సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సుందరయ్య రచనలు నన్ను కమ్యూనిస్టుగా మార్చడంలో ముఖ్య పాత్ర పోషించాయని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు. గొడుగు యాదగిరిరావు, జె. చంద్రశేఖర్, శ్రీమన్నారాయణ, కేకే. ప్రసాద్ బాబు, దేవి రెడ్డి, శారద ప్రసంగించారు. అనంతరం సబికులందరూ సుందరయ్య చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పీబీ.చారి, ఎన్ శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, సిహెచ్. ప్రసాద్, పి.గణేష్, కొండల్ రెడ్డి, కేవీ చారి, గౌసియా, శారద, పోతురాజు, శివన్నారాయణ, రామ్మోహన్‌రావు, రుక్కయ్య, దేవిరెడ్డి, జి.శివరామకృష్ణ, ఆర్.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..


ఉప్పల్‌లో..

సీపీఐ(ఎం) నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ (ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వినోద అన్నారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ(ఎం) ఉప్పల్ పార్టీ కార్యాలయంలో సుందరయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం. వినోద, నాయకులు జే.వెంకన్న, భీష్మాచారి, ఊర్మిళ, ఉపేందర్, వెంకటేష్, పద్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో..

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని మల్కాజిగిరిలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కృపాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ మురళీ మోహన్, సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సుందరయ్య చిన్నతనంలోనే కుల వివక్షతను వ్యతిరేకించారని తెలిపారు. తమ ఇంటి పాలేర్లు కూడా తమతో పాటు కూర్చుని భోజనం చేయాలని పేర్కొన్నారు. సుందరరామిరెడ్డి పేరును సుందరయ్యగా మార్చుకున్నాడని తెలిపారు. తన భూములను పేదలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. హైస్కూల్‌లో ఉన్నప్పుడే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఉద్యమ కారుడని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో క్రమశిక్షణకు మారుపేరు సుందరయ్య అని చెప్పారు. కో ఆపరేటివ్ స్టోర్‌లు పెట్టి తక్కువ ధరకు సరుకులు అందజేశారని తెలిపారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కృపాసాగర్ మాట్లాడుతూ..సుందరయ్య 15 సంవత్సరాలు శాసనసభ్యులుగా, రెండు సార్లు పార్లమెంట్ సభ్యులుగా గెలిచి సైకిల్ మీద చట్ట సభలకు వెళ్లిన గొప్ప నాయకులు అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని, నిజాం పాలనలో భూ సంస్కరణలు అమలు చేయాలని, జాగీర్దారీ విధానాలను తీవ్రంగా ప్రతిఘటించారని చెప్పారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని పేర్కొన్నారు. ప్రజలే తన బిడ్డలుగా భావించి పిల్లలు కాకుండా ఆపరేషన్ చేయించుకొని మతాంతర వివాహం చేసుకున్నారని వివరించారు. పార్టీలో జాతీయ నాయకుడిగా బాధ్యతలు నిర్వహించి, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారని వెల్లడించారు. దోపిడీ రహిత సమాజం కోసం, సోషలిజం కోసం సాగిన ఉద్యమాలకు బాసటగా నిలబడి, అనేక గ్రంథాలను రచించారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ పాష, కొండల్, ప్రభాకర్, సుమిత్ర నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం మేడ్చల్ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి బాధ్యత వహించారని తెలిపారు. సుందరయ్య అసలు పేరు పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి అని, పార్టీ కోసం రామిరెడ్డి అనే తోకను తీసేసి సుందరయ్యగా పేరు మార్చుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కులం కూడు పెట్టదని అప్పట్లోనే గుర్తించిన మేధావి అని పేర్కొన్నారు. తనకు పిల్లలు పుడితే ప్రజాసేవకు దూరం అవుతానని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాని గుర్తు చేశారు. తన జీవితాన్ని పార్టీకి, ప్రజాసేవకు అంకితం చేసి యావదాస్తిని పార్టీకి రాసిచ్చిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి నాయకులపై ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, చంద్రశేఖర్, బాల కిరణ్, వెంకటేష్, బాబు, మొగులప్ప, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో..


మల్కాజిగిరిలో..

కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను కట్టడి చేయాలి

- బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్ యాదవ్
- ఫీజులు, డొనేషన్ల పేరుతో అడ్డగోలుగా డబ్బు వసూలు చేస్తున్నారని మండిపాటు



నవతెలంగాణ-మేడ్చల్

కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని కట్టడి చేయడానికి చట్టం తీసుకురావాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అధిక ఫీజులు, డొనేషన్లతో కార్పొరేట్ విద్యా సంస్థలు నిరుపేద ప్రజలను పీక్కుతింటున్నాయని ఆరోపించారు. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్కేసర్, ప్రాంతాలల్లో పుట్టగొడుగుల్లా విస్తరించిన కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల యాజమాన్యలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు, డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి విద్యాసంస్థల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు. వ్యాపార దృక్పథంతో ఇలాంటి సంస్థలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. వీరి అక్రమాలను అరికట్టకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలై పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మహత్యలకు ఈ విద్యాసంస్థల దోపిడీ ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో లోపాలుండటంతో 6.49 లక్షల మంది 70శాతం విద్యార్థులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలోనే చదువుతున్నారని గుర్తు చేశారు. ఫీజుల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకరావాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సంక్షేమానికి బీఆర్టీయూ

జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ కృషి



- రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మెన్‌నారాయణ

నవతెలంగాణ-మేడ్చల్

కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మెన్ నారాయణ అన్నారు. ఆదివారం షీలా ఫోమ్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం సంబు ప్రభాకర్ అధ్యక్షతన మేడ్చల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని తెలిపారు. పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ అందించామని తెలిపారు. నూతన పరిశ్రమలు స్థాపనకు విశేషంగా కృషి చేసినట్లు పేర్కొన్నారు. షీలా ఫోమ్ కంపెనీ కార్మికులకు ఇటీవల మంచి వేతన ఒప్పందం చేశామని గుర్తు చేశారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో కంపెనీ సమస్యలు పరిష్కరించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కేసీఆర్, కేటీఆర్ సూచనలతో బీఆర్టీయూ కార్మికులకు అండగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.డి.సిరాజుద్దీన్, కార్యవర్గ సభ్యులు శ్రీనాథ్, నవీన్, నరేష్, భీము నాయుడు, స్మరణ, జై. జ్యోతిలేంక, ప్రభాకర్, ఎర్రయ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఈటల గెలుపునకు శ్రీశైలం వరకు పాదయాత్ర



నవతెలంగాణ-మేడ్చల్

మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ బీజేపీ యువ నాయకుడు నాలబాపని సౌమిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి శివాలయం నుంచి శ్రీశైలం వరకు ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్ కోడలు క్షమిత, బీజేపీ నాయకులు నారెడ్డి నందారెడ్డిలు హాజరై పాదయాత్రను ప్రారంభించారు. అంతకు ముందుకు అత్వేల్లిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్ర చేస్తున్న వారిలో వై. నరేందర్ రెడ్డి, ఎన్. అరవింద్ రెడ్డి, ఎన్. నిఖిల్‌రెడ్డి, వర్గంటి నితిన్, సాయిరాం, సాయి కుమార్, బన్నీ, రవి తేజ, ప్రవీణ్, సంపత్, సతీష్‌లు ఉన్నారు.

అందుబాటులోకి మరో ఆటమ్న్ సెలూన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హెయిర్ బ్యూటీ, నెయిల్ సర్వీసులను సరి కొత్తగా అందిస్తూ కస్టమర్స్‌ను ఆకట్టుకుటున్న ఆటమ్న్ సెలూన్‌ను చందానగర్ వాసులు కోసం అందుబాటులోకి తెచ్చింది. చందానగర్‌లో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, ఆటమ్న్ సెలూన్ బిసినెస్ హెడ్ శ్రీధర్‌బాబు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హెయిర్ బ్యూటీ, బ్రైడల్, నెయిల్ ఆర్ట్ వంటి అన్ని సర్వీసెస్‌ను ఎక్స్‌ఫర్ట్స్‌తో అందిస్తున్నాం అన్నారు. కస్టమర్లకు అందుబాటులో ఉండే విధంగా ప్రైజ్ క్వాలిటీ సర్వీస్‌ను దష్టిలో పెట్టుకుని ఓపెన్ చేశామని తెలిపారు.

9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | మే 20, 2024 | www.navatelangana.com

జూ లో సండే ఫండే..



నవతెలంగాణ - ధూల్ పేట్

నెహ్రూ జూ లాజికల్ పార్క్ సందర్శకులతో సండే ఫండేగా సందడి చేశారు. వేసవి సెలవులు, వీక్ ఎండ్ కావడంతో విద్యార్థులు, చిన్నారులు, పెద్దలతో జూ కిటకిట లాడింది. ఆదివారం ఒక్క రోజే సుమారు 25,600 మంది సందర్శించారు. దీంతో జూ పరిసరాల, ఎంక్లోసర్ల వద్ద సందర్శకులతో కళకళలాడింది. దీంతో సందర్శకులకు జూ అధికారులు ప్రత్యేక అదనపు బుకింగ్ కౌంటర్‌లు, టెలి కాస్టేడ్ స్క్రీనింగ్, మొబైల్ యాప్‌తో ఆన్లైన్ బుకింగ్ సిస్టం, అదనపు సెక్యూరిటీ, సిబ్బందిని ఏర్పాటు చేశారు. జ్యూస్ సందర్శ కులతో జంతు పక్షాదుల ఇంట్లో పార్కులులో సందర్శకులు సందడి చేశారు. జూన్ సందర్శించిన సందర్శకులకు జూ పార్క్ డిప్యూటీ క్యూరేటర్ నాగమణి జంతుప్రక్షాదుల పైన అవగాహన కల్పించారు.



గిరినగర్ ప్రాంతంలో అస్తవ్యస్తంగా మారిన బస్తీ ప్రధాన రోడ్డు...

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్
- జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ కమ్యూనిస్టు అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సీపీఐ(ఎం)మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్ అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతినీ షాపూర్ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయంలో ఉదయం 9 గంటలకు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్ మాట్లాడుతూ...పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన జీవించిన కాలమంతా సమాజానికి మార్గదర్శకంగా నిలిచారు. నాటి కాలంలో రాజకీయాల్లో ఒక కొత్త మార్గాన్ని చూపారు. రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో ఒక నమూనాగా నిలిచారు. భారత దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారు. అందుకోసం తన యావజ్జీవితాన్ని అంకితం చేశారు. అట్టడుగు వర్గాలైన వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారు. తన జీవితకాలం మొత్తం పేద ప్రజల కార్మికుల హక్కుల కోసం పోరాడినటువంటి తనకు ఉన్నటువంటి యావదాస్తిని పేదలకు పంచి, ప్రజలే తమ కుటుంబ సభ్యులుగా భావించిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సుందరయ్య అని కొనియాడారు. దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో సుందరయ్య ఒకరు. దేశ స్వతంత్ర పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని చెరసాలలను సైతం లెక్కచేయకుండా ప్రజల పక్షాన పోరాడినటువంటి సుందరయ్య కి జోహార్లు అర్పిస్తూ... సుందరయ్య ఆశయాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బి.సత్యం పసుల, అంజయ్య, ఈ.దేవదానం, ఆర్. స్వాతి, జి.వెంకన్న, కరుణాకర్, కె. శీను, భాష, దుర్గా నాయక్, వీరేష్ పాల్గొన్నారు.

చిరు వర్షానికే చిద్రమైన రోడ్లు



- పాదాచారుల, వాహనదారుల పాట్లు
- ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ప్రయాణికుల అవస్థలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజుల రామారం, జగద్గిరిగుట్ట, చింతల్, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న చిరు వర్షానికి లోతట్టు ప్రాంతాలలోని రోడ్లు జలమయమయ్యాయి. జగద్గిరిగుట్ట నుంచి ఆస్బెస్టాస్ కమాన్, పాపిరెడ్డినగర్ ప్రధాన రహదారి మధ్యలో, రంగారెడ్డినగర్ వివేకానంద విగ్రహం ప్రధాన రోడ్లపై సుమారు పావు కిలోమీటర్ల మేరకు వర్షపు నీరు స్తంభించి పోవడంతో రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడల్లా ఈ సమస్య సర్వసాధారణమైపోతుందని ప్రయాణికులు నవతెలంగాణతో వాపోయారు. ఇక భారీ వర్షం కురిస్తే సమస్య మరింత జటిలమైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడ ప్రాంతం కావడంతో భారీ వాహనాలు సంచరించడంతో అక్కడక్కడ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదారి ప్రమాదాల బారీన పడుతున్నారు. గత కొన్నేండ్లుగా సమస్య ఈ విధంగానే ఉన్న ఏ ఒక్కరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు ఆగ్రహం చేస్తున్నారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రయాణికులు కోరారు.

సాహిత్యంలో నిష్పాక్షిక విమర్శ పెరగాలి



- సారస్వత పరిషత్తు అధ్యయన శిబిరంలో వక్తలు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలుగు సాహిత్య విమర్శలో నిష్పాక్షికమైన విశ్లేషణ పెరగాలని వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సాహిత్య విమర్శ అధ్యయన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ శిబిరంలో పాల్గొన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన శిబిరంలో పలువురు విమర్శకులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగాలు చేశారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రాచీన కాలం నుంచి తెలుగు భాష, సాహిత్య పరిణామ వికాసాల్లో సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యం వహించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామా రావు ప్రధానోపాన్యాసం చేస్తూ 1875 సంవత్సరంలో కందుకూరి వీరేశలింగం రచించిన విగ్రహ తంత్ర విమర్శనము అనేది మొట్టమొదటి విమర్శా గ్రంథం అని అన్నారు. అప్పటినుంచి నేటి వరకు వెలువడిన పలు విమర్శా గ్రంధాలు, విమర్శకులను గురించి వివరించారు. ప్రాచీన సాహిత్యంలో విమర్శ పలు రూపాల్లో ఉందని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మసన చెన్నప్ప వివరించారు. విమర్శ, వ్యాఖ్యానం ,సమీక్ష, సాహిత్య చరిత్ర,పరిశోధన ల మధ్య భేద సాదృశ్యాలను గురించి తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ప్రసంగించారు. విమర్శ ధోరణుల గురించి ఎమ్మెస్కో బుక్స్ సంపాదకులు డాక్టర్ డి. చంద్రశేఖరరెడ్డి ,ఆధునిక సాహిత్య విమర్శ వికాసం గురించి హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ వి.త్రివేణి ప్రసంగించారు. విమర్శరీతుల గురించి సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ సి. మృణాళిని వ్యాసం పంపించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు.

కార్యకర్తను పరామర్శించిన కిషన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్టీ కోసం పనిచేసే వారికి భారతీయ జనతా పార్టీ నిరంతరం అండగా ఉంటుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి మరియు రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. అనంతరం నల్లకుంట డివిజన్‌లో భాజాపా కార్యకర్త నమం రాజుకు యాక్సిడెంట్ కావడంతో హైదారాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. గౌతమ్ రావు, నల్లకుంట కార్పొరేటర్ అమృతతో కలసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మల్లారెడ్డికి లక్ష్మన్ కుమార్ పేరు పలికే అర్హత లేదు

- ఉస్మానియా యూనివర్సిటీ దళిత, ఆదివాసీ, బహుజన విద్యార్థి, ప్రగతిశీల సంఘల ఆగ్రహం
- TSP జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కొలపురి చంద్రశేఖర్



నవతెలంగాణ-ఓయూ

మల్లారెడ్డి భూ వివాదాల్లో అనవసరంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ధర్మపురి ఏమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేరును అన్యాయంగా మాట్లాడడం జరుగుతుందని ఖబార్దర్ మల్లారెడ్డో మల్లారెడ్డి తస్మాత్ జాగ్రత్త నీ యూనివర్శిటీ, నీ భూముల కథలు అన్ని కూడా బయటకి తీస్తాం అని టీఎస్‌పీఎస్ రాష్ట్ర చైర్మెన్ కె.చంద్రశేఖర్ అన్నారు. ఓయూలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితమే అడ్లూరు లక్ష్మణ్‌కి సంబంధించిన 6 వందల గజాల భూమిని శ్రీనివాస్ రెడ్డికి అమ్మడం జరిగింది. అట్టి భూమికి లక్ష్మణ్‌కి ఎటువంటి సంబంధం లేదు... ఆ భూమిని నువ్వు కబ్జా చేసి, కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉంటే అక్రమ నిర్మాణాలు చేసింది నువ్వు.. జాగ్రత్త ఇకనైనా నీ కిరాయి అనుచరులను పంపించి, భూమిని కబ్జా చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ధర్మపురిలో లక్ష్మి నర్సింహ స్వామి సేవలో ధర్మపురి ప్రజలే ఊపిరిగా నీతికి నిజాయితీకి మారు పేరుగా అనునిత్యం ప్రజల్లో ఉండే ధర్మపురి ఏమ్మెల్యే లక్ష్మణ్ పేరు, ప్రజా సొమ్మును దోచుకునే నీ నోటి నుంచి పలికే అర్హత మల్లారెడ్డికి లేదన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేరు తీసినందుకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి నీ భూ కబ్జాలు ఆపుకో అని, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కొలపురి చంద్రశేఖర్ పేర్కొన్నారు. లేకపోతే నీ కబ్జాలు అన్ని ఓయూ విద్యార్థులే బయటకు తీస్తారని హెచ్చరించారు. దళిత విద్యార్థి సంఘాలు, ఆదివాసీ విద్యార్థి సంఘాలు, బహుజన విద్యార్థి సంఘాలు అన్ని కలిసి కట్టుగా లక్ష్మణ్ కుమార్‌కి సపోర్ట్ ఉన్నాయి అని జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కొలపురి చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ ప్రవీణ్, ఉస్మానియా యూనివర్సిటీ %దీఫీ% అధ్యక్షులు అంబేద్కర్, ఆదివాసీ విద్యార్థి సంఘము రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్, గిరిజన విద్యార్థి జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డా. వంశీ నాయక్, కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్, యువ నాయకులు నవీన్, విద్యార్థి సంఘాల నాయకులు, యూనివర్సిటీ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వినికిడి వైద్య సేవలు అభినందనీయం



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఉచిత వినికిడి (చెవు) వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని... వినికిడి లోపం ఉన్న ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ఎంతో ఉపయోగకరమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, మైత్రి నగర్ కమిటీ హాల్ లో 'ఆశ్రయ్ ఆకృతి సంస్థ' హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వినికిడి వైద్య పరీక్షల శిబిరాన్ని సురేష్ రెడ్డి ప్రారంభించారు. తరచూ ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తే అనేకమంది పేద, మధ్యతరగతి, ప్రజలు లబ్ధి పొందుతారని ఆయన అన్నారు. డివిజన్‌లోని వినికిడి లోపం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినికిడి లోపం గల వారికి పరీక్షలు చేసి ఉచితంగా వినికిడి మిషన్‌లను (హియరింగ్) అందజేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ్ ఆకృతి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, మైత్రి నగర్ అధ్యక్షులు గట్టు అశోక్, రాజీవ్ గృహ కల్ప అధ్యక్షులు శివగౌడ్, కృష్ణ, వెంకట్ రెడ్డి, డాక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రెండు రోజులపాటు జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా, జగద్గిరిగుట్ట వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మెన్ రేగూరి ప్రవీణ్ కుమార్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తాల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతి తీరని లోటు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

అమీర్‌పేట్‌లోని బుద్ధ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హరిప్రసాద్ మృతి చాలా బాధాకరమని పార్టీకి తీరని లోటు అని, ఆదివారం వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన దశదినకర్మకు, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు ఎంతో ఉత్సాహంగా హాజరవుతూ పార్టీకి అండగా నిలిచిన హరిప్రసాద్ మరణం చాలా బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ నా మన శేషు కుమారి, నాయకులు అశోక్ యాదవ్, సంతోష్ కుమార్, కూతురు నరసింహ, హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పకృతి వైపరీత్యాలను అరికట్టాలంటే
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పకృతి వైపరిత్యాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సద్గురు వర్యులు డాక్టర్ ఉమర్ ఆలీషా సూచించారు. హైదరాబాద్, అమీర్ పెట్, మదురానగర్, రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో నవమి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువర్యుల ఆధ్వర్యంలో హైదరాబాద్ శాఖ ఏర్పాటు చేసిన శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠము యొక్క వైశాఖ మాస పర్యటన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జీ హెచ్‌ఎంసీ అడిషినల్ కమిషనర్ శ్రీవత్స కోట, రిటైర్డ్ డిస్టిక్ జడ్జ్ నాగ మారుతి శర్మ, గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్ వేమూరి లక్ష్మీ, రిటైర్డ్ ఇన్‌కాంటాక్స్ ఆఫీసర్ రామావతారం, హిందు డైలీ ఎడిటర్ సందేశ్ భారత్వాజ్, రిటైర్డ్ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులతో పాటు పితం యొక్క ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిన్న పిల్లలు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా భక్తులను ఉద్దేశించి సద్గురువర్యులు డా.ఉమర్ ఆలీషా మాట్లాడుతూ శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం యొక్క తత్త్వం మానవత్వమే మతం అనే విధానంపై మోసి ఉందని తెలియజేశారు. ఆధ్యాత్మికతను ఒక దిక్సూచిగా మార్చుకుని ఈ సంసార జీవితంలో వచ్చే కష్టాలను, ఒత్తిడులను అదిగమించాలని తెలియజేశారు. ప్రకృతి వైపరిత్యాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వారు కోరారు. భారత దేశ విశిష్టతను భావితరాలకు అందించాలని, ధర్మాన్ని పాటిస్తూ.. ఆధ్యాత్మికతలో ప్రతి ఒక్కరు జీవించాలని జీహెచ్‌ఎంసీ అడిషినల్ కమిస్నర్ శ్రీవత్స కోరారు.

పదోన్నతుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఓయూ

సీనియర్ ప్రొఫెసర్ల అక్రమాల చిట్ట విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం కి ఇప్పటికే నివేదించామని కావున వారిని ఉపకులాపతులుగా నియమించే విషయంలో జాగ్రత్త వహించాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి, రీసర్చ్ స్కాలర్ ఇన్ ద డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ నెల్లి సత్య ఒక ప్రకటనలో కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ డి. రవీందర్ వీసీ అయిన తర్వాత మూడు సార్లు ప్రొఫెసర్లకు కెరియర్ అడ్వాన్స్మెంట్ స్కీం కింద సీనియర్ ప్రొఫెసర్లుగా 51 మందికి పదోన్నతులు కల్పించారు. వైస్ ఛాన్సలర్ డి.రవీందర్ తనకు అనుకూలంగా ఉన్న ప్రొఫెసర్లకు యూజీసీ, యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పక్షపాత ధోరణి ప్రదర్శిస్తూ సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. కొంతమంది ప్రొఫెసర్లుకు అన్ని అర్హతలు ఉన్న కక్షపూరితంగా వ్యవహరిస్తూ సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించకుండా అన్యాయం చేశారు. ఒక ప్రొఫెసర్ సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే ప్రొఫెసర్‌గా పదేళ్ల అనుభవం ఉండాలి. పీర్-రివ్యూడ్, యుజిసి కేర్ లిస్టు, కోపస్ వెబ్ ఆఫ్ సైన్స్ కనీసం పది ప్రచురణలు కలిగి ఉండాలని, అతని,ఆమె పర్యవేక్షణలో ఇద్దరు విద్యార్థులు పీహెచ్డీ డిగ్రీ పొంది ఉండాలి. కానీ ఓయూలో కొంతమందికి మూడు, నాలుగు, ఐదు ఆర్టికల్ ఉన్న సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించారు. దీనిపైన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంగా పలు మార్లు అనేక ఆందోళనలు నిర్వహి ంచి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని నియమించి కమిటీ పలుమార్లు సమావేశమై రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించింది. కానీ ఇప్పటివరకు కమిటీ రిపోర్టును బహిర్గతపరచలేదు. అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోలేదు. అక్రమాలకు పాల్పడిన వారిలో ఉన్నత విద్యా మండలి పెద్దలు, వివిధ యూనివర్సిటీల వీసీలు, కళాశాలల ప్రిన్సిపల్స్, విభాగ అధిపతులు, పీఠాధిపతులు కూడా ఉన్నారు. అక్రమాలకు పాల్పడి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన కొంతమంది ప్రొఫెసర్లు వివిధ యూనివర్సిటీలకు వీసీలుగా దరఖాస్తు చేసుకున్నారు. కావున వెంటనే కమిటీ రిపోర్ట్ బహిర్గత పరిచి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే భవిష్యత్తులో వారిని వీసీ లుగా నియమిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనం మధుర జ్ఞాపకం..



నవతెలంగాణ-ధూల్ పేట్

ఆత్మీయ సమ్మేళనం మధుర జ్ఞాపకాలనీ జియాగూడ లోని భారత అభ్యుదయ హై స్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఆ స్కూల్ 1995- 96 బ్యాచ్కు చెందిన ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా స్కూల్‌లో నిర్వహించారు. అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడపడమే కాకుండా చారిటీ కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత కూడా ఎంతో ఉత్సాహంగా మేము ఇప్పటికే విద్యార్థులం అంటూ ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు. పాఠశాల లోగోతో ప్రత్యేక మెమొంటోను అందించుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని మనోజ్, రామస్వామి, ప్రభాకర్, గజానంద్, ఆనంద్ తోపాటు సునీత మరికొందరు ముందుకు నడిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు 70 మంది తదితరులు పాల్గొన్నారు.

మారుతీ స్విఫ్ట్ కారును ఆవిష్కరించిన నగేష్



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఔట్ కాలనీ అసోసియేషన్ భవనం వద్ద వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో కొత్త మారుతీ స్విఫ్ట్- 2014 మోడల్ కారును కాలనీ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతీ కంపెనీ వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ రెడ్డి, అంజల్ రావు, సాజీద్, ఉపేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, ఉమాకాంత్, శ్రీనివాస్ రెడ్డి, సునయన, మారుతీ కంపెనీ ప్రతినిధి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ అడ్వకేట్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా గుంజి సంతోష్ కుమార్



నవతెలంగాణ - సంతోష్ నగర్

సికింద్రాబాద్ కంటోన్మెంట్, బోయిన్‌పల్లికి చెందిన యువ న్యాయవాది గుంజి సంతోష్ కుమార్ వడ్డేరాజ్‌ను తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ అయనకు నియామక పత్రాన్ని అందజేశాడు. గతంలో సంతోష్ కుమార్ వడ్డేరాజ్ విద్యార్థి నాయకుడిగా..న్యాయ శాస్త్ర విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారన్నారు. యువ న్యాయవాదుల హక్కులు, సంక్షేమం కోసం జరిగిన పోరాటాలలో ముందుండి నడిచిన చురుకైన వ్యక్తి అని కొనియాడారు.



స్మశాన వాటికకు

స్థలం కేటాయించాలని వినతి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఆదివారం కాలనీకి చెందిన గుండు నర్సింగ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎవరూ చనిపోయిన ఎక్కడికో ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్ళి దహన సంస్కారాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో ఉన్న కొద్ది పాటి స్మశాన వాటిక చుట్టూ ఇండ్ల నిర్మాణాలు చేయడం, ఉన్న కొద్ది పాటి స్మశాన వాటికకు ప్రహరి గోడ లేకపోవడం వలన నిండిన వర్షం నీరు చుట్టూ ఉన్న ఇండ్లలోకి చేరుతుందన్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించి.. కాలనీ వాసులకు మానవతా హృదయంతో అండగా నిలవాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందించి.. ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సురేష్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

రాము చౌహాన్‌ను సన్మానించిన ఎల్ఐసీ సిబ్బంది



నవతెలంగాణ - సంతోష్ నగర్

పదోన్నతిపై బదిలీపై వెళ్లున్న ఎస్. రాము చౌహన్‌ను పిఠాపురం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయ సిబ్బంది, డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్స్ ఆదివారం ఘనంగా సత్కరించారు. బ్రాంచ్ మేనేజర్‌గా రాము చౌహన్ పదోన్నత పొంది సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జిల్లా దేవరకొండ బ్రాంచ్‌కి బదిలీపై వెళున్నారు. డెవలప్మెంట్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షులు పత్తి ప్రసాద్ అధ్యక్షతన ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నేడి రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రావులు మాధవరావులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిఠాపురం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన నుండి ఎస్. రాము చౌహన్ నూతన వరవడితో వ్యాపార రంగంలో దూసుకుపోవడం కాకుండా ఆల్ ఇండియాలో పిఠాపురం బ్రాంచ్ జెండా ఎగరవేయడం ఎంతో శుభ పరిణామం అన్నారు. వ్యాపార రంగంలో అనేక మార్పులు తీసుకొస్తూ బ్రాంచ్ ఉన్నతకి, ఏజెంట్స్ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఈనీల్ కుమార్, నల్గొండ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యేశ్వర రావు, వర్ధిని, పిఠాపురం బ్రాంచ్ పిఠాపురం ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లోకా రెడ్డి రామకృష్ణ. కెవివి సత్యనారాయణ, కోశాధికారి కొత్త రాంబాబు, బిఎస్ ప్రకాష్ రావు, ఈ డెవలప్మెంట్ ఆఫీసర్లు శ్రీనివాస్, చాముండేశ్వరి, పావని, శివ, పణి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రభుత్వాలు, పాలకులు మారినా.. అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వాలు మారితే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఆశతో ఎదురు చూస్తుంటే ఆశలు నిరాశలుగా మిగులుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాలకులు మారినా..

అభివృద్ధి శూన్యం

- అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టింపులేని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ నుండి గుర్రంగూడకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులకు, ప్రయాణికులు వాపోతున్నారు. 2021లో హెచ్ఎండీఏ నిధుల నుండి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3కోట్ల రూపాయలు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా గుంతలు తీసి కంకర వేసి అర్ధాంతరంగా నిర్మాణ పనులను నిలిపివేశారు. రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి మూడేండ్లు దాటినా.. నేటికీ పనులు పూర్తి చేయడంలో పాలకులు విఫలమయ్యారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డులో చిన్న పాటి వర్షం కురిస్తే చాలు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిండి చెరువులను తలపిస్తున్నాయని..దీంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభిస్తాం

అల్మాస్‌గూడ నుండి గుర్రంగూడ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులను ప్రారంభింపజేస్తాం. తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల వలన రోడ్డు నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యం జరిగింది. కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా గుంతలు తీసి కంకర వేసి వదిలేశారు. ఆ పనులకు బిల్లులు అందకపోవడంతో పనులు పూర్తి చేయడం లేదు. త్వరలో సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభింపజేస్తాం.

డీఈఈ జ్యోతి

రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



అల్మాస్‌గూడ నుండి గుర్రంగూడ వరకు రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. రోడ్డు నిర్మాణం కోసం 2021లో హెచ్ఎండీఏ నిధుల నుండి రూ.3కోట్లు మంజూరై మూడేండ్లు దాటినా.. నేటికీ పనులను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి.

కార్పొరేటర్ దడిగ శంకర్



పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివి



మీర్‌పేట్, జనప్రియా మహానగర్‌లో సుందరయ్య వర్ధంతి సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఎడిటోరియల్ బోర్డు సభ్యులు సలీమ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడవరకు పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు సుందరయ్య అని అన్నారు. అంట రాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ.. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె.మస్తాన్, అమిన, స్వప్న, స్వరూప, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను సంతోష్‌నగర్‌లోని అలంకన్ మేరీ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్, నాయకులు తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. విఠల్, పి.నాగేశ్వర్, ఎల్.కోటయ్య, ఎం.మీన, అబ్దుల్ సత్తార్, కార్మికులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - హస్తినాపురం

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను హస్తినాపురం డివిజన్ సీపీఐ(ఎం) నందనవనం శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ కుంటిగొల్ల రాములు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్, సర్కిల్ కమిటీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య తదితరులు సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందనవనం శాఖ నూతన కార్యదర్శి మంథని యాదయ్య, నందనవనం శాఖ సభ్యులు గడ్డం రవీందర్, కస్తూరి శ్రీనివాస్, ఎల్ఐసి లక్ష్మయ్య, కృష్ణ, పొట్టిపాక రామస్వామి, పురుషోత్తం చారి, సాయి, కృష్ణ, పి. శ్రీనివాస్, లాట్ల లక్ష్మణ్, అంజమ్మ, ఆదిలక్ష్మి, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను సీపీఐ(ఎం) పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కన్వినింగ్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ అధ్యక్షతన తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ పార్టీ కార్యాలయంలో, సుందరయ్య నగర్ కాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి. కిషన్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు కే. అరుణ్ కుమార్, కే. వెంకటకృష్ణ, పార్టీ శాఖ కార్యదర్శులు కొండిగారి శంకర్, ఐ. కృష్ణ, కందుకూరి శారద, పార్టీ సీనియర్ నాయకులు బి.శంకరయ్య, జే. ఆశీర్వాదం, పి. మధు, బీ. మాల్యాద్రి, పి. శ్రీనివాసులు, వై. శీను, ఎం. ఆంజనేయులు, సాయిరాం, సాయి, శేషమ్మ ఉప్పలమ్మ పాల్గొన్నారు.





నవతెలంగాణ- నాగోల్

వ్యవసాయ కార్మిక సంఘాన్ని మొట్టమొదట ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీలు, దళితుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. చైతన్య, సరూర్‌నగర్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్యలు అన్నారు. సరూర్‌నగర్ సర్కిల్ ప్రాంతంలోని న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్. శంకర్ అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

తర్వాత సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఇన్సూరెన్స్ కలిగి ఉన్న కార్మికులందరికీ సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ వైద్యులు సమీర్, విజయ్, సుజాత, వెంకట్, న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు చంద్రయ్య, రాములు, రహమాన్, వెంకటేష్, శ్రీనివాస్, కే.మాధవ్, రామస్వామి, రవీందర్, జగన్, ఆదినారాయణ, బాలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




ఎల్బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్ నగర్ కాలనీ, చుట్టుపక్కల కాలనీలలో ఆదివారం దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎస్.ఎన్.డీ.పీ.పనుల్లో భాగంగా దాదాపు 95 శాతం పనులు ఎమ్మెల్యే చొరవతో పూర్తైనట్లు స్థానికులు తెలిపారు. సింగిరెడ్డి శివారెడ్డి వెనుక ఉన్న సూర్య నగర్ కాలనీ వద్ద ఎస్.ఎన్.డీ.పీ.పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే అక్కడ ఉన్న నాలా పక్కన పార్క్ నిర్మించాలన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ...రెండు, మూడు రోజుల్లో మిగిలిన పనులను మొదలు పెట్టనున్నట్టు తెలిపారు. అవసరం ఉన్నచోట నూతన రోడ్ల నిర్మాణం కూడా చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ పర్యటనలో ఎస్.ఎన్.డీ.పీ.ఈ.ఈ.కృష్ణ రావు, డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, ఉమ మహేశ్వర్, బొంబాయి, సదానంద్ రెడ్డి, చేగొని మల్లేష్, జగదీష్, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘంతో ఎంతో మేలు



- అధ్యక్షులు కె. లక్ష్మీనారాయణ

నవతెలంగాణ - బడంగ్‌పేట్

శ్రీ వినాయక పరస్పర సహాయక సహకార పొదుపు సంఘంతో సభ్యులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆ సంఘం అధ్యక్షులు కె. లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో ఉన్న విజయ లక్ష్మి ఫంక్షన్ హాల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం 24మందితో 1999లో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం 1875మంది సభ్యులతో కోట్లాది రూపాయల నిధులతో లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న కాలంలో పూర్తిగా పారదర్శకతతో సభ్యులంతా కలిసి కట్టుగా ముందుకు సాగుతూ ఆర్థిక ప్రగతిని పెంపొందించుకోవాలని అన్నారు. సంఘం సభ్యులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి రూ.21వేల బీమా సౌకర్యం కల్పించడంతో పాటు 60 సంవత్సరాలు దాటిన వారికి రూ.1500 ఫించన్ ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. అనంతరం పాలక మండలి సభ్యులను పూల మాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు బద్రమ్మ సహాయ కార్యదర్శులు మనోజ్, రాం బాబు, కోశాధికారి ఎనగండ్ల శ్రీధర్ గౌడ్, పాలక మండలి సభ్యులు మేకల మురళీ, శిరీష, కరుణమ్మ, జర్పటి ఆంజనేయులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
సోమవారం 20 మే 2024
www.navatelangana.com
హైదరాబాద్

కలైయరసి రామచంద్రన్.... పెండ్లికి ముందే తన కోరికను భర్తతో పంచుకుంది. అతను అవును అన్న తర్వాతే వివాహం చేసుకుంది. పెండ్లి తర్వాత చదువుకుని ఐటి కంపెనీల్లో ఉద్యోగం కూడా చేసింది. కానీ తన సొంత ఊరిలో, తన వారు నమ్ముకున్న చేనేతలో ఉపాధి కరువై పట్టణాల్లో కార్మికులుగా మారడం చూసి చలించిపోయింది. చేనేతను తిరిగి గ్రామానికి రప్పించాలని నిర్ణయించుకుంది. రాతైని అనే ఒక ఈ వెంచర్‌ను ప్రారంభించి చేనేతకు తిరిగి ప్రాణం పోస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...





చేనేతకు తిరిగి ప్రాణం పోస్తోంది



కలైయరసి తనకు కాబోయే భర్తను మొదటిసారి కలిసినప్పుడు చదువుకుని, మంచి ఉద్యోగం చేయాలనే కోరిక ఉన్నట్టు చెప్పింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు ఆమెను చదివించలేకపోయారు. ఆమె కోరికను తీర్చేందుకు భర్త అంగీకరించడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 2009లో ఆమె రామచంద్రన్‌ను పెండ్లి చేసుకుంది. ఏడాది తిరిగేలోపు ఓ బిడ్డకు జన్మనిచ్చింది. '2010లో నా బిడ్డకు రెండు నెలలు. నేను మళ్లీ చదువుకోవడానికి, పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. అయితే అప్పటికి నా కలలు ఒక కొలిక్కి రాలేదు. దానికి నా భర్త సహకరించాడు. ఆయన మద్దతుతో కొంగు ఇంజినీరింగ్ కళాశాల నుండి నా ఎంసీఏ పూర్తి చేసాను' అని కలైయరసి పంచుకుంది.

పరిస్థితులు గమనించి...

ఎంసీఏ తర్వాత ఆరేండ్లు ఆమె ఐటీ సంస్థతో పాటు ఏఆర్‌వీఆర్ కంపెనీలో డెవలపర్‌గా పనిచేసింది. 9 టు 5 రొటీన్‌లో చిక్కుకుంది. 2017లో ఆమె తన రెండవ బిడ్డను ప్రసవించడానికి తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలోని సాలంగపాళయం అనే తన స్వగ్రామానికి వెళ్ళింది. అక్కడ ఆమె ఆశ్చర్యకరమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులను గమనించింది. కలైయరసి చేనేత కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆమె తండ్రి చాలా ఏండ్ల కిందట పవర్ లూమ్‌కు మారారు. అప్పటి నుండి తన గ్రామంలో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కి తగ్గడాన్ని గుర్తించింది. చేనేత ద్వారా నేయడం శ్రమతో కూడుకున్న పని. అంతేకాక సమయం కూడా ఎక్కువ తీసుకుంటుంది. దాంతో చాలా మంది నేత కార్మికులు బట్టల చాపలను తయారు చేయడానికి వలస వెళ్లారు.



ఇళ్లకు దూరమై...

'మొదట్లో మా వాళ్ళంతా చేనేత పనితో చాలా సంతోషంగా ఉండేవారు. కానీ తర్వాత పరిస్థితి మారిపోయింది. వృద్ధులు స్థానిక భవనాలలో వాచ్‌మెన్‌గా పనిచేయడం ప్రారంభించారు. యువత పెద్ద సంఖ్యలో బట్టల మిల్లుల్లో డబుల్ షిఫ్టులలో పని చేయడానికి సమీపంలోని తిరుపూర్‌కు వెళతారు. ఉదయం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఇంటికి దూరంగా ఉంటారు. తల్లిదండ్రులు లేకపోవడం వల్ల చాలా మంది అమ్మాయిలు చదువు మానేసి పెండ్లి చేసుకుని, చిన్నప్పుడే తల్లులు అయ్యారు. ఇంతకు ముందు వారి తల్లిదండ్రులు తమ ఇళ్లలో మగ్గాల వద్ద పని చేసేవారు. వారి పిల్లల కోసం ఎక్కువ సమయం గడిపేవారు' అని ఆమె ఆనాటి రోజులు గుర్తు చేసుకున్నారు.

రాతైని ప్రారంభించి

కార్మికులు వలసలు వెళ్ళడానికి చేసిన కారణాల పరిశీలన ఆమెను ఆలోచింపజేసింది. చేనేతను తిరిగి గ్రామానికి తీసుకురావాలనుకుంది. 'నేను తమిళనాడులోని అనేక గ్రామాలలో పర్యటించి నేత కార్మికులు నెలకు 5,000 రూపాయలే సంపాదిస్తున్నారని తెలుసుకున్నాను. అలాగే వారి ఇళ్లలో 6*6 మగ్గం వేయడానికి స్థలం లేదు. మా ఇంటికి సమీపంలోని కావేరి నదిని రసాయన రంగులు ఎలా కలుషితం చేస్తున్నాయో కూడా చూశాను' అని ఆమె చెప్పింది. ఈ పరిస్థితులే మహమ్మారి సమయంలో రాతైని ప్రారంభించేందుకు దారితీసింది. రాతైని ఒక ఈ వెంచర్. దీని ఆధ్వర్యంలో సలంగపాళయంలోని తన సొంత ఇంటిలో ఐదు మగ్గాలతో, గ్రామంలోని ఇతర ప్రదేశాలలో ఏడు మరమగ్గాలతో నేత కార్మికులకు పని కల్పించింది.

సవాలుగా మారింది

ఆమె సహజ రంగులతో పాటు అరటి ఫైబర్, జనపనార, ఇతర పదార్థాలతో తయారు చేసిన ఆర్గానిక్ నూలును ఉపయోగించింది. అయితే ఈ నూలును ఉపయోగించమని కార్మికులను ఒప్పించడం ఆమెకు సవాలుగా మారింది. ఎందుకంటే వారికి ఫ్లోర్ మ్యాట్‌ల కోసం మందపాటి నూలుతో పని చేయడం అలవాటు. ఆమె కూడా పత్తిని పెద్దమొత్తంలో కొనవలసి వచ్చింది. ఇది ఆమెలాంటి యువ వ్యాపారవేత్తకు సాధ్యం కాదు. కాబట్టి ఆమె ప్రైవట్ చేయాలని నిర్ణయించుకుంది. సాంప్రదాయ చేనేత నేయడానికి పూరకంగా పోర్టబుల్ డై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనను ఆచరణలో పెట్టింది. ఇది మూడు ఎంపికలలో అందుబాటులో ఉంటుంది. అలాగే మూడు స్థాయిలలో పనిచేయవచ్చు. వాటిని పెద్దలు, మూడేండ్ల కంటే ఎక్కువ వయసున్న పిల్లలు ఉపయోగించవచ్చు.

మూడు దశల్లో...

మొదటి స్థాయిలో 'వీవ్‌మేట్' ఉంది. ఇది మగ్గం ఫ్రేమ్‌తో పాటు కనీస పరిమాణంలో సహజంగా రంగులు వేసిన నూలుతో వస్తుంది. ఇది పర్సులు, వాల్ హ్యాంగింగ్‌లు తయారు చేయడానికి ఉపయోగించవచ్చు. తదుపరి మగ్గం వీవ్‌అల్లీ. హ్యాండ్‌బ్యాగ్‌లు, స్టోల్స్ వంటి కొంచెం పెద్ద ఉత్పత్తులను తయారు చేయడానికి ఉపయోగించవచ్చు. మూడవ మగ్గం వీవ్ ఫిట్. తువ్వాలు, రుమాలుతో పాటు ఇంటికి అవసరమైన వస్తువులను నేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఈ మగ్గాలపై ఎలాంటి నూలునైనా ఉపయోగించవచ్చు. 'చిన్న పిల్లల కోసం వీవ్‌మేట్ సహాయపడుతుంది. మెరుగైన చాలా మంది పిల్లలు ప్రధానంగా ఒక చేతిని మాత్రమే ఉపయోగిస్తారు. ఎందుకంటే వారు ఎక్కువగా గాడ్జెట్‌లను ఉపయోగిస్తున్నారు. ఈ వీవ్‌మేట్ పిల్లలు కూడా తమ రెండు చేతులను నేర్పుగా ఉపయోగించుకోవడంలో సహాయపడుతుంది. వారు స్క్రీన్‌పై గడిపే సమయాన్ని కూడా తగ్గిస్తుంది' అని ఆమె పంచుకుంది.

చేనేతవైపుకు ఆకర్షించేలా

పోర్టబుల్ మగ్గాలు వినియోగదారు మాన్యువల్, QR కోడ్‌తో వస్తాయి. ఇది మగ్గాన్ని ఎలా సమీకరించాలి, ఉపయోగించాలి అనే దానిపై వినియోగదారుని యూట్యూబ్ వీడియోకి తీసుకువెళుతుంది. వినియోగదారుల ఆన్‌లైన్ సంఘం ట్రబుల్షూటింగ్ చిట్కాలతో ఒకరికొకరు సహాయం చేస్తూ డిజైన్‌లను చర్చించుకుంటుంది. అన్ని వయసుల వారిని చేనేతవైపుకు ఆకర్షించేలా చేయడమే ఆమె లక్ష్యం. తమిళనాడులోని పాఠశాలల్లో ఈ మగ్గాలను ఆమె ప్రదర్శిస్తుంది. పిల్లలు దాన్ని ఒక కార్యకలాపంగా ఎంచుకునేలా పాఠశాలలు ప్రత్యేక నేత క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఆమె ఆశ. ఇప్పటివరకు ఆమె 150 పోర్టబుల్ లూమ్ కిట్‌లను విక్రయించింది.

- సలీమ



కళలా పాఠ్యాంశాల్లో చేర్చాలి

గత ఏడాది ఆగస్టులో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన స్టార్టప్ తిరువిజా అనే కార్యక్రమంలో ఆమె పోర్టబుల్ మగ్గాలను ప్రారంభించారు. ఆమె రాతైనిలో సొంతంగా రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టింది. తాన్సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ మిషన్) రూ.10 లక్షల గ్రాంట్‌ను కూడా అందుకుంది. ఇటీవల రాతై రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును, స్టార్టప్ ఇంక్యుబేట్ అయిన NSRCEL నుండి రూ. 5 లక్షలు అందుకుంది. మగ్గాలన్నీ సాలంగపాళయంలోని రాతై యూనిట్‌లో తయారు చేస్తారు. వీవ్‌మేట్‌కు రూ.2,000 నుండి, వీవ్‌అల్లీకి రూ.10,000 నుండి, వీవ్‌ఫిట్‌కి రూ. 35,000 నుండి ధరలు ప్రారంభమవుతాయి. అదనపు నూలును Raatai వెబ్‌సైట్ నుండి కొనుగోలు చేయవచ్చు. ఆమె పాఠశాలల్లో నేతపనిపై వర్క్‌షాప్‌లు, పెద్దలకు ఒత్తిడిని తగ్గించే వ్యాయామంగా కూడా నిర్వహిస్తారు. 'మేము మరిన్ని పాఠశాలలను సందర్శించి మగ్గాలను పరిచయం చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. కళలాగా నేతపని పాఠ్యాంశాల్లో భాగం అవుతుందని ఆశిస్తున్నాం. మగ్గాలను కార్పొరేట్ స్థాయిలోకి తీసుకెళ్ళాలని చూస్తున్నాం' అని ఆమె చెప్పింది.

ఆపరేషన్ ఝూడు(చీపురు)

(మొదటిపేజి తరువాయి)

అరెస్ట్ చేసి జైలు పాలు చేసేందుకు ప్రధాని మోడీ, బీజేపీ ఆపరేషన్ ఝాడు (చీపురు) చేపట్టాయని ఆరోపించారు. స్వాతి మలివాల్‌పై దాడి కేసులో, కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ శ్రేణులు ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయానికి ప్రదర్శన నిర్వహించారు. అయితే దీనిని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ బీజేపీకి దీటుగా ఆప్ ఎదగకుండా నిరోధించేందుకు బీజేపీ, ప్రధాని మోడీ కుట్రపూరితంగా ఆపరేషన్ ఝాడును తెరపైకి తీసుకొచ్చాయని అన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఆప్ నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అరెస్టులతో పాటు, ఆప్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేస్తారని విమర్శించారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఆప్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని ఈడీ న్యాయవాది ఇప్పటికే కోర్టులో స్టేట్‌మెంట్ ఇచ్చారని కేజ్రీవాల్ వెల్లడించారు. ఖాతాలను ఇప్పుడే ఫ్రీజ్ చేస్తే ఆప్‌కు సానుభూతి లభిస్తుందనే ఉద్దేశంతో, లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ పని చేసేందుకు కాషాయ పాలకులు స్కెచ్ వేశారని విమర్శించారు. ఎన్నికల అనంతరం పార్టీ కార్యాలయాన్ని దిగ్బంధించి, రోడ్డు మీదకి తీసుకువస్తారని దుయ్యబట్టారు. బీజేపీ ఈ ప్రణాళికలతో ముందుకెళ్తున్నదని కేజ్రీవాల్ పార్టీ శ్రేణులకు తెలిపారు.మరోవైపు ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శ్రేణుల ఆందోళనలతో ఉద్రిక్తంగా మారింది. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ పిలుపుమేరకు కార్యకర్తలు, నాయకులు ఆదివారం ఉదయం నుంచే పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా వారితోనే ఉన్నారు. ఆప్ కార్యాలయం నుంచి ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యాలయానికి ఆప్ శ్రేణులు బయలుదేరగానే పోలీసులు అడ్డుకున్నారు. 144 సెక్షన్ ఉందని, గుంపులుగా వెళ్లడానికి వీల్లేదని అనుమతి నిరాకరించారు. దాంతో ఇరు వర్గాలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో ఢిల్లీ మంత్రులు, ఆప్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆప్ నేతలు భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియా బ్లాక్‌కు ఆదరణ

(మొదటిపేజి తరువాయి)

వెనుతిరిగారు. రాహుల్ మాత్రం ఇరు పార్టీల శ్రేణులతో కలిసి సెల్ఫీ దిగారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఫుల్పూర్ పట్టణంలో జరిగింది. రాహుల్, అఖిలేశ్ వేదిక వద్దకు చేరుకోగానే కాంగ్రెస్, ఎస్పీ మద్దతుదారులు తమ నాయకులను చూడ్డానికి ఎగబడ్డారు. నిర్వాహకులు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా జనం వెనక్కితగ్గలేదు. దీంతో రాహుల్, అఖిలేశ్ కొద్దిసమయం ఒకరితో ఒకరు చర్చించుకుని వేదిక నుంచి వెళ్లిపోయారు. నాయకులు ఇద్దరినీ భద్రతా సిబ్బంది వలయంగా ఏర్పడి సభ నుంచి బయటకు పంపించారు. ఫుల్పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎస్పీ అభ్యర్థి అమర్‌నాథ్‌కు మద్దతుగా ఈ సభ జరగాల్సి ఉంది. కాగా, రాహుల్-అఖిలేశ్ యాదవ్ సభకు వచ్చిన భారీ జనాన్ని చూసి బీజేపీలో ఆందోళన మొదలైందని కాంగ్రెస్, ఎస్పీ నాయకులు వ్యాఖ్యానించారు. ఇండియా వేదికకు ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇది నిదర్శనమని అన్నారు.

కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

- రైసీ పరిస్థితిపై ఆందోళన

టెహ్రాన్ : ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీని తీసుకుని వెళ్తున్న హెలికాప్టర్ ఆదివారం అజర్‌బైజాన్ రిపబ్లిక్ సరిహద్దుల్లోని ఓ మారుమూల ప్రాంతంలో కూలిపోయింది. అయితే, ఈ ప్రమాదం నుంచి రైసీ బయటపడ్డారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. దట్టమైన పొగ మంచు వల్ల హెలికాప్టర్‌ను అత్యవసర ల్యాండింగ్‌కు యత్నించగా ఈ ప్రమాదం చోటచేసుకున్నట్టు ఇరాన్ అంతరంగిక భద్రతా మంత్రి అహ్మద్ వహిదీని ఉటంకిస్తూ జాతీయ టెలివిజన్ తెలిపింది. ఇరాన్ అధ్యక్షుడు అజర్ బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌తో కలసి తూర్పు అజర్ బైజాన్‌లో ఒక డ్యామ్‌ను ఆదివారం ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేక హెలికాప్టర్‌లో రైసీ బయల్దేరి వెళ్తుండగా వాయువ్య ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు జాతీయ టెలివిజన్ తెలిపింది. హెలికాప్టర్‌లో . ఆయన వెంట ఇరాన్ , విదేశాంగ మంత్రి హుస్సేని అమీర్ అబ్దుల్లాహియాన్, తూర్పు అజర్ బైజాన్ రాష్ట్ర గవర్నరు, తబ్రిజ్ మత పెద్ద ఉన్నట్లు అధికారిక మీడియా తెలిపింది.

గంగమ్మ ప్రక్షాళన జరిగేనా?

(మొదటిపేజి తరువాయి)

నిపుణులు తెలిపారు.

97 పట్టణాల నుండి మురుగు

దేశంలో అత్యంత పొడవైన నదుల్లో గంగ ఒకటి. 1980వ దశకం మధ్య నుంచే దీని ప్రక్షాళనకు కార్యక్రమాలు చేపట్టారు. ఎందుకంటే మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాల కారణంగా గంగ కలుషితమై పోతోంది. గంగా నది ఒడ్డున ఉన్న 97 పట్టణాల నుంచి ప్రతి రోజూ 2,953 మిలియన్ లీటర్ల మురుగు నీరు వచ్చి గంగలో కలుస్తోందని 2020లో ప్రభుత్వం అంచనా వేసింది.

ఖర్చంతా ఆ నీటి పైనే

నమామి గంగ కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం డిసెంబర్ 31 వరకూ రూ.38,438.05 కోట్ల వ్యయంతో 457 ప్రాజెక్టులు చేపట్టినట్లు ఫిబ్రవరి 8న లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి విశ్వేశ్వర్ తుడు తెలిపారు. వీటిలో కేవలం 280 ప్రాజెక్టులు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో ఎక్కువ భాగం మురుగు నీటి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సంబంధించినవే. ఈ ప్రాజెక్టులు, ఖర్చు అంతా నదిని, నదీ జలాల ప్రవాహాన్ని మెరుగుపరచడానికి కాదని, నదిలోకి మురుగు నీరు ప్రవహించకుండా చేసేందుకేనని నిపుణులు తెలిపారు. లక్ష్యాలు, డిజైన్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పనిచేయకపోతే పెట్టిన ఖర్చంతా వృథాయేనని వారు అన్నారు. వారణాసిలో సైతం మురుగునీటి శుద్ధి సరిగా జరగడం లేదని నిపుణులు పెదవి విరిచారు.

అసలు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా అని తెలిపే సమాచారమేదీ అందుబాటులో లేదు. ఉన్న సమాచారం కూడా విశ్వసించదగినది కాదు. అన్ని స్థాయిల్లోనూ విశ్వసనీయమైన, స్వతంత్ర, ప్రజాస్వామిక, భాగస్వామ్య పాలన అవసరమని జల నిపుణులు స్పష్టం చేశారు. అసలు నదీ ప్రవాహ నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు.

ప్రకృతి ఆరాధనతో ప్రక్షాళన అవుతుందా?

ప్రకృతి ఆరాధన ద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను అడ్డుకోగలమని ప్రధాని మోడీ ఈ నెల 24న వారణాసిలో తెలిపారు. అయితే దీనికి శాస్త్రపరమైన రుజువేమీ లేదు. ప్రకృతిని ఆరాధించడం ముఖ్యమే కావచ్చు. కానీ దానితో పాటు అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ఇప్పుడు ఆ చర్యలే కొరవడ్డాయి. ఈ విషయం సాధువులకు కూడా తెలుసు. ఉదాహరణకు గంగానది ప్రక్షాళన కోసం ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హరిద్వార్‌లోని మాత్రీ సదన్ సాధువులు



పలు సందర్భాల్లో నిరాహారదీక్షలు చేశారు. 86 సంవత్సరాల వయసులో 2018 జూన్ 22న స్వామి జ్ఞాన్ స్వరూప్ సనంద్ నిరాహార దీక్ష ప్రారంభించారు. 112వ రోజున చనిపోయారు.

అంచనాలే వేయని ప్రభుత్వం

గంగ ప్రక్షాళన కోసం కోట్లాది రూపాయల పన్ను చెల్లింపుదారుల సొమ్మును వెచ్చించినప్పటికీ మురుగు నీటి ప్రవాహం ఆగడం లేదు. దానిని నియంత్రించే నాథుడే లేడు. అక్రమ ఇసుక తవ్వకాలు పరిస్థితిని మరింత క్షీణింపజేస్తున్నాయి. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్ట్ కారణంగా నదిలో నీటి ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది. నదీ పర్యాటక ప్రాజెక్టులు కూడా గంగ ప్రక్షాళనకు అవరోధంగా ఉన్నాయి. ఇలాంటి కార్యకలాపాల ప్రభావాన్ని ప్రభుత్వం అంచనా వేయడం లేదు.

నేటినుంచి ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు అవి జరుగుతాయి. సోమవారం నుంచి ఈనెల 21, 22, 24, 28, 29 తేదీల్లో పేపర్-2, ఈనెల 30, 31, వచ్చేనెల ఒకటి, రెండో తేదీన పేపర్-1 రాతపరీక్షలను నిర్వహిస్తారు. వచ్చేనెల ఒకటో తేదీన పేపర్-2 మ్యాథ్స్, సైన్స్ అభ్యర్థులకు మైనర్ మీడియంలో రాతపరీక్ష ఉంటుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే రాతపరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో ఒకటి, భద్రాద్రి కొత్తగూడెంలో ఒకటి, హన్మకొండలో నాలుగు, హైదరాబాద్‌లో రెండు, కరీంనగర్‌లో ఎనిమిది, ఖమ్మంలో ఎనిమిది, మహబూబ్‌నగర్‌లో రెండు, మేడ్చల్ మల్కాజిగిరిలో 25, నల్లగొండలో ఒకటి, నిజామాబాద్‌లో రెండు, పెద్దపల్లిలో మూడు, రంగారెడ్డిలో 17, మెదక్‌లో ఒకటి, సిద్ధిపేటలో రెండు, సూర్యాపేటలో రెండు, వరంగల్‌లో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా టెట్‌కు 2,86,386 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428 మంది ఉన్నారు.

ప్రతిరోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని టెట్ కన్వీనర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు రెండో విడత పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్‌ను మూసివేస్తారు. అంటే ఉదయం విడతకు 8.45 గంటలకు, మధ్యాహ్నం విడతకు 1.45 గంటలకే గేట్‌ను అధికారులు మూసివేస్తారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నందున అభ్యర్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, ఫొటో గుర్తింపు కార్డును వెంటతెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్, సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో..

రెడ్‌కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్‌కు అందజేసిన సీబీఐ : మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం జారీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో రాష్ట్ర పోలీసులు జారీ చేసిన రెడ్‌కార్నర్ నోటీసును సీబీఐ అధికారులు ఇంటర్‌పోల్ అధికారులకు అందజేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం దర్యాప్తు అధికారులు రెడ్‌కార్నర్ నోటీసును జారీ చేశారు. కాగా, రాష్ట్రంలో ఇంటర్‌పోల్‌కు నోడల్ ఆఫీసరైన సీఐడీ అదనపు డీజీ షికా గోయెల్.. ఈ నోటీసును ఇంటర్‌పోల్‌కు అందజేయాలంటూ సీబీఐకి ఇటీవలన పంపారు. కాగా, దేశంలో ఇంటర్‌పోల్‌కు నోడల్ విభాగమైన సీబీఐ.. ఈ నోటీసును తాజాగా ఇంటర్‌పోల్ అధికారులకు అందజేసినట్టు తెలిసింది. దేశం విడిచి వెళ్లిన ప్రభాకర్‌రావు జాడ కోసం తెలంగాణ పోలీసులు గాలిస్తున్న అంశాన్ని వివరించటమేగాక, ప్రభాకర్‌రావుపై ఎలాంటి కేసులు నమోదైన విషయాలను కూడా క్రోడీకరిస్తూ ఆ సమాచారాన్ని ఇంటర్‌పోల్ అధికారులకు సీబీఐ అధికారులు వివరించినట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ఆరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌కుమార్‌కు సంబంధించిన రెడ్‌కార్నర్ నోటీసును కూడా ఇంటర్‌పోల్‌కు సీబీఐ అందించినట్టు సమాచారం. దీంతో ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తు కొంత స్పీడును అందుకున్నట్టుగా తెలుస్తున్నది. ఈ రెడ్‌కార్నర్ నోటీసును ఇంటర్‌పోల్ అధికారులు ప్రభాకర్‌రావు జాడను కనిపెట్టి, ఆయనకు అందజేసిన తర్వాత ప్రభాకర్‌రావును హైదరాబాద్‌కు తీసుకొచ్చే విషయమై తదుపరి చర్యలుంటాయని సమాచారం.

నేడు ఐదో దశ పోలింగ్

(మొదటిపేజి తరువాయి)

స్థానాలకు, ఒడిశాలో 35 అసెంబ్లీ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 8.35 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకోనున్నారు. 94,732 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. 49 లోక్‌సభ స్థానాల్లో 39 జనరల్, 3 ఎస్టీ, 7 ఎస్సీ స్థానాలు ఉన్నాయి. ఒడిశాలోని 35 అసెంబ్లీ స్థానాలలో 21 జనరల్, 8 ఎస్టీ, 6 ఎస్సీ స్థానాలున్నాయి. 10 రాష్ట్రాల్లో 1,717 మంది అభ్యర్థులు లోక్‌సభకు పోటీ చేస్తున్నారు.దేశ వ్యాప్తంగా 8.95 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 4.69 కోట్ల మంది పురుషులు, 4.26 కోట్ల మహిళలు, 5409 మంది ట్రాన్స్ జండర్ ఓటర్లు ఉన్నారు. 7.81 లక్షల మంది 85 ఏండ్లు పైబడిన వారు, 24,792 మంది వందేండ్ల పైబడి వారు ఉన్నారు. 7.03 లక్షల మంది వికలాంగ ఓటర్లున్నారు. 94,732 పోలింగ్ కేంద్రాలు వుండగా వాటిలో 9.47 లక్షల పోలింగ్ అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా 153 మంది పరిశీలకులు ఉన్నారు. అందులో 55 సాధారణ, 30 మంది పోలీసు, 68 వ్యయ పరిశీలకులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2,000 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 2,105 మంది స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీమ్స్, 881 వీడియో సర్వేలెన్స్ టీమ్స్, 502 వీడియో వ్యూవింగ్ టీమ్స్ ఎన్నికల పనుల్లో ఉన్నాయి. 565 అంతర్రాష్ట్ర, 261 అంతర్జాతీయ సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ఏర్పాటు చేశారు. 17 ప్రత్యేక రైళ్లు, 508 హెలికాప్టర్లు ఏర్పాటు చేసినట్టు ఈసీ తెలిపింది.

పతంజలికి మరో దెబ్బ

(మొదటిపేజి తరువాయి)

నాణ్యత గురించి ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్‌కు సందేహం ఏర్పడటంతో స్వీట్ నమూనాలను సేకరించి రుద్రపూర్ టెస్టింగ్ లాబోరేటరీకి పరీక్షల కోసం పంపారు. నాణ్యతాలోపం ఉండటంతో రామ్‌నగర్‌లోని కనాహ జీ, హరిద్వార్‌లోని పతంజలి ఆయుర్వేద లిమిటెడ్‌లకు నోటీసులు జారీ చేశారు. 2020 డిసెంబర్‌లో రుద్రపూర్‌లోని టెస్టింగ్ లాబోరేటరీ ఈ స్వీట్ నాణ్యత తక్కువగా ఉండటంపై రాష్ట్ర ఆహార భద్రతా విభాగానికి నోటీసు పంపింది. ఈ ఘటన తర్వాత వ్యాపారవేత్త లిలాధర్ పథక్, పంపిణీదారు అజయ్ జోషి, పతాంజలి అసిస్టెంట్ మేనేజర్ అభిషేక్ కుమార్‌లపై కూడా కేసులు నమోదయ్యాయి. ఈ ముగ్గురికి రూ.5వేలు, రూ. పది వేలు, రూ. 25 వేలు చొప్పున జరిమానాలతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దీనితో పాటు గత నెలలో ఆ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ సస్పెండ్ చేసిన 14 ఉత్పత్తుల అమ్మకాలు ఆగిపోయాయా అని కూడా సుప్రీంకోర్టు పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్‌ను ప్రశ్నించింది. పతంజలి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్ ఈ ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు.

సింగపూర్‌లో కోవిడ్ పంజా

(మొదటిపేజి తరువాయి)

సౌకర్యాల కేంద్రాలకు తరలించాలని సూచించింది. వ్యాక్సినేషన్‌ను పున:ప్రారంభించాలని కూడా ప్రభుత్వం యోచిస్తుంది. ముఖ్యంగా 60 ఏండ్లు దాటిన వారు, దీర్ఘకాలిక రోగులకు ఒకవేళ వారు గత 12 నెలల్లో వ్యాక్సిన్ తీసుకోకపోతే వారికి వ్యాక్సిన్ వేయాడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మాస్కులను ధరించాలని ప్రజలకు సింగపూర్ ఆరోగ్య మంత్రి ఓనగ్ యే కుంగ్ విజ్ఞప్తి చేశారు.

ఇస్కాన్, రామకృష్ణ మిషన్‌పై మమతా అసత్య ప్రచారం

బెంగాల్ ప్రచారంలో మోడీ

కోల్‌కతా: ముస్లింలు, చొరబాటుదారులను రక్షించడానికే ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ వంటి సంస్థలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. బెంగాల్‌లో వరసగా రెండో రోజూ కూడా మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం పశ్చిమ మిద్నాపూర్ జిల్లాలోని ఖరగ్‌పూర్‌లో మోడీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ బెంగాల్ సంస్కృతిని, వారసత్వాన్ని టిఎంసి అవమానిస్తోందని విమర్శించారు. అయోధ్యలో రామమందిరానికి వ్యతిరేకంగా టిఎంసి నాయకులు పదేపదే అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. ముస్లిం ఓట్ల కోసం మాత్రమే వారు ఈవిధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. చొరబాటుదారులతో బెంగాల్‌కు భారీ ముప్పు పొంచి ఉందని అన్నారు.



గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్



బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో..



ఖానాపురం హవేలీలో కదం తొక్కిన ఎర్ర సైన్యం





కొత్తగూడెంలో..



భువనగిరిలో..



పార్టీలో చేరిన కుటుంబాలతో కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు



సూర్యాపేటలో



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో..



బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో..

సామాజిక వివక్ష, దోపిడీని నిర్మూలిద్దాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- సుందరయ్య జీవితం ఎందరికో ఆదర్శం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, నాగయ్య
- సుందరయ్య ప్రజల మనిషి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు,సుదర్శన్ రావు
- పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా పలు జిల్లాల్లో సదస్సులు
- సహపంక్తి భోజనాలు, హన్మకొండలో పార్టీలో చేరిన 200 కుటుంబాలు

నవతెలంగాణ- సుజాతనగర్/కొత్తగూడెం/మియాపూర్/విలేకరులు

సుందరయ్య స్ఫూర్తితో సామాజిక వివక్ష, దోపిడీని నిర్మూలిద్దామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో నివాళులర్పించారు. అనంతరం సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో చింతలపూడి సత్యం భవన్‌లో చప్పిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య తన చిన్న వయసులోనే తన ఆస్తి మొత్తాన్ని పేదలకు పంచి దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షపై పోరాడారని గుర్తుచేశారు. రైతాంగ సాయుధ పోరాట సారధిగా నిజాం నవాబును తరిమికొట్టి 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన మహా నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మనమందరం ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, ఖమ్మం జిల్లా పార్టీ కమిటీ సభ్యులు బండారు రమేష్, మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని స్థానిక మంచికంటి భవన్‌లో కొత్తగూడెం పట్టణ కమిటీ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సభకు సీపీఐ(ఎ) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటమే సుందరయ్యకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం పాలకులను బయటకు పంపడమే కాదని, అంతర్గతంగా ఆర్థిక అసమానతలు, ఆర్థిక దోపిడి, వర్గ దోపిడీ ఉండకూడదని సుందరయ్య భావించారని, మన స్వాతంత్ర్యాన్ని మేడిపండుగా అభివర్ణించారని తెలిపారు. ప్రజా జీవనంలో ఉండే వాళ్లు విచ్చలవిడిగా ఉంటే జనం నమ్మరని తెగేసి చెప్పేవారని అన్నారు. అసెంబ్లీకి కూడా ఆయన సైకిల్ పైనే వెళ్ళేవారని గుర్తు చేశారు. సుందరయ్య జీవితం భావితరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

హైదరాబాద్ గుచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. సాగర్ హాజరయ్యారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చపల్లి సుందరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శం అని అన్నారు. చిన్నతనంలోనే దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సారథ్యం వహించి.. దొరలు, భూస్వాములను తరిమికొట్టి, మట్టి మనుషులను మహోన్నతులుగా తీర్చిదిద్దిన పోరాట యోధుడని కొనియాడారు. చిన్న



వయసులోనే తన ఇంట్లోనే ప్రశ్నించడం ప్రారంభించారని, పనులు చేసేవారికి వేరు, ఇంట్లో వారికి వేరుగా భోజనం పెడితే వ్యతిరేకించేవారని తెలిపారు. దళితులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. వ్యవసాయ కూలీలకు మొట్ట మొదటి సారిగా కూలీ సంఘం పెట్టి వారి పక్షాన పోరాడారని తెలిపారు. ఆయన మరణించి 39 ఏండ్లు గడిచినా నేటికీ సుందరయ్యను గుర్తు పెట్టుకొనే వారు చాలా మంది ఉన్నారన్నారు. ఆయన ఎంతో నిబద్ధత కల్గిన వ్యక్తి అని కొనియాడారు.

హంగూ ఆర్భాటాలు లేకుండా మాతాంతర వివాహం చేసుకున్నారని తెలిపారు. పిల్లలను సైతం వద్దనుకొని.. తన జీవితాన్ని పార్టీకే అంకితం చేశారని తెలిపారు. సుందరయ్య ఆశలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆర్.సాంబశివ రావు, శ్రీనివాస్, శేరిలింగంపల్లి ఏరియా కన్వీనర్ శోభన్, కృష్ణ, రవీందర్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలోని శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన సుందరయ్య వర్ధంతిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు పాల్గొన్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య అజాత శత్రువని, నిరాడంబరుడని, ప్రజల మనిషి అని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు దిక్సూచి సుందరయ్య అని, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి మాట్లాడారు. పీడిత ప్రజల ప్రియతమ నేత, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని కొనియాడారు .

సుందరయ్య వర్ధంతి సందర్భంగా సహపంక్తి భోజనాలు

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో అతిచిన్న వయసులోనే జైలు జీవితం అనుభవించిన గొప్ప వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా చిన్నతనంలోనే కుటుంబం, సమాజంతోనూ పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి సామాన్యులను వీరులుగా చేశారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రభుత్వాలకు మార్గ నిర్దేశం చేశారని, అందుకు అధికారంలో ఉన్న వారు సైతం ఆయన్ను గౌరవించేవారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో సహపంక్తి భోజనాలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు మణి, పద్మమ్మ, సురేందర్, మహేశ్వరి, రామా, లక్ష్మణ్, యాదగిరి, దత్తు, వీరేశం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి సీపీఐ(ఎం)లో భారీ చేరికలు

- సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిద్దాం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

బీఆర్ఎస్ పార్టీ నుంచి సీపీఐ(ఎం)లోకి భారీగా చేరికలు జరిగాయి. హన్మకొండ పట్టణం రాంనగర్‌లోని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షతన నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా న్యూ శాయంపేటలోని జ్యోతిబసు నగర్, పెద్దమ్మ గడ్డలోని జ్యోతిబస్‌నగర్ కాలనీకి చెందిన 200కుటుంబాలు పార్టీలో చేరాయి.

కారు ఉపేందర్, బొట్ల కుమారస్వామి, రామంచ సారంగపాణితో పాటు పార్టీలో చేరిన 200కుటుంబాల సభ్యులకు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన సుందరయ్య జీవితం మొత్తం పేదలు, కష్టజీవుల కోసమే త్యాగం చేశారని గుర్తుచేశారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పేదల సమస్యలు పరిష్కరించేందుకు సీపీఐ(ఎం) పోరాటాలు నిర్వహిస్తుందని, ఏ పార్టీ కూడా పేదలకు ఇంటి స్థలం ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం చుక్కయ్య, టి ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, జి రాములు, మంద సంపత్, దీప తదితరులు పాల్గొన్నారు.



ప్రభాస్

ఆ బుజ్జి ఎవరు?

ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఎ.డి' చుట్టూ ఉన్న ఎగ్జైట్‌మెంట్ ప్రపంచవ్యాప్తంగా సినీ ఔత్సాహికులలో నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. ఈనెల 22న ఐదవ సూపర్‌స్టార్, భైరవ ప్రాణ స్నేహితుడైన బుజ్జిని రివీల్ చేయనున్నారనే ప్రకటనతతా ఎగ్జైట్‌మెంట్‌కి అవధులు లేని ఆనందాన్ని తాకింది. 'ఫ్రమ్ స్క్రాచ్ ఇపి4 : బిల్డింగ్ ఎ సూపర్‌స్టార్' అనే పేరుతో బిహైండ్ ది స్క్రీన్ గ్లింప్స్‌తో జూన్ 2020లో దర్శకుడు నాగ్ అశ్విన్ గొప్ప విజన్‌తో ప్రారంభించినప్పటి నుంచి సూపర్‌హీరో భైరవగా ప్రజెంట్ చేసిన వీడియోతో క్రియేటర్‌లు ప్రేక్షులను అద్భుతమైన ప్రయాణంలోకి తీసుకెళ్ళారు. బెస్ట్ ఫ్రెండ్, బెస్ట్ కంపానియన్ బుజ్జి నెటిజన్లను గెస్సింగ్‌లో ఉంచడంతో పాటు 5వ సూపర్‌స్టార్ గురించి మరింత తెలుసుకోవడానికి ఆసక్తిని కలిగిస్తుంది.

2 నిమిషాల 22 సెకన్ల వీడియో గ్యారేజ్ సెట్టింగ్‌లో ప్రభాస్‌తో ఒక మిస్టీరియస్ ఎన్‌కౌంటర్‌తో సహా టీజింగ్ గ్లింప్స్‌ని అందిస్తూ ఈనెల 22న బుజ్జి గ్రాండ్ డెబ్యూ కోసం అందరిలోనూ ఆసక్తిని పెంచింది.

ఇటీవల కల్కి 2898 ఎ.డి.నుంచి విడుదలైన అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్ర ప్రేక్షకులని మంత్రముగ్దులని చేసింది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, ఇంగ్లీషు భాషలలో రివీల్ చేసిన టీజర్, ట్రూ పాన్-ఇండియన్ టీజర్‌గా సెలబ్రేట్ చేసుకుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న కల్కి 2898 ఈ సంవత్సరం సినిమాటిక్ ఈవెంట్‌గా నిలవనుంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటాని వంటి సూపర్ స్టార్స్‌తో వైజయంతీ మూవీస్ బ్యానర్ నిర్మాణంలో జూన్ 27న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది.



వశిష్ఠ ఎన్ సింహ


యేవమ్‌లో యుగంధర్‌గా..

పిడిపి, సి స్పేస్ ఉమ్మడి బ్యానర్లులో నవదీప్, పవన్ గోపరాజు నిర్మాణంలో నిర్మితమవుతున్న చిత్రం 'యేవమ్' . ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా మహిళలను ఉద్దేశించి 'ఆడపిల్లనే అయితే ఎంటటా' అనే హుక్ లైన్‌తో చాందినీ చౌదరి క్యారెక్టర్ పోస్టర్‌ను, అలాగే హాట్‌లుక్‌లో 'నా బాడీ సూపర్ డీలక్స్' అంటూ ఆషు రెడ్డి పోస్టర్‌ను, పోలీస్ ఆఫీసర్‌గా యాక్టర్ భరత్‌తో 'ఇన్ ఏ క్రైమ్ దేర్ ఆర్ నో కోఇన్సిడెన్సెస్' అని పోస్టర్ రిలీజ్ చేశారు. ఆ పోస్టర్స్ అన్నింటికీ విశేష స్పందన లభించింది, ఇప్పుడు అదే తరహాలో మరో వైవిధ్యమైన క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేసారు. కన్నడ స్టార్ వశిష్ఠ ఎన్ సింహను 'యుగంధర్' లుక్‌లో "ఏం? నేను సరిపోనా?' అనే హుక్ లైన్‌తో మరో పోస్టర్‌ను లాంచ్ చేశారు. యుగంధర్ తెలుగులో ఇప్పటి వరుకు చేసిన అన్ని క్యారెక్టర్‌లతో పోలిస్తే ఈ లుక్ చాలా యూనీక్‌గా ఉంది అని ప్రేక్షకుల నుండి ప్రశంసలు లభిస్తున్నాయని చిత్ర బృందం తెలిపింది.

ఒక పక్క హీరోగా చేస్తూ కూడా మరో పక్క నవదీప్ ఇలా ఈ సినిమా నిర్మాణంలో భాగం అవ్వడం, ఈ కథకి ఉన్న పోటేన్షియాలిటీని చెప్పకనే చెబుతోందని చిత్రయూనిట్ పేర్కొంది. చాందిని చౌదరి, వశిష్ఠ సింహ, జై భరత్ రాజ్, ఆశు రెడ్డి, గోపరాజు రమణ, దేవిప్రసాద్, కల్పలత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవదీప్, పవన్ గోపరాజు, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం: ప్రకాష్ దంతులూరి, సినిమాటోగ్రాఫర్: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీత దర్శకులు: కీర్తన శేష్, నీలేష్ మందలపు, ఎడిటర్: సుజనా అడుసుమిల్లి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: రాజు పెనుమత్స.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో 40వ సినిమా



సిద్ధార్థ్

హీరో సిద్ధార్థ్ చిత్ర పరిశ్రమలో 21 సంవత్సరాల అద్భుతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఎంచుకునే కథలు, పాత్రలు, పెర్ఫార్మెన్స్‌తో అద్భుతంగా అలరిస్తున్నాయి. బాలీవుడ్‌లో 'రంగ్ దే బసంతి'తో చెరగని ముద్ర వేశారు. తెలుగులో 'బొమ్మరిల్లు'తో ప్రేక్షకుల మన్ననలు పొందారు. తమిళ పరిశ్రమలో పలు జోనర్‌లలో మెరిసి.. సినిమా, నటనపై తనకున్న గొప్ప అభిరుచిని చూపించారు.

ఆయన లేటెస్ట్ ప్రాజెక్ట్ 'చిత' ప్రేక్షకుల హృదయాల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసింది. ఇప్పుడు ఆయన సిద్ధార్థ్ 40' (వర్కింగ్ టైటిల్) పేరుతో మరో ఎగ్జైటింగ్ మూవీ కోసం మంచి యూనిట్‌తో చేతులు కలిపారు. ఈ అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ను '8 తొట్టక్కల్'తో పేరు పొందిన శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు- తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'నేను చాలా స్క్రిప్ట్‌లు విన్నాను. శ్రీ గణేష్ చెప్పిన కథ నాకు ఎంతగానో నచ్చింది. ప్రేక్షకులపై ప్రభావం చూపే సినిమాలను తీయడమే నిర్మాతలకు ఆనందం. అలాంటి మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం గర్వంగా ఉంది. ఆయన మంచి సినిమాతో పరిశ్రమను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలలు కనే నిర్మాత. మా అంకితభావం, ప్యాషన్‌తో ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించే అద్భుతమైన సినిమాని అందిస్తాయనే నమ్మకం నాకుంది' అని అన్నారు. నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ, 'శాంతి టాకీస్‌కి మా అమ్మ పేరు పెట్టాం. మా అమ్మ థియేటర్లలో చూసి ఆనందించ గలిగే ప్రాజెక్ట్‌లనే ఎంచుకోవాలని భావిస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకర్షించే కమర్షియల్ చిత్రాలని రూపొందించడమే శాంతి టాకీస్ లక్ష్యం. శ్రీ గణేష్ అద్భుతమైన కథ రాశారు. మేము త్వరలో సర్ ప్రైజింగ్ అనౌన్స్‌మెంట్స్ చేస్తాం' అని చెప్పారు.

గం..గం..గణేశా

హీరో ఆనంద్ దేవరకొండ నటించిన లేటెస్ట్ మూవీ 'గం..గం..గణేశా'. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం.ఈ నెల 31న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ డేట్ అండ్ టైమ్‌ని అనౌన్స్ చేశారు మేకర్స్. నేటి (సోమవారం) సాయంత్రం 4 గంటలకు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నారు. మంచి క్రైమ్ కామెడీ మూవీగా..ప్రేక్షకులు ఫ్యామిలీస్‌తో కలిసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఆనంద్ దేవరకొండ తొలిసారి యాక్షన్ మూవీ చేయటం, అలాగే ఆయన నటించిన బేబీ సినిమా సూపర్‌హిట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. కరిష్మా, వెన్నెల కిషోర్, సత్యం రాజేశ్, జబర్దస్త్ ఇమాన్యూయల్, రాజ్ అర్జున్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: కిరణ్ మామిడి, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం - చేతన్ భరద్వాజ్, కో-ప్రొడ్యూసర్ : అనురాగ్ పర్వతనేని.



ఎన్టీఆర్

భయానికే భయం పుట్టించే దేవర

ఎన్టీఆర్ నటిస్తున్న భారీ బడ్జెట్ సినిమా 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రపంచస్థాయిలో బజ్ క్రియేట్ చేస్తున్న సినిమా ఇది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ హీరో సైఫ్ అలీ ఖాన్ కీ రోల్ చేస్తున్నారు.ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఫస్ట్ పార్ట్ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళంలో చిత్రాన్ని అత్యంత భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాకు ఇప్పుడు బాలీవుడ్ నుంచి అద్భుతమైన సపోర్ట్ లభించింది. బాలీవుడ్ మేజర్ ప్లేయర్స్ ఈ చిత్రంతో చేతులు కలుపుతున్నారు. ధర్మ ప్రొడక్షన్స్, ఏఏ ఫిల్మ్స్ కలిసి ఈ సినిమాను ఉత్తరాదిన డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. ఈ చిత్ర నార్త్ థియేట్రికల్ రైట్స్‌ని కరణ్ జోహార్, అనిల్ తండానీ సొంతం చేసుకున్నారు. అత్యంత భారీ మొత్తం చెల్లించి ఈ మాగ్నమ్ ఆపస్‌ని దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే విడుదలైన దేవర గ్లింప్స్ సోషల్ మీడియాలో సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. ఎన్టీఆర్ రోల్ మీద భీభత్సమైన ఇంట్రస్ట్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆయనతో పాటు ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరేన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో అద్భుతమైన క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ సమర్పిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఆర్. రత్నవేల్ సినిమాటోగ్రాఫర్‌గా, ప్రొడక్షన్ డిజైనర్‌గా సాబు సిరిల్ వ్యవహరిస్తున్నారు

ఆదివారం ఈ చిత్ర టైటిల్ రోల్‌ని పరిచయం చేసే ఫియర్ సాంగ్‌ని చిత్ర బృందం రిలీజ్ చేసింది. అనిరుద్ రవిచంద్రన్ కంపోజ్ చేసిన ఈ పాట దేవరగా ఎన్టీఆర్ పాత్రలోని అన్ని కోణాలను పరిచయం చేసింది. అంతేకాదు భయానికే భయం పుట్టించేలా ఉన్న దేవర క్యారెక్టర్‌కి సర్వత్రా మంచి రెస్పాన్స్ వస్తోందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నేడు ఈసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల ఆరో తేదీన నిర్వహించిన ఈసెట్ రాతపరీక్ష ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఈసెట్‌కు 24,272 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 23,330 (96.12 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

హిందీ విద్వాన్ ధ్రువపత్రాలను పరిగణించాలి

- హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి గాయిబువలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

కేంద్ర ప్రభుత్వ శాశ్వత గుర్తింపు ఉన్న హిందీ విద్వాన్ ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్ గాయిబువలీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హిందీ పండిట్ ట్రైనింగ్ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ శాశ్వత గుర్తింపునిచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం హిందీ విద్వాన్, హిందీ శిక్షక్ ప్రశిక్షక్ ధ్రువపత్రాలను డీఎస్సీ-2024కు పరిగణనలోకి తీసుకుంటున్నదని వివరించారు. పీజీటీ హిందీ, టీజీటీ హిందీ, స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులకు ఆయా ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుందని పేర్కొన్నారు. హిందీ విద్వాన్ చదివిన విద్యార్థుల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోనూ 2017లో ప్రకటించిన టీఆర్టీ, గురుకుల ఉపాధ్యాయ పోస్టుల నియామకాల్లో హిందీ విద్వాన్ ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగాలిచ్చారని గుర్తు చేశారు. డీఎస్సీ-2024లో కూడా స్కూల్ అసిస్టెంట్ హిందీ, లాంగ్వేజ్ పండిట్ హిందీ పోస్టులకు దరఖాస్తు చేసేందుకు హిందీ విద్వాన్ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశం కల్పించాలని సూచించారు. ఆ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సుమారు 35 వేల మంది ఉంటారనీ, వారికి న్యాయం చేయాలని కోరారు.

కల్లాల వద్ద

రైతుల కష్టాలు సర్కార్‌కు పట్టవా?

- అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాల్సిందే : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లాల వద్ద రైతులు పడుతున్న కష్టాలు కాంగ్రెస్ సర్కార్‌కు పట్టవా?అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైన ప్రభుత్వం... వడ్లను సైతం సకాలంలో కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారమిచ్చినప్పటికీ ప్రభుత్వం మాత్రం కల్లాల వద్ద వడ్ల కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయలేకపోయిందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు తడవకుండా కనీససౌకర్యాలు కల్పించక పోవటం దుర్మార్గమని విమర్శించారు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ సీఎం ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు జరగటం లేదని తెలిపారు. క్వింటాలుకు 5 నుండి 10 కిలోలు కోత పెడుతూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీసీ గురుకుల

కళాశాలల్లో నేటి నుంచి సీట్ల భర్తీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలను ఆన్‌లైన్ https://mjpabcwreis.cgg.gov.inలో అందుబాటులో ఉంచామని తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాల్లో ఏప్రిల్ 28న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో సోమవారం నుంచి 30 లోగా రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఎంపీసీలో 8,624, బైపీసీలో 6,463, ఎంఈసీలో 484, సీఈసీలో 2,676, హెచ్ఈసీలో 229 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాలికల కోసం 9,841, బాలుర కోసం 8,635 సీట్లు కేటాయించగా, ప్రత్యేకంగా వృత్తి విద్యా కోర్సులైన - అగ్రికల్చర్, క్రాప్ ప్రొడక్షన్ (ఏసీపీ)లో 19 సీట్లు, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ) 11 సీట్లు, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్ (సీజీఏ)లో 35 సీట్లు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) 76 సీట్లు, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ)లో 92 సీట్లు, ఫిజియోథెరపీ (పీటీ)లో 12 సీట్లు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ (పీఎస్‌టీటీ)లో 9 సీట్లు, టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (టీ,హెచ్) లో 19 సీట్లు కలిపి మొత్తం 273 సీట్లు భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరూ వెబ్‌సైట్‌లో తమ ఫలితాలు సరిచూసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య అందించే లక్ష్యంతో పనిచేస్తుందనీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

స్థానిక సంస్థల్లో

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కుల గణనతర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించిందని గుర్తు చేశారు. అందులో పొందుపర్చిన అంశాలను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంబీసీలను మోసం చేస్తే.. ఆ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. బడ్జెట్‌లో బీసీలకు రూ. లక్ష కోట్లు కేటాయిస్తామనీ,ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం ఉద్దేశపూర్వకంగానే బీసీలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు చేయకపోతే..బీసీలంతా ఐక్యంగా ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు.

అజ్ఞాత దళ నాయకులను

కోర్టులో హాజరుపర్చాలి : న్యూడెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకులు ఎ రాజన్న, దేవిరెడ్డి జీవన్‌తోపాటు మరో నలుగురిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని ఆ పార్టీ సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిని వరంగల్ పోలీసులు అరెస్టు చేశారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

లెక్కా లేదు.. పత్రం లేదు..



- జనాభా లెక్కల నుంచి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ వరకు ఇదే తీరు
- పాత లెక్కల మీదనే ఆధారపడి పథకాలు, కార్యక్రమాలు
- భారత్‌లో డేటాపై కొరవడిన విశ్వసనీయత, పారదర్శకత
- మోడీ సర్కారు తీరుపై నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : ఒక ప్రభుత్వం తన పథకాలను, కార్యక్రమాలను అమలు చేయాలంటే అధికారిక గణాంకాలు తప్పనిసరి. ముఖ్యంగా, జన గణన అనేది ప్రతి దేశానికీ చాలా కీలకం. అలాగే, ప్రజలు ఆరోగ్య పరిస్థితుల గురించి తెలిజేసే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) వంటివి కూడా అత్యంత ముఖ్యమైనవి. కానీ, భారత్‌లో కొన్నేండ్లుగా జన గణన జరగకపోవటం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

దేశంలో కోవిడ్-19 మహమ్మారి కారణంగా 2021 జనాభా గణన ఆలస్యమైంది. దీంతో మోడీ పాలనలో భారతదేశ జనాభా గురించి అధికారిక సమగ్ర డేటా లేకుండా మొత్తం దశాబ్దం గడిచిపోయిందని లాన్సెట్ ఇటీవలి సంపాదకీయంలో పేర్కొన్నది. భారత్‌లో తదుపరి జనాభా గణనను 2024లో ఎలక్ట్రానిక్ సర్వే నిర్వహిస్తారనే వాగ్దానం ఇంకా నెరవేరలేదని మెడికల్ జర్నల్ వివరించింది. భారత జాతీయ డేటాలోని శూన్యత భారత జనాభా లెక్కలకే పరిమితం కాలేదు. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే-6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6), అఖిల భారత గృహ వినియోగ వ్యయ సర్వే వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ లెక్కలకు సంబంధించిన జాప్యమనేది ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై పడుతున్నది. సరైన లెక్కలు తేలకపోవటంతో దాని ప్రభావం పేద, మధ్య తరగతి ప్రజలపై పడుతున్నదని నిపుణులు విశ్లేషకులు అంటున్నారు. ఏప్రిల్‌లో ప్రచురించబడిన లాన్సెట్ సంపాదకీయం భారత్‌లో డేటా పారదర్శకత లేకపోవడం దేశ ప్రజలను దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని వివరించింది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జాతీయ డేటా ప్రధాన వనరుల చుట్టూ పారదర్శకత క్షీణించడం వలన డేటా నాణ్యత, జవాబుదారీతనం నిర్ధారించడం చాలా కష్టమైంది. "ఒక దేశానికి జనాభా లెక్కలు, ఆరోగ్య సర్వే వ్యవస్థ(డీహెచ్ఎస్) చాలా కీలకం. ఇది ప్రభుత్వ చర్యలో భాగం" అని నిపుణులు అంటున్నారు. దేశంలో కోవిడ్-సంబంధిత మరణాల వాస్తవ సంఖ్యను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించగా.. దానిని భారత ప్రభుత్వం తోసిపుచ్చిందని వారు గుర్తు చేస్తున్నారు. అయితే, భారత ప్రభుత్వం స్వతంత్ర అధ్యయనాలను విమర్శించినప్పటికీ, వాస్తవ మరణాలపై దాని స్వంత అధికారిక డేటాను బహిర్గతం చేయలేదని వారు అంటున్నారు.

భారత్‌లో 11 సంవత్సరాలలో జనాభా గణన జరగకపోవటంపై నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, రక్తహీనత, వైకల్యంపై కీలకమైన ప్రశ్నలను ఎటువంటి వివరణ లేకుండా ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 నుంచి తొలగించటమేంటనీ వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ డేటా తరచుగా టీకా రేటు, సంతానోత్పత్తి రేటు, పోషకాహారం తీసుకోవటం, పూర్వ ప్రసవానంతర ఆరోగ్య సంరక్షణ వంటి సాధారణ అంశాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగించబడుతుంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఫలితాలను చూపుతున్నాయో లేదో అంచనా వేయటానికి కూడా ఇది సహకరిస్తుందని ఆరోగ్య నిపుణులు, విశ్లేషకులు చెప్పారు.

అయితే, గణనలు సరైన సమయంలో జరగక పోవటంతో పాత లెక్కలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2011లో జరిగిన జనాభా లెక్కలపై ఆధారపడి కార్యక్రమాలు, పథకాలను నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. 2021లో జరగాల్సిన జన గణను ఆ తర్వాత పరిస్థితులు సద్దుమణిగినా కూడా మోడీ సర్కారు నిర్వహించకపోవటం శోచనీయమని చెప్తున్నారు. "దేశంలో చాలా పాలసీలు ఇప్పుడు కాలం చెల్లిన, దశాబ్దాల నాటి డేటాపై ఆధారపడి ఉన్నాయి. ఈ డేటా ఆధారంగా పాలసీలను రూపొందిస్తున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిని మీరు లెక్కించడం లేదు" అని గ్లోబల్ అభివృద్ధి పరిశోధకుడు, ఆక్స్‌ఫామ్ ఇండియాలో మాజీ ప్రధాన పరిశోధకులు వర్ష శ్రీ రామ్ తెలిపారు. కాగా, ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం అక్టోబర్ 2024కి ముందు జనాభా గణన-సేకరణ కసరత్తు ప్రారంభమయ్యే అవకాశం లేదు.

> అభివృద్ధి చెందిన దేశాలన్నింటికీ ఉమ్మడిగా ఉన్న విషయం.. వారు వ్యవస్థలో ఒక బలమైన డేటా మౌలిక సదుపాయాలను కలిగి ఉన్నారు. బలమైన డేటా సిస్టమ్ లేకుండా అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించటం కష్టం. కాబట్టి, జనాభా గణన, రిజిస్ట్రేషన్లు, సర్వేలు చాలా కీలకం అని నిపుణులు చెప్తున్నారు. భారతదేశ డేటాపై నమ్మకం పడిపోవటానికి ప్రధాన కారణం జవాబుదారీతనం కోసం ఫ్రేమ్‌వర్క్ లేకపోవటమేనని నిపుణులు నొక్కి చెప్పారు. జాతీయ డేటా ప్రధాన వనరుల చుట్టూ పారదర్శకత క్షీణించటంతో డేటా నాణ్యత, జవాబుదారీతనం నిర్ధారించటం చాలా కష్టమైందని చెప్తున్నారు.

సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదర్శ ప్రజానేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ అధ్యక్షులు రూపుల వివేక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ క్లబ్ ఆధ్వర్యంలో పార్కులోని సుందరయ్య విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సుందరయ్య నిజాం రాచరిక పరిపాలనకూ, భూస్వాముల దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. పేదలనే తన పిల్లలుగా భావించి కించిత్తు స్వార్థం లేకుండా నిస్వార్థంగా, నిరాడంబరంగా తుది శ్వాస వరకు ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన గొప్ప యోధుడు ఆయన అని కొనియాడారు. ప్రతీ ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ఆయన నుండి స్ఫూర్తి పొందాలన్నారు రాజకీయాలంటే ప్రజాసేవ అని రుజువు చేసిన సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ వి నాగభూషణం పార్క్ జనరల్ సెక్రెటరీ వెంకటస్వామి గౌడ్, పార్కు మాజీ ప్రెసిడెంట్ సలిపెల రమేష్ రెడ్డి, సీనియర్ వాకర్ సభ్యులు ఐలినేని కిషన్ రావు, రవికుమార్ సాగర్ రెడ్డి, రాఘవరెడ్డి,కందుకూరి నర్సిహ్మ, మనోహర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నారాయణ అంజయ్య, నారాయణ గౌడ్, వాకర్స్ క్లబ్ సభ్యులు తీగల సాగర్, టీ స్కైలాబ్ బాబు, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లపై

కాంగ్రెస్ దాడికి హరీశ్‌రావు ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్



పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లపై కాంగ్రెస్ దాడి చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. ఎక్స్ వేదికగా ఆయన ఆదివారం స్పందించారు. ఔటర్‌రింగ్ రోడ్డుపై 20 కార్లతో వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. డీజీపీ, రాచకొండ కమిషనర్ వెంటనే పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలా దాడులకు పాల్పడడం గర్హనీయమని విమర్శించారు. ఇలాంటి దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.



గురుకులాలకు

పూర్వ వైభవం తీసుకురావాలి

- విశ్రాంత ఐఏఎస్ విజయకుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకుల వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేయటం ద్వారా వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని రిటైర్డ్ ఐఏఎస్ విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని డిక్కీ కార్యలయంలో జరిగింది. టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విజయకుమార్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గురుకులాలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవి ఎంతగానో తోడ్పడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పరమశివ చొక్కాలింగం, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బొల్ల రాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ గురుకులాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రిన్సిపాళ్లని సన్మానించారు.

సొంత జిల్లాలోనే టెట్ కేంద్రాలు

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షా కేంద్రాలను దూర ప్రాంతాల్లో కేటాయించడం సరికాదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. సొంత జిల్లాలోనే వాటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు దరఖాస్తు చేసిన సందర్భంలో సొంత జిల్లాలో కేంద్రాల కేటాయింపు కోసం ఆప్షన్లు ఇచ్చినా ఆన్‌లైన్ పరీక్ష పేరుతో హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలు కేటాయించడం సరికాదని తెలిపారు. సొంత జిల్లాలో పరీక్ష కేంద్రాలు కేటాయించి అభ్యర్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరారు. గతం కంటే పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.వెయ్యికి పెంచిన ప్రభుత్వం పరీక్షా కేంద్రాలను దూరప్రాంతాలకు కేటాయించడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు.

40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

- ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్



ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే 40 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని అమలు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి రవి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నుంచి టెట్‌పై సానుకూలమైన వివరణ రావడంతోపాటు ఎస్జీటీలకు టెట్ నుంచి మినహాయింపునిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో వెంటనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనల్లేక, పర్యవేక్షణాధికారి పోస్టులు భర్తీ కాక విద్యాశాఖలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన 317 జీవోపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం రెండు వెంటనే విడుదల చేయాలని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యా వాలంటీర్లు, పాఠశాల పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అన్ని రకాల గురుకుల, ఆశ్రమ, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలనీ, వారికి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, సంఘ మాస పత్రిక చీఫ్ ఎడిటర్ ఎల్ఎం ప్రసాద్, నాయకులు జుట్టు గజేందర్, ఎం రంగారావు, శ్రీధర్ రావు, పోల్ రెడ్డి ఆర్ సుధాకర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, మాతంగి శంకర్, బి రవీంద్ర, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా రెడ్డి, శీతల్ చౌహాన్, ప్రేమ్ కుమార్‌తోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్-హమాస్ చర్చలలో 'ప్రతిష్టంభన'

మీడియా



జెరూసలెం : ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు తీవ్ర విబేధాల కారణంగా నిలిచిపోయాయని ఇజ్రాయెలీ బ్రాడ్‌కాస్టర్ కాన్ వార్తాసంస్థ అనామక మూలాలను ఉటంకిస్తూ నివేదించింది. కతార్, ఈజిప్టుల మధ్యవర్తిత్వంతో కొనసాగుతున్న చర్చలలో "ప్రతిష్టంభన" ఏర్పడిందని హారెట్జ్ పత్రిక ధవీకరించింది. గత అక్టోబరులో గాజాలోని హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1,200 మందిని చంపి, వందలాది మందిని అపహరించారు. వారిలో ఎక్కువ మంది పౌరులు, అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ సైన్యం జనసాంద్రత కలిగిన పాలస్తీనియన్ భూభాగం గాజాపైన అప్పటి నుంచి భారీ వైమానిక బాంబు దాడులను చేస్తోంది. గాజాలోని హమాస్-నియంత్రిత ఆరోగ్య అధికారుల ప్రకారం ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్ 35,000 మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలిగొంది. దాదాపు 80,000 మంది గాయపడ్డారు.

ఖతారీ, ఈజిప్షియన్, అమెరికా మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణకు ఇరువర్గాలు అంగీకరించేలా చేయటానికి నెలల తరబడి ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రయత్నాలు స్పష్టంగా ఫలించలేదు. "ఈజిప్ట్, ఖతార్ లు హమాస్ వాదనను సమర్థించటం వల్ల" చర్చలు "ప్రస్తుతం జరగడం లేదు" అని కాన్ శుక్రవారం తన నివేదికలో ఆరోపించింది. కాన్ మీడియా సంస్థ ప్రకారం, బందీలను విడుదల చేయడానికి బదులుగా కాల్పుల విరమణను పాటించాలని మధ్యవర్తులు సూచించారు.

పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ మధ్య "తీవ్ర స్థాయిలో" అభిప్రాయ భేదాలు ఉన్నాయని, ప్రత్యేకించి ప్రతి ఒక్కటి "యుద్ధం ముగింపు"ని ఎలా నిర్వచించాలనే దానిపై కాన్ దాని అనామక మూలాలను ఉటంకిస్తూ పేర్కొంది. గ్రూప్ అభ్యర్థన మేరకు ఖైదు చేయబడిన హమాస్ మిలిటెంట్లను బేషరతుగా విడుదల చేయడానికి ఇజ్రాయెల్ నిరాకరించడం వివాదాస్పదమైన మరొక ప్రధాన అంశంగా ఉంది. చర్చలు "ప్రస్తుతం ప్రతిష్టంభనలో ఉన్నాయి. ఎటువంటి పురోగతి లేదు" అని చర్చల గురించి తెలిసిన పేరులేని విదేశీ మూలాన్ని ఉటంకిస్తూ శనివారంనాడు ఇజ్రాయెల్ వార్తా పత్రిక హారెట్జ్ నివేదించింది.

ఇటీవలి వారాలలో "కొంత కదలికను" చూశామని, అయితే "దురదృష్టవశాత్తు విషయాలు సరైన దిశలో కదలటం లేదని" మంగళవారం ఖతార్ ప్రధాన మంత్రి, షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్రహ్మాన్ అల్ థానీ వెల్లడించాడు. "ప్రస్తుతం, మేము దాదాపు ప్రతిష్టంభన స్థితిలో ఉన్నాము" అని అతను చెప్పాడు. "యుద్ధాన్ని ముగించాలని కోరుకునే ఒక పార్టీ ఉంది, అది బందీల గురించి మాట్లాడుతుంది. బందీల విడుదలను కోరుకునే పార్టీ ఉంది. అది యుద్ధాన్ని కొనసాగించాలని కోరుకుంటుంది" అని షేక్ అల్ థానీ అన్నాడు. ఈ ప్రాథమిక సమస్యపై ఇజ్రాయెల్, హమాస్ ఒక అవగాహనకు రాకపోతే చర్చల పురోగతిపై పెద్దగా ఆశ లేదని ఆయన హెచ్చరించాడు. ఇజ్రాయెల్ చిత్తశుద్ధితో శత్రుత్వానికి ముగింపు పలకాలని కోరుతున్నదా? అని కూడా ఖతార్ ప్రధాని ప్రశ్నించాడు.

ప్రపంచ సమస్తం

ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా

'ఇతరులను నిందించటం మానుకోవాలి' - చైనా



బీజింగ్ : ఉక్రెయిన్ సంక్షోభానికి అమెరికా విధానాలే ప్రత్యక్ష కారణమని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ శుక్రవారం మాట్లాడుతూ అన్నాడు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు చైనా సహాయ, సహకారాలను అందిస్తున్నదన్న అమెరికా ఆరోపణకు సమాధానంగా చైనా ఈ ప్రకటన చేసింది. "రష్యా రక్షణ రంగాన్ని బలోపేతం చేయటం" ద్వారా "యూరోపియన్ భద్రతకు అతిపెద్ద ముప్పును పెంచుతూ" చైనా పశ్చిమ దేశాలతో బలమైన సంబంధాలను కలిగివుండలేదని గురువారం అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి వేదాంత్ పటేల్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణకు ప్రతిగా, "చైనాపై నిందలు మోపడం మానేయండి. చైనా, ఐరోపా మధ్య చీలికను తేవటానికి ప్రయత్నించవద్దు" అని వాంగ్ అమెరికాను కోరాడు.

"అమెరికా ఇప్పటికీ ప్రచ్ఛన్న యుద్ధకాల మనస్తత్వాన్ని వదులుకోవటం లేదు. అందువల్లనే ఉక్రెయిన్ సంక్షోభం తీవ్రతరం కావడానికి దారితీసింది" అని అతను చెప్పాడు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య వివాదంలో వాషింగ్టన్ స్పష్టంగా "శాంతిని కోరుకునే బదులు శత్రువుల కోసం వెతుకుతోంది" అని చైనా ప్రతినిధి వాదించాడు. నిరాధారమైన ఆరోపణలతో "అగ్నికి ఆజ్యం పోయడం" ఆపాలని, అందుకు బదులుగా సంక్షోభానికి ఒక "రాజకీయ పరిష్కారాన్ని కనుగొనడంలో నిజమైన సహకారం అందించడం ప్రారంభించండి" అని అతను అమెరికా అధికారులను కోరాడు. "ఉక్రెయిన్ సంక్షోభానికి చైనా కారణం కాదు. మేము శాంతి, సంభాషణల వైపు ఉన్నాము. శాంతి చర్చలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నాము. సమతుల్య, ప్రభావవంతమైన, స్థిరమైన యూరోపియన్ భద్రతా నిర్మాణానికి మేము చురుకుగా మద్దతు ఇస్తున్నాము" అని వాంగ్ పేర్కొన్నాడు.

బీజింగ్ ఉక్రెయిన్ వివాదంపై తటస్థ విధానాన్ని కొనసాగించింది. రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాల ఒత్తిడిని తిరస్కరించింది. మాస్కోతో ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, పరస్పర వాణిజ్యాన్ని విస్తరించడం కొనసాగించింది. చైనా నుంచి రష్యాకు జరుగుతున్న ఎగుమతుల్లో ద్వంద్వ-వినియోగ భాగాలు ఉంటున్నాయని, అవి ఆయుధాల తయారీకి ఉపయోగపడి రష్యా రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని అమెరికా, దాని నాటో మిత్రదేశాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఎగుమతులను ఆపకపోతే చైనాపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని అమెరికా పదేపదే బెదిరిస్తోంది.

అయితే తాము రష్యాకుగానీ, ఉక్రెయిన్‌కు గానీ ఆయుధాలను విక్రయించడం లేదని, రష్యా, చైనా మధ్య కొనసాగుతున్న "సాధారణ" వాణిజ్య, ఆర్థిక సంబంధాలను అమెరికా "అసమంజసంగా" విమర్శిస్తూ అమెరికా ఉక్రెయిన్‌కు బిలియన్ల డాలర్ల సహాయాన్ని అందిస్తున్నదని వాంగ్ విమర్శించాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రస్తుతం చైనాలో అధికారిక పర్యటనలో ఉన్నాడు. అక్కడ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యాడు. వారిద్దరూ ఉక్రెయిన్ వివాదంపై తమ వైఖరిని పునరుద్ఘాటించారు. అది "రాజకీయ మార్గాల ద్వారా పరిష్కరించబడాలి" అని గురువారం వారు విడుదల చేసిన ఓ సంయుక్త ప్రకటన పేర్కొంది.